శుక్రవారం
5•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 10
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

బంగారు ఆభరణాలపై ఆషాఢం ఆఫర్లు
చెన్నయ్ జ్వాయలర్స్
916 గోల్డ్ • వైరుంధ్య • సెల్ఫీ జ్వాయలర్స్

కేజీలలో షాపింగ్.. టన్నులలో ఫీలింగ్

వచ్చేసింది ఆషాఢం కేజీ సేల్.. ఇక మీదే ఆలస్యం

AADI KG SALE
Once in a Year
OFFER

టన్నులకొద్దీ వెరైటీలు
లెక్కకుమించి డిజైన్లు
అతితక్కువ ధరలు

నమ్మశక్యంకాని
ఆషాఢం అద్భుత ఆఫర్లు

The CHENNAI SHOPPING MALL

చీరలపై ఆఫర్లు

- 2 ఆరణి చెక్స్ శారీస్ ₹333
- 2 కుప్పాడం జరీ శారీస్ ₹444
- 2 మాస్టర్ కార్డ్ శారీస్ ₹555
- 2 దేవిక సిల్క్ శారీస్ లేక విపుల్ కేటలాగ్ శారీస్ ₹666
- 2 కాంచీపురం చెక్ శారీస్ లేక బెంటెక్స్ సాఫ్ట్ సిల్క్ శారీస్ ₹777
- 2 లెనిన్ ఎంబ్రాయిడరి శారీస్ లేక మనిపురి సిల్క్ శారీస్ ₹888
- 2 బనారస్ కాటన్ శారీస్ లేక ఫ్యాన్సీ పటోలా శారీస్ ₹999

సంవత్సరంలో ఒక్కసారే వచ్చే
అద్భుత అవకాశం

లేడీస్ వేర్ ఆషాఢం ఆఫర్లు

- 8 లెగ్గింగ్స్ ₹999 ONLY
- 2 పటియాల సూట్స్ ₹777 ONLY
- 4 కుర్తీస్ ₹999 ONLY
- 4 డ్రస్ మెటీరియల్స్ ₹999 ONLY

మెన్స్‌వేర్‌పై ఆఫర్లు

- 3 క్యాజువల్ షర్ట్స్ ₹999 ONLY
- 2 జీన్స్ ₹999 ONLY
- 3 ట్రౌజర్స్ ₹999 ONLY
- 3 లోవర్స్ ₹999 ONLY

కిడ్స్‌వేర్ ఆఫర్లు

- 2 ఫ్రాక్స్ ₹333 ONLY
- 2 షర్ట్స్ ₹444 ONLY
- 3 టాప్స్ ₹444 ONLY
- 3 టి-షర్ట్స్ ₹444 ONLY
- 3 3/4 ప్యాంట్స్ ₹444 ONLY
- 3 3/4 ప్యాంట్స్ ₹444 ONLY
- 5 లెగ్గింగ్స్ ₹555 ONLY
- 3 బాబా సూట్స్ ₹555 ONLY

*Conditions apply.

బంగారు ఆభరణాలపై ఆషాఢం ఆఫర్లు

- 6% మాత్రమే తరుగు — చైన్స్ మరియు బేంగిల్స్ పై
- 1250 శాతం వరకు — 10 గ్రాముల 916 బంగారు ఆభరణాలపై
- తరుగు - మజూరీ లేదు — సిల్వర్ ఆర్టికల్స్ పై
- పాత బంగారు నగల మార్పిడిపై 10 గ్రా.కు 1000/- అధికంగా పొందండి

Siddipet | Patny Center | Kukatpally | Mehdipatnam | Kothapet | Ameerpet | Chandanagar | A.S.Rao Nagar | Suchitra | Kammam | Guntur

'మిసెస్ ఇండియా ఫొటోజెనిక్'గా రేణుక

ముంబైలో జరిగిన ఫైనల్స్‌లో టైటిల్ గెలుచుకున్న కరీంనగర్ మహిళ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ పట్టణానికి చెందిన రేణుక కుంభం 'మిసెస్ ఇండియా ఫొటోజెనిక్'గా ఎంపికయ్యారు. ప్రముఖ చిత్రకారుడు కాపు రాజయ్య మనుమరాలైన రేణుక.. ముంబైలో జరిగిన సావీ మిసెస్ ఇండియా -2019 పోటీల్లో ఫైనలిస్టుగా నిలిచి సత్తాచాటారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన 34 మంది ఈ పోటీల్లో ఫైనలిస్టులుగా ఎంపికకాగా.. గృహిణుల విభాగంలో రేణుక ఒక్కరే పోటీచేయడం విశేషం. తొలి మూడు స్థానాల్లో రేణుక చోటు దక్కించుకోలేకపోయినప్పటికీ 'మిసెస్ ఇండియా ఫొటోజెనిక్' టైటిల్‌ను ఆమె కైవసం చేసుకున్నారు. భర్త రమేశ్ కుంభం కర్ణాటకలో ప్రభుత్వ ఉన్నతాధికారిగా విధులు నిర్వర్తిస్తుండటంతో రేణుక బెంగళూరులో నివసిస్తున్నారు. గృహిణిగా తన ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నించిన రేణుకను భర్త, ఇద్దరు పిల్లలు ప్రోత్సహించడంతో ఆమె కల సాకారమైంది. 'మిసెస్ ఇండియా ఫొటోజెనిక్' టైటిల్ లభించడంపై రేణుక స్పందిస్తూ.. 'పెండ్లయిన తర్వాత పైబడే బాధ్యతల కారణంగా ఏమీచేయలేమని చాలా మంది గృహిణులు అనుకుంటారు. కానీ గృహిణిగా ఉంటూనే అనుకున్నది సాధించగలమని నిరూపించేందుకు నేను ప్రయత్నించా. ఈ ప్రయత్నానికి నా భర్త, పిల్లలు పూర్తిగా సహకరించారు. ఇలాంటి ప్రోత్సాహం లభిస్తే ప్రతి గృహిణీ తన కలలను సాకారం చేసుకోగలదు' అని పేర్కొన్నారు.

గురువారం బంజారాహిల్స్‌లో జగన్నాథుని రథయాత్ర, భారీగా హాజరైన భక్తులు

వైభవంగా జగన్నాథ రథయాత్ర

- బంజారాహిల్స్‌లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- పూజల్లో పాల్గొన్న గవర్నర్ నరసింహన్ దంపతులు

తాడుతో జగన్నాథ రథాన్ని లాగుతున్న గవర్నర్ నరసింహన్ దంపతులు

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డునంబర్ 12లోని జగన్నాథ ఆలయం వద్ద గురువారం జగన్నాథ రథయాత్రను శోభాయమానంగా నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాలు, కోలాటాలు, నృత్యాలు, భజనల నడుమ రథయాత్ర సాగింది. నగరం నలుమూలల నుంచి విచ్చేసిన ఒడిశావాసులతోపాటు భక్తులు రథయాత్రను తిలకించేందుకు పోటీపడ్డారు. ముందుగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రథయాత్ర కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ దంపతులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల ఉత్సవమూర్తులను మూడురథాలపైకి చేర్చడంతోపాటు పూజలు చేశారు. రథాన్ని గవర్నర్ దంపతులు బంగారు చీపురుతో శుభ్రంచేయడంతోపాటు హారతిని ఇచ్చారు. జై జగన్నాథ్ మహరాజ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం వేల మంది భక్తులు స్వామివారి మూడు రథాలను లాగుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. రథయాత్ర సందర్భంగా ప్రధాన రోడ్లపై వాహనాల రద్దీ ఏర్పడటంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. రథయాత్రను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీటిని సరఫరా చేశారు.

మూడ్రోజులు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం ప్రభావం: హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గిలో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, రంగారెడ్డి జిల్లా యాచారం, మహబూబ్‌నగర్ జిల్లా మద్దూర్, కామారెడ్డి జిల్లా నాగారెడ్డిపేట, సిద్దిపేట జిల్లా గజ్వేల్, ఖమ్మం వైరా, కొణిజర్ల, కూసుమంచి, చింతకాని, కామేపల్లి మండలాల్లో వర్షం పడింది.

నేడు గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం

హైదరాబాద్ సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని పలుచోట్ల గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, బేగంపేట, అబిడ్స్, నాంపల్లి, కార్వాన్, మెహిదీపట్నం, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జీడిమెట్ల, అమీర్‌పేట, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, చందానగర్, ప్యారడైజ్, ప్యాట్నీ, బోయిన్‌పల్లి, అడ్డగుట్ట, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, చిలుకలగూడ, దిల్‌సుఖ్ నగర్, కాలాపత్తర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.6 డిగ్రీలు, గాలిలో తేమ 67 శాతంగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

నిజామాబాద్ జిల్లా మోస్రాలో ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో గిరిజన దుస్తుల్లో బాధ్యతలు స్వీకరిస్తున్న చివ్వెంల ఎంపీపీ ధరావత్‌కుమారి

నిజామాబాద్ జిల్లా వేల్పూరులో ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కొలువుదీరిన కొత్త ఎంపీపీలు

ఎంపీటీసీల ప్రమాణ స్వీకారం.. మండలాల్లో కొత్తపాలకవర్గాలు కొలువు

487 మండలాల్లో బాధ్యతల స్వీకరణ.. నేడు ఆసీనులు కానున్న జెడ్పీ చైర్మన్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 487 మండలపరిషత్‌లలో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. ముందుగా ఎంపీటీసీలు ప్రమాణం స్వీకారం చేయగా.. తర్వాత మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం వారివారి స్థానాల్లో ఆసీనులయ్యారు. ప్రమాణస్వీకారోత్సవానికి పలువోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, ఎంపీపీల పదవీకాలం బుధవారం ముగిసిన విషయం తెలిసిందే. గురువారం కొత్తసభ్యులు పదవుల్లోకి వచ్చారు. 487మండలాల్లో ఎంపీటీసీలు, ఎంపీపీలు బాధ్యతలు చేపట్టగా.. 51మండలాల్లో ఆగస్టు 6న కొలువుదీరనున్నాయి.

మంచిపాలన అందించాలి: స్పీకర్ పోచారం

కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు మంచిపాలన అందించి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా మోస్రా తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మోస్రా, వర్ని ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కొత్త మండలాలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలసికట్టుగా అభివృద్ధికి కృషిచేయాలన్నారు.

మన్ననలు చూరగొనాలి: మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ఎంపీపీలు, ఎంపీటీసీలు ప్రజల మన్ననలు చూరగొనాలని రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ, కమ్మర్‌పల్లి, వేల్పూరు, ఏర్గట్ల, మెండోరా, భీమ్‌గల్, ముప్కాల్, మోర్తాడ్ మండలాల ఎంపీపీలు, ఎంపీటీసీల ప్రమాణ స్వీకారకార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు పోటీపడి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్‌తోనే స్థానిక వైభవం: మంత్రి జగదీశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి స్థానిక సంస్థలే పట్టుగొమ్మలని, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో స్థానిక సంస్థలకు వైభవం రానున్నదని విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్ ఎస్, తుంగతుర్తి, మద్దిరాల, నూతన కల్, అర్వపల్లి, నాగారం ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న పద్ధతుల్లో ప్రజాప్రతినిధులు ఉండాలని సూచించారు.

పార్టీలకతీతంగా పనిచేయాలి: మంత్రి మల్లారెడ్డి

మండల పాలకవర్గ సభ్యులు పార్టీలకతీతంగా, అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, కీసర, మూడుచింతలపల్లి మండల ఎంపీపీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్, హన్వాడ ఎంపీపీ, ఎంపీటీసీల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

జనగామ జిల్లాలో..

జనగామలోని 12 మండలాల్లో ఎంపీపీ, ఎంపీటీసీలు ప్రమాణస్వీకారం చేశారు. జనగామలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హన్వాడ ఎంపీపీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ పాలకవర్గంతో ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యే రాజయ్య

నేడు జిల్లా పరిషత్‌లలో..

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీకాలం గురువారంతో ముగిసింది. పాతజిల్లాలతోపాటు, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో శుక్రవారం కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టనున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు ప్రమాణం స్వీకరించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఆగస్టు 7న కొత్తపాలకవర్గాలు బాధ్యతలు స్వీకరిస్తాయి. కొత్త జిల్లాల్లో జెడ్పీ చైర్మన్ల ప్రమాణస్వీకారోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

రాష్ట్రాల పరిధిలోని అంశాలను..

లోక్‌సభలో ఎలా ప్రస్తావిస్తారు?

- బీజేపీ, కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్‌కు టీఆర్ఎస్ ఫిర్యాదు
- ఇకపై ఇలా జరుగకుండా చూస్తామని ఓం బిర్లా హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రాల పరిధిలోని అంశాలను లోక్‌సభలో ఎలా ప్రస్తావిస్తారని టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు ప్రశ్నించారు. అందుకు సభ్యులకు అవకాశం ఇవ్వొద్దని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లాను గురువారం కలిసి బీజేపీ, కాంగ్రెస్ సభ్యులపై ఫిర్యాదు చేశారు. బుధవారం లోక్‌సభలో లేని సీఎం కేసీఆర్‌పై ఆరోపణలు చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించడం సరికాదని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పీకర్ సానుకూలంగా స్పందించారు. ఇకపై ఇలా జరుగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాల పరిధిలోని అంశాలను లోక్‌సభలో ప్రస్తావించడం సరికాదని, సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేస్తామని, అలా మాట్లాడేవారికి అవకాశం ఇవ్వబోమని ఓం బిర్లా స్పష్టంచేశారు.



గురువారం ఢిల్లీలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాను కలిసిన ఎంపీలు

ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో కేంద్రం నిర్లక్ష్యం: లోక్‌సభ జీరోఅవర్‌లో ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో వెంటనే బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేయాలని ఎంపీ మాలోతు కవిత డిమాండ్‌చేశారు. గురువారం లోక్‌సభలో జీరోఅవర్‌లో ఆమె మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గ ప్రాంతంలో గిరిజనులకు, ఆదివాసీలకు ఎలాంటి ఉపాధి అవకాశాలులేవని, ఉక్కు పరిశ్రమతో వేలాదిమందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొని ఐదేండ్లు పూర్తయిందని కానీ, ఇంతవరకు ఎలాంటి పురోగతిలేదని, ఈ విషయంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు.

పాస్‌పోర్ట్ సేవాకేంద్రం ఏర్పాటుచేయండి: ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో పాస్‌పోర్ట్ సేవాకేంద్రం ఏర్పాటుచేయాలని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రం లేక స్థానికులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని చెప్పారు. రాజ్యసభ జీరోఅవర్‌లో ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాకేంద్రంలో కేంద్రీయ విద్యాలయాన్ని కూడా ఏర్పాటుచేయాలని కోరారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పాటుచేసి మూడేండ్లయిందని, జిల్లాకో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటుచేయాలనే నిబంధన చట్టంలో ఉన్నదని గుర్తుచేశారు. 65వ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జీలు నిర్మించాలని విజ్ఞప్తిచేశారు.

ఫెడరలిజానికే టీఆర్ఎస్ మద్దతు

టీఆర్ఎస్ పార్టీ ఫెడరలిజానికి మద్దతు తెలుపుతున్నదని, కేంద్రీకరణ విధానానికి వ్యతిరేకమని టీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ నాయకుడు కే కేశవరావు స్పష్టంచేశారు. రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో చదువుకొనే ఒకవిద్యార్థి సిలబస్‌ను కూడా కేంద్రం నిర్ణయిస్తున్నదని, ఈ విధానం సరైందికాదన్నారు. గురువారం రాజ్యసభలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. మెడికల్ కౌన్సిల్ సవరణపై ఇప్పటికే అనేకసార్లు కోర్టుల్లో కేసులు నడిచాయని, పలుమార్లు నిపుణుల కమిటీ పరిశీలనకు వెళ్లాయని తెలిపారు. దీనికి అనేకసార్లు ఆర్డినెన్స్ తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌పై ప్రభుత్వం తాత్కాలికంగా కాకుండా దీర్ఘకాల నిర్ణయాలు తీసుకోవాలని కేకే కోరారు.

32 జెడ్పీలకు కొత్త సీఈవోలు

నేటినుంచి విధుల్లో చేరాలని ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాపరిషత్ (జెడ్పీ)లకు కొత్త సీఈవోలను నియమిస్తూ పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం కొత్త జెడ్పీల ఆవిర్భావం, తొలి సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో అత్యవసర ఆదేశాలిచ్చారు. సీఈవోలుగా పదోన్నతి పొందినవారిలో ఉమ్మడి జిల్లా పరిషత్‌ల్లో డిప్యూటీ సీఈవోలు, డీఆర్డీఏ పీడీలు, ఏపీడీలు, అకౌంట్ ఆఫీసర్లు, ఇతర విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నవారు ఉన్నారు. వారంతా గురువారం ఆయా శాఖల నుంచి రిలీవ్ కావాలని, శుక్రవారం జెడ్పీ సీఈవోలుగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో వారిని వెంటనే రిలీవ్‌చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూప్రసాద్ అన్నిజిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్లు, ఆయాశాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా ఉమ్మడి ఖమ్మం జెడ్పీ పదవీకాలం ఆగస్టు 4వ తేదీ వరకు ఉన్నది. ఆ జిల్లా నుంచి నూతనంగా ఏర్పాటైన భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా పరిషత్‌లు ఆగస్టు 5న కొలువుదీరనున్నాయి. ఈ జిల్లాలకు కూడా సీఈవోలను నియమించారు. జెడ్పీల్లో అకౌంట్ ఆఫీసర్లను కూడా నియమించారు.

వివిధ జిల్లాలకు సీఈవోలుగా నియమితులైనవారి జాబితా

జిల్లా పేరు	సీఈవో పేరు	జిల్లా పేరు	సీఈవో పేరు
ఆదిలాబాద్	డీ వేణు	ఖమ్మం	సీ ప్రియాంక
మంచిర్యాల	కే నరేందర్	భద్రాద్రికొత్తగూడెం	మధుసూదన్‌రావు
నిర్మల్	ఎం సుధీర్	మెదక్	టీ రవి
కుమ్రంభీం ఆసిఫాబాద్	ఎస్ కిషన్	సంగారెడ్డి	ఎం లక్ష్మీబాయి
కరీంనగర్	వెంకట మాధవరావు	సిద్దిపేట	బీ శ్రావణ్‌కుమార్
జగిత్యాల	ఏ శ్రీనివాస్	మహబూబ్‌నగర్	బీ వసంతకుమారి
పెద్దపల్లి	ఎం శ్రీనివాస్	వనపర్తి	పీ నర్సింహులు
రాజన్న సిరిసిల్ల	బీ గౌతంరెడ్డి	నాగర్‌కర్నూల్	కే నాగమణి
నిజామాబాద్	ఐ గోవింద్	జోగుళాంబ గద్వాల	ఎం జ్యోతి
కామారెడ్డి	జీ కాంతమ్మ	నారాయణపేట	ఎం కాళిందిని
వరంగల్ అర్బన్	ఎస్ ప్రసూనరాణి	నల్లగొండ	కే వీరబ్రహ్మచారి
వరంగల్ రూరల్	ఏ రాజారావు	సూర్యాపేట	ఎల్ విజయలక్ష్మి
జయశంకర్ భూపాలపల్లి	డీ శిరీష	యాదాద్రిభువనగిరి	సీహెచ్ కృష్ణారెడ్డి
ములుగు	ఏ పారిజాతం	రంగారెడ్డి	జీ జితేందర్‌రెడ్డి
జనగామ	టీ రమాదేవి	వికారాబాద్	సీ శ్రీకాంత్‌రెడ్డి
మహబూబాబాద్	ఆర్ సన్యాసయ్య	మేడ్చల్ మల్కాజిగిరి	బీ దేవసహాయం

హమాలీలకు బీమా, పీఎఫ్

మహబూబాబాద్‌లో 5 వేల టన్నుల శీతల గిడ్డంగి

నల్లగొండలో అత్యాధునిక గోదాములు: చైర్మన్ సామ్యేల్ వెల్లడి

మండుల సామ్యేల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రప్రభుత్వ గిడ్డంగుల్లో పనిచేస్తున్నహమాలీలకు ఆరోగ్యబీమా, భవిష్యనిధి (పీఎఫ్) సదుపాయాలను కల్పించాలని నిర్ణయించినట్టు తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ మండుల సామ్యేల్ తెలిపారు. అత్యధిక బరువులను మోస్తూ హమాలీలు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. గురువారం నాంపల్లిలోని గిడ్డంగుల సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి సంస్థ ప్రగతిని వివరించారు. తెలంగాణలోని అన్ని గిడ్డంగులకు సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. మహబూబాబాద్‌లో 5 వేల టన్నుల సామర్థ్యంతో శీతల గిడ్డంగిని, నల్లగొండలో అత్యాధునిక సౌకర్యాలతో గోదాములను నిర్మించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2.80 లక్షల టన్నులుగా ఉన్న తెలంగాణలోని గోదాముల సామర్థ్యాన్ని సీఎం కేసీఆర్ ముందుచూపు, సహకారంతో 21 లక్షల టన్నులకు పెంచి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో సాగువిస్తీర్ణం మరింత పెరుగుతుందని, దానికి అనుగుణంగా గిడ్డంగుల సామర్థ్యాన్ని 50 లక్షల టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. కార్పొరేషన్‌లో సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. ఈనెల 8న అనంతగిరిలో జరిగే బోర్డుసమావేశంలో పలు నిర్ణయాలకు ఆమోదం తెలుపనున్నట్టు చెప్పారు.

బెంజ్‌కారులో ఆత్మహత్యాయత్నం!

- ఓఆర్ఆర్‌పై తుపాకీతో కాల్చుకొన్న కన్సల్టెన్సీ వ్యాపారి
- కుడికణత నుంచి ఎడమ కణత ద్వారా బయటకు వచ్చిన బుల్లెట్
- వ్యాపారంలో నష్టమే కారణమా?

మణికొండ/హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై బెంజ్‌కారులో వచ్చిన ఓ కన్సల్టెన్సీ వ్యాపారి తుపాకీతో కాల్చుకొనిఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం కేర్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లోయర్ ట్యాంక్‌బండ్‌కు చెందిన ఫైజాన్ అహ్మద్ విదేశీ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం మూడుగంటల ప్రాంతంలో ఓఆర్ఆర్‌పై మంచిరేవుల వద్ద కారు ఆపి.. తుపాకీతో కాల్చుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఫైజాన్ అహ్మద్ తన కుడికణత దగ్గర కాల్చుకోగా.. బుల్లెట్ షెల్.. ఎడమకణత ద్వారా బయటికి వచ్చి, కారు అద్దాలను చీల్చుకొని వెళ్లింది. పెట్రోలింగ్ పోలీసులు అపస్మారకస్థితిలో ఉన్న అతడ్ని గచ్చిబౌలిలోని కేర్ దవాఖానకు తరలించారు. ఫైజాన్ తమ వద్ద బెంజ్‌కారు (టీఎస్09 యూబీ 6040)ను గత అక్టోబర్‌లో అద్దెకు తీసుకొని.. ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నాడని యజమానులు పోలీసులకు తెలిపారు. ఫైజాన్ ఆత్మహత్యాయత్నానికి ఉపయోగించిన తుపాకీని ఎక్కడి అనే దానిపై దృష్టిపెట్టారు. ఫోన్‌కాల్స్, ఈ మెయిల్స్, సోషల్‌మీడియా ఖాతాలను సేకరిస్తున్నారు. పోలీసులు ఫైజాన్ అహ్మద్ స్నేహితులను విచారించగా.. వ్యాపారంలో నష్టంతోపాటు, బెట్టింగ్‌ల కోసం దాదాపు రూ.ఐదుకోట్ల వరకు అప్పులుచేశాడని తెలిసింది.

దవాఖానలో చికిత్స పొందుతున్న ఫైజాన్

ఆత్మహత్యాయత్నం అనంతరం అపస్మారక స్థితిలో ఉన్న ఫైజాన్ అహ్మద్

టీపీజేఏ ఫొటోగ్రఫీ పోటీలు

ఆగస్టు 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం-2019ని పురస్కరించుకొని తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు జీ భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టులు ఆగస్టు 5వ తేదీ వరకు తమ దరఖాస్తులు పంపాలని గురువారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు పంపిన ఉత్తమ ఛాయాచిత్రాలను ఆగస్టు 14 నుంచి 19వ తేదీ వరకు రవీంద్రభారతిలో ప్రదర్శిస్తామని చెప్పారు. మూడు క్యాటగిరీల్లో వేర్వేరుగా తొమ్మిది మంది విజేతలకు ఆగస్టు 19న బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఉత్తమ ఫొటోల ఎంపిక కోసం క్యాటగిరీ 1లో పబ్లిష్‌అయిన బెస్ట్ పిక్చర్, క్యాటగిరీ 2లో సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు, చెరువులు, పల్లెఅందాలు, గ్రామీణజీవితం, వ్యవసాయం, చేతివృత్తులు, ఉపాధి అంశాలు, క్యాటగిరీ 3లో ప్రాచీనకట్టడాలు, పర్యాటక ప్రాంతా లు, కట్టు-బొట్టు, జాతరలు, పండుగలు, కళలు, కళాకారులు, కళారూపాలు వంటి అంశాలపై తీసిన ఫొటోలు పంపాలని సూచించారు. 12/18, 12/15 సైజులో ఎఫ్‌డీసీ కాంప్లెక్స్ సమాచార భవన్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయానికి పంపించాలని, tpja999<\@>gmail.com కు సాఫ్ట్ కాపీలు కూడా పంపాలని, వివరాల కోస

శుక్రవారం
5•7•2019
కరీంనగర్

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

అమ్మా బైలెల్లినాదో..

ఆషాఢ బోనాల సంబురాలు ప్రారంభం

- గోల్కొండ జగదాంబ మహంకాళికి బోనం సమర్పణ
- లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి వేలమందితో సాగిన ఊరేగింపు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని

4

వృద్ధికి ఢోకా లేదు

- ఈసారి 7% జీడీపీ
- 2018-19 ఆర్థిక సర్వే అంచనా
- కేంద్ర డాటాకు తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే దన్ను

న్యూఢిల్లీ, జూలై 4:

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2019-20) వృద్ధిరేటు పరుగులు పెట్టగలదని, దేశ జీడీపీ 7 శాతంగా నమోదు కాగలదని ఆర్థిక సర్వే అంచనా వేసింది. 2024కల్లా దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే 8 శాతం జీడీపీ అవసరమని పేర్కొన్నది. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ముఖచిత్రాన్ని స్పష్టం చేసిన ఈ సర్వే.. ఈ ఆర్థిక సంవత్సరం స్వరూప, స్వభావాలనూ అంచనా వేసింది. దేశ జనాభాలో పనిచేసే వయసున్నవారు తగ్గుతున్నారంటూ.. రిటైర్మెంట్ వయసును పెంచాలని సర్వే రూపకర్త, ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ సూచించారు. కాగా, కృష్ణమూర్తి డాటాకు తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే దన్నుగా నిలువడం గమనార్హం. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో గతంలో ఎప్పుడో చేసిన ఈ సమగ్ర కుటుంబ సర్వే.. దాదాపు 25 ప్రభుత్వ డాటాసెట్లకు అనుసంధానమై ఉన్నది.

వివరాలు 11వ పేజీలో

బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్న ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

నేడే కేంద్ర బడ్జెట్

లోక్‌సభలో ఉదయం 11 గంటలకు.. ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

దేశ చరిత్రలో ఓ పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రి తొలి పద్దు ఇదే

వ్యవసాయం, రైతులు, ఉద్యోగ కల్పన, జీడీపీపైనే ప్రధాన దృష్టి

11

కేంద్ర బడ్జెట్ సిద్ధమైంది. శుక్రవారం ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఉదయం 11 గంటలకు లోక్‌సభలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. దేశ చరిత్రలో ఓ పూర్తిస్థాయి మహిళా ఆర్థికమంత్రి తీసుకొస్తున్న తొలి పద్దు ఇదే కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ప్రకటిస్తున్న ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, రైతులు, ఉద్యోగ కల్పన, జీడీపీ పురోగతిపై మోదీ సర్కారు ప్రధానంగా దృష్టి పెట్టే అవకాశాలున్నాయి. అలాగే ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెంపు, కార్పొరేట్ ట్యాక్స్ కుదింపు వంటి వాటిని అంతా ఆశిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను తెచ్చిన కేంద్రం.. ఇప్పుడు పూర్తిస్థాయి పద్దుతో వస్తుండగా, నాటి ప్రకటనలే నేడూ ఉంటాయా? లేదంటే సీతారామన్ మార్కు కనిపిస్తుందా? అన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతున్నది.

గోదావరికి ప్రాణం

ప్రధాన నదిలోకి ప్రాణహిత వరద

- కాళేశ్వరం వద్ద తొమ్మిది వేల క్యూసెక్కుల ప్రవాహం
- మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌస్‌కు జలకళ
- వరదనీటి నిల్వకోసం బరాజ్ గేట్లు మూసే ఏర్పాట్లు
- నమస్తే తెలంగాణతో ప్రాజెక్టు ఈఈ వెంకటరమణారెడ్డి
- ఒక మోటర్ వెట్‌రన్‌తో అన్నారం బరాజ్‌కు జలాల ఎత్తిపోత
- వారంలో మరో రెండు మోటర్ల వెట్‌రన్

4

గురువారం కన్నెపల్లి పంప్‌హౌస్ ఒకటో మోటర్ పైపుల నుంచి అన్నారం బరాజ్‌కు నీరు ఎత్తి పోస్తున్న దృశ్యం

ఊరూరా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

ఉత్సాహంగా పాల్గొంటున్న పార్టీ శ్రేణులు

7

తైలం కంపెనీ దందా!

రెండువేల కోట్లు మునిగినట్లు ఐపీకి స్కెచ్?

- కోర్టుకు సాక్ష్యాలకోసం వ్యాపారులతో చెలగాటం
- సరైవాలా అగర్ రిఫైనరీస్ మాయాజాలం
- చెయ్యని వ్యాపారానికి బకాయి తాఖీదులు
- లక్షల్లో బాకీలున్నారంటూ కోర్టు నోటీసులు
- సూర్యాపేటలో 181 మంది వ్యాపారులకు రూ.22 కోట్లు బాకీ అంటూ తాఖీదులు
- రాష్ట్రవ్యాప్తంగా వందలమంది వ్యాపారులకు..
- ఎండీని నిలదీస్తే.. తాఖీదులు చించేయాలని ఉచిత సలహా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సరుకు కొన్నదీలేదు.. వ్యాపారం చేసిందీలేదు. కానీ.. బకాయి ఉన్నారంటూ కోర్టునుంచి తాఖీదులు అందుతున్నాయి. వందావెయ్యీ కాదు.. ఏకంగా లక్షల్లో బకాయిలు ఉన్నారంటూ వస్తున్న నోటీసులు.. రాష్ట్రవ్యాప్తంగా వందలమంది కిరాణా దుకాణదారులకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి. ఈ నోటీసుల వరద వెనుక వంట నూనెల కంపెనీ సరైవాలా అగర్ రిఫైనరీస్ మాయాజాలం కనిపిస్తున్నది. బ్యాంకుల్లో చేసిన అప్పులను ఎగ్గొట్టి, ఐపీ పెట్టేందుకు సదరు కంపెనీ రెండువేల కోట్ల రూపాయల మోసానికి కుట్ర పన్ని, అందుకు చిరువ్యాపారులను పావులుగా వాడుకుంటున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతనెలలో సూర్యాపేటలో మొదలైన ఈ లీగల్ నోటీసుల పరంపర రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పాకినట్టు తెలుస్తున్నది. ఏ సంబంధమూ లేని తమకు లక్షల్లో

మిగతా 4వ పేజీలో

మోఖాలో ఉన్నా రికార్డుల్లో మాయం

ధర్మగంట

- పహాణీలోనుంచి వివరాలు తొలగింపు
- కొత్త పాస్‌బుక్ ఇవ్వాలంటే రేపుమాపంటూ కాలయాపన
- రెవెన్యూ అధికారుల తీరుతో తిప్పలుపడుతున్న ఓ వృద్ధురాలు
- ధర్మగంటను ఆశ్రయించిన వరంగల్ అర్బన్ జిల్లావాసి

8

గురువారం గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొట్టెల సమర్పించేందుకు భారీ ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఊరేగింపులో బోనంతో భక్తురాలి నృత్యం

అమ్మా బైలెల్లినాదో..

రాష్ట్రంలో మొదలైన బోనాల సంబురాలు

గోల్కొండ జగదాంబిక మహంకాళికి ఆషాఢ బోనం సమర్పణ

లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి వేలమందితో సాగిన ఊరేగింపు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: డప్పు చప్పుళ్ల హోరు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు, యువత కేరింతల నడుమ హైదరాబాద్‌లో ఆషాఢ బోనాల వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చారిత్రక గోల్కొండ జగదాంబిక అమ్మవారికి కుమ్మరులు గురువారం మధ్యాహ్నం తొలి బోనం సమర్పించడంతో సంబురాలు మొదలయ్యాయి. బోనాల ఉత్సవాల్లో ప్రధాన భూమిక పోషించే తొట్టెలు, పట్టు వస్త్రాల ఊరేగింపు మధ్యాహ్న వేళ ఉత్సాహభరిత వాతావరణంలో లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండకోటలోని అమ్మవారి ఆలయం వరకు కొనసాగింది. ఊరేగింపులో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, బంగారు, వెండి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నట్టు చెప్పారు. బోనాల ఉత్సవాల సందర్భంగా పలు ఆలయాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆషాఢమాసం ఆగస్టు ఒకటి వరకు ఉన్నందున ఒక్కోవారం ఒక్కో ప్రాంతంలో సుమారు నెలరోజులపాటు జంట నగరాల్లో బోనాల జాతర కొనసాగనున్నది. కార్యక్రమంలో ఆలయ ఈవో మహేందర్‌కుమార్ కొడమంచి, బోనాల ఉత్సవాల కమిటీ చైర్మన్ గోపిరెడ్డి వసంత్‌రెడ్డి, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కళాకారుల కోలాహలం

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 250 మందికిపైగా జమిడిక, ఒగ్గు, గుస్సాడి కళాకారులు, జడల కోలాటం, డప్పు జానపద కళాకారులు బోనాల ఊగేరింపులో పాల్గొన్నారు. లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఊరేగింపులో జమిడిక కళాకారులదే అగ్రపథం. జమిడిక కళాకారులైన బైండ్ల వారు తెలంగాణ బైండ్ల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తంగెడపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో జమిడికల దరువు మోగించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు కళాకారులు దరువులు, నృత్యాలు, పాటలు కొనసాగాయి.

జగదాంబిక అమ్మవారికి కుమ్మరుల తొలి బోనం

రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో తొలి బోనాన్ని గోల్కొండలోని జగదాంబిక అమ్మవారికి సమర్పించారు. అనంతరం, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో ట్యాంక్‌బండ్‌పై ఉన్న కట్టమైసమ్మ తల్లికి 516 బోనాలను సమర్పించారు. తాడూరి శ్రీనివాస్ సతీమణి శ్రీలతకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తొలిబోనాన్ని ఎత్తి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ట్యాంక్‌బండ్ మీదుగా కట్ట కింద ఉన్న కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, టీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్‌యాదవ్, సైదా నాయక్, ఎంబీసీ సీఈవో అలోక్‌కుమార్, బీసీ గురుకులాల సెక్రటరీ మల్లయ్య బట్టు, కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నగేశ్, నాయకులు రాజమల్లయ్య, దయానంద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురువారం ఆషాఢ మాస తొలిబోనం గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించేందుకు వెళ్తున్న ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు

అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ బరాజ్‌లోకి చేరుతున్న వరద నీరు

గోదావరికి ప్రాణం

- ప్రధాన నదిలోకి ప్రాణహిత వరద
- కాళేశ్వరం వద్ద 9 వేల క్యూసెక్కుల ప్రవాహం
- మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌజ్‌కు జలకళ
- వరదనీటి నిల్వకోసం బరాజ్ గేట్లు దింపే ఏర్పాట్లు
- నమస్తే తెలంగాణతో ప్రాజెక్టు ఈఈ వెంకటరమణారెడ్డి
- ఒక మోటర్ వెట్‌రన్‌తో అన్నారం బరాజ్‌కు జలాల ఎత్తిపోత
- వారంలో మరో రెండు మోటర్ల వెట్‌రన్

గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద గోదావరి నదీ ప్రవాహ దృశ్యం

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఎగువ నుంచి ప్రవాహాలు కరువైన గోదావరికి ప్రాణహిత ప్రాణం పోస్తున్నది. మహారాష్ట్రలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహితకు వరద వస్తున్నది. ప్రాణహిత కలిసిన తర్వాత దిగువన గోదావరి నదిలో వరదనీటి ప్రవాహం క్రమేణా పెరుగుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం వద్ద గురువారం సాయంత్రానికి వరదనీరు సుమారు తొమ్మిదివేల క్యూసెక్కులకు చేరింది. సముద్రమట్టం నుంచి 95.6 మీటర్ల ఎత్తున ఇక్కడ గోదావరిలో వరదనీరు ప్రవహిస్తున్నది. ఇటీవలే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతులమీదుగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో కురిసే వర్షాలతో గోదావరిలో వరదనీరు ప్రవహించనున్నదని, మేడిగడ్డ బరాజ్ నుంచి కన్నెపల్లి పంపుహౌజ్ ద్వారా ప్రతిరోజు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని ప్రకటించారు. ఆ క్రమంలోనే కొద్దిరోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత ద్వారా గోదావరికి వరద నీరు వస్తున్నది. ఇది బుధవారం సాయంత్రం కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో కలిసింది. అర్ధరాత్రి నుంచి వరద నీటి ప్రవాహం క్రమేణా పెరుగుతున్నది. గురువారం సాయంత్రం కన్నెపల్లి పంపుహౌజ్, మేడిగడ్డ బరాజ్ వద్ద గోదావరిలో తొమ్మిదివేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వరద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్తున్నారు.

వరద నీటిని గోదావరిలో నిల్వ చేసేందుకు మేడిగడ్డ బరాజ్ గేట్లను ఒకటి రెండు రోజుల్లో దింపేందుకు కసరత్తు చేస్తున్నట్టు ప్రాజెక్టు ఈఈ వెంకటరమణారెడ్డి 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. కన్నెపల్లి పంపుహౌజ్‌లోని మోటర్ల వెట్‌రన్ జరుగుతున్నదని, త్వరలోనే ఈ మోటర్లతో మేడిగడ్డ బరాజ్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసి అన్నారం బరాజ్‌కు తరలిస్తామని తెలిపారు. బరాజ్ గేట్లు దించే లోపే కన్నెపల్లి పంప్‌హౌస్‌లో ఒక మోటర్‌కు వెట్‌రన్ నిర్వహించి అన్నారం బరాజ్‌లోకి గోదావరి నీటిని ఎత్తిపోశారు. ప్రస్తుతం ప్రాణహిత నది నుంచి వస్తున్న వరదతో గోదావరిలో పెరుగుతున్న నీటి ప్రవాహంతో మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంపుహౌజ్‌కు జలకళ వచ్చింది. ఇన్నాళ్లూ ప్రాణహిత మీదుగా కాలినడకన తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు రాకపోకలు సాగగా, నీటి ప్రవాహం పెరుగడంతో రేవులు మూతపడ్డాయి. ఇదిలాఉంటే.. కడెం ప్రాజెక్టులోకి 314 క్యూసెక్కులు, ఎల్లంపల్లిలోకి 477 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మినహా ఇతర ప్రాజెక్టుల వద్ద ఇన్‌ఫ్లోలు నమోదుకాలేదు.

కన్నెపల్లి పంప్‌హౌస్‌లో ఒకటో మోటర్‌కు వెట్‌రన్

కాళేశ్వరం (జయశంకర్ భూపాలపల్లి): గోదావరి జలాలు సముద్రంలో వృథాగా కలువకూడదన్న లక్ష్యంతో అపర భగీరథుడిలా కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం నెరవేరుతున్నది. ఇప్పుడిప్పుడే కాళేశ్వరం ప్రాజెక్టు జలశోభితమవుతున్నది. దీంతో ప్రాజెక్టులోని ప్రధానమైన కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాల రివర్సింగ్ మొదలైంది. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద గురువారం సాయంత్రం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి ఒకటవ మోటర్‌కు వెట్‌రన్ నిర్వహించడంతో అన్నారం బరాజ్‌కు గోదావరి జాలలు పరుగులుతీశాయి. మరో వారంలో రెండు, మూడో మోటర్లకు వెట్‌రన్ చేపట్టనుండటంతో ఇక అన్నారం మొదలుకుని.. సుందిల్ల బరాజ్ వరకు కాళేశ్వరం ప్రాజెక్టు నిండుకుండలా మారనున్నది.

గురువారం భద్రాచలం పుష్కరఘాట్ వద్ద గోదావరి

ఆల్మట్టికి 40వేల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణాబేసిన్‌కు వరద మొదలైంది. తాజా నీటిసంవత్సరం మొదలై నెల గడుస్తున్నా బేసిన్‌లోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ చుక్క వరద రాలేదు. తాజాగా ఆల్మట్టి జలాశయానికి వరద మొదలుకావడం విశేషం. గురువారం ఉదయం 16వేల క్యూసెక్కుల పైచిలుకుగా ఉన్న ఇన్‌ఫ్లో.. సాయంత్రానికి 40,092 క్యూసెక్కులకు పెరిగింది. 129 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఆల్మట్టి జలాశయంలో ప్రస్తుతం 26.66 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. కృష్ణాబేసిన్‌లోని తుంగభద్ర, ఇతర ప్రాజెక్టులకు ఇంకా ఇన్‌ఫ్లోలు మొదలుకాలేదు.

గోదావరికి జలకళ

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం వద్ద గోదావరి జలకళ సంతరించుకుంటున్నది. వేసవిలో ఎడారిని తలపించిన గోదావరికి ఎగువన కురుస్తున్న వర్షాలతో కొత్త నీరు వచ్చి చేరుతున్నది. భద్రాచలం వద్ద మూడ్రోజుల క్రితంవరకు 2.3 అడుగులు ఉన్న నీటిమట్టం బుధవారం రాత్రి నుంచి క్రమేపీ పెరిగి, గురువారం ఉదయం 11.5 అడుగులకు చేరుకున్నది. సాయంత్రం 6 గంటలకు 10.5 అడుగుల వద్ద ఉన్నది.

ముహూర్తం

సూర్యోదయం: 5.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తదియ సాయంత్రం 4.11 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: ఆశ్లేష, అమృతఘడియలు: రాత్రి 10.51 నుంచి 12.27 వరకు, రాహుకాలం: ఉదయం 10.43 నుంచి మధ్యాహ్నం 12.21 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.27 నుంచి 9.19 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.47 నుంచి 1.39 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.08 నుంచి 3.44 వరకు.

తైలం కంపెనీ దందా!

మూడోపేజీ తరువాయి...

బకాయిలు ఉన్నారంటూ కోర్టు నోటీసులు రావడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. సూర్యాపేటకు చెందిన పలువురు వ్యాపారులు నమస్తే తెలంగాణను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. రూ.22 కోట్లు బాకీ ఉన్నట్టు జిల్లాలో మొత్తం 181 మంది కిరాణా దుకాణదారులకు నోటీసులు వచ్చాయని తెలిపారు. దీనిపై ఆరాతీయగా, ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్ సహా పలుజిల్లాల్లో సరైవాలా బాధితులు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని వ్యాపారులకు కూడా ఇటువంటి నోటీసులు వెళ్లినట్టు సమాచారం. భారీఎత్తున బ్యాంకులకు పంగనామం పెట్టేందుకు పన్నిన కుట్రలో వేలమంది చిరువ్యాపారులను టార్గెట్ చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.

అన్నీ అనుమానాలు.. అంతా గందరగోళం..

సరైవాలా అగర్ రిఫైనరీస్ పంపిన నోటీసులలో ఎన్నో అంశాలు గందరగోళంగా ఉన్నాయి. ఎలాంటి వ్యాపారలావాదేవీలు చేయనివారికి కూడా నోటీసులు అందినట్టు తెలుస్తున్నది. ఈ కంపెనీ ప్రధానంగా నేచురల్లే సన్‌ఫ్లవర్ ఆయిల్, పామోలిన్ ఆయిల్, వేరుశెనగ నూనెలతోపాటు మరికొన్ని ఉత్పత్తులను విక్రయిస్తున్నది. వీటిలో ఏ ఒక్క ప్రొడక్ట్‌ను కొనుగోలుచేయని వ్యాపారులకు సైతం బాకీ ఉన్నారంటూ నోటీసులు వెళ్లటం గమనార్హం. సూర్యాపేట పట్టణంలో కొందరు వ్యాపారులు ఈ కంపెనీకి చెందిన నేచురల్లే సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను కొనుగోలుచేశారు. అష్టలక్ష్మి ఏజెన్సీ డీలర్‌ద్వారా సరుకు తెప్పించుకుని, డీలర్ ద్వారానే బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించారు. అయినా రూ.లక్షల్లో బకాయిలు ఉన్నట్టు తాఖీదులు అందాయి. వీరిలో చాలామందికి 2017, 2018, 2019 సంవత్సరాల్లోనూ లక్షల రూపాయల మేర బకాయిలు ఉన్నట్టు నోటీసులు వచ్చాయి. అప్పటికే బాకీ ఉన్న వ్యాపారికి కంపెనీ మళ్లీ క్రెడిట్ ఎలా ఇస్తుందనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. తాఖీదులు అందుకున్న కొన్ని దుకాణాల్లో రోజుకు కనీసం రూ.వెయ్యి కూడా వ్యాపారం చేయనివి కూడా ఉన్నాయి. కోట్లు, లక్షల్లో వ్యాపారంచేసే పెద్దపెద్ద వ్యాపారులకు లక్షల్లో బకాయి ఉన్నా క్రెడిట్ ఇచ్చారంటే అర్థం ఉంది కానీ, వేలల్లో వ్యాపారంచేసే చిన్న దుకాణాలకు కూడా రూ.7లక్షలు బకాయిపడేవరకు కంపెనీనుంచి సరుకు ఎలా అందుతుందని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. నోటీసులలో అంతా గందరగోళం, అనుమానాలు ఉన్నాయని గగ్గోలు పెడుతున్నారు. చిన్నపాటి దుకాణాలు నడుపుకొంటున్న వ్యాపారులకు సైతం రూ.7లక్షల నుంచి 9 లక్షల బకాయిలంటూ కోర్టు నోటీసులు రావడంతో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. పిటిషన్లు వేసుకునేందుకు లాయర్లను పెట్టుకుని చేతిచమురు వదిలించుకుంటున్నారు. కోర్టుచుట్టూ తిరుగాల్సిరావడంతో వ్యాపారం కూడా నష్టపోతున్నారు.

నోటీసులా! చించేయండి!

పెద్దఎత్తున నోటీసులు వస్తుండటంతో ఆందోళనకు గురైన పలుజిల్లాల వ్యాపారులు సరైవాలా అగర్ రిఫైనరీస్ ఎండీ రవీందర్‌కుమార్ గుప్తాను నిలదీశారు. దీనిపై రాజీచేసుకుందామంటూ నార్కట్‌పల్లిలోని హోటల్‌కు రావాలని పిలిచినట్టు సూర్యాపేట జిల్లా కిరాణా, ఫ్యాన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ తెలిపారు. అక్కడకు లాయర్‌తోసహా వచ్చిన రవీందర్ కుమార్.. 'మీకు వచ్చిన నోటీసులతో ఎలాంటి ఇబ్బంది లేదు. కావాలంటే వాటిని చించివేయండి.. ఎలాంటి ఇబ్బంది ఉండదు..' అని చెప్పారని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ముప్పై రోజుల్లో కేసులు విత్‌డ్రా చేసుకుంటానని కూడా వంద రూపాయల స్టాంప్ పేపర్‌పై రాసి ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటికే లాయర్లకు ఫీజులకోసం పెద్ద మొత్తంలో ఖర్చుచేశామని చెప్పగా.. ఆ ఖర్చు మొత్తాన్ని కూడా ఇస్తానని ఒప్పుకొన్నాడని, జూన్ 26న హైదరాబాద్ మలక్‌పేటలోని కార్యాలయంలో డబ్బులు కూడా చెల్లించాడని చెప్పారు. కేసుల విషయం ప్రస్తావిస్తే, మీరు ఆరోజు బలవంతపెడితేనే కాగితం రాసిచ్చానంటూ మాట మార్చాడని తెలిపారు. ఇదే విషయమై తాము ఫోన్‌లో రవీందర్‌కుమార్‌ను నిలదీస్తే.. ఏ ఇబ్బందీ రాదంటూ హామీ ఇచ్చారని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కిరాణా, జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు చెప్పారు. బ్యాంకులకు ఉన్న బకాయిలు ఎగ్గొట్టేందుకే కిరాణాదుకాణాల నుంచి బకాయిలు రావాల్సి ఉన్నాయని చూపేందుకు తమకు నోటీసులు పంపుతున్నారని, ఈ నోటీసులను చూపించి ఐపీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

సూర్యాపేట పట్టణంలో నోటీసులు అందుకున్న కొన్ని దుకాణాలు

కిరాణా దుకాణం పేరు	బకాయిగా చెప్తున్న మొత్తం
సాయిసంతోష్	రూ.7,55,688
బీపీఎస్	రూ.7,63,530
శివపార్వతి	రూ.7,64,817
శబరి	రూ.9,41,383
మణి కిరాణం	రూ.9,43,843
వాసవీ కిరాణం	రూ. 11,11,134
హరిప్రసాద్ కిరాణం	రూ.7,63,640
సందీప్ కిరాణం	రూ.5,90,210
సంతోష్ కిరాణం	రూ.11,11,214

నాకు ఆ విషయాలు తెలియదు: సరైవాలా ఎండీ

కిరాణా దుకాణాల యజమానులకు అందుతున్న నోటీసులపై సరైవాలా అగర్ రిఫైనరీస్ లిమిటెడ్ ఎండీ రవీందర్ కుమార్ గుప్తాను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. 'విషయాలు నాకు ఏ మాత్రం తెలియవు. మా స్టాఫ్‌కు తెలుసు' అని సమాధానం ఇచ్చారు. రాజీ కుదుర్చుకునేందుకు సూర్యాపేట వ్యాపారులకు డబ్బు ఇచ్చిన విషయం నిజమేనా? అని ప్రశ్నించగా.. 'నేను ఎవరికీ పైసలు ఇవ్వలేదు.. నేను మా స్టాఫ్‌తో రేపు మాట్లాడిస్తాను. ఇప్పుడు ఏం చెప్పలేను' అంటూ దాటవేశారు.

దురుద్దేశంతోనే నోటీసులు..

సూర్యాపేటలోని 181 మంది వ్యాపారులకు నోటీసులిచ్చారు. కొందరికి దుకాణం పేరుతో ఒకటి, యజమాని పేరిట మరొకటి అందాయి. మాకు, ఆ కంపెనీకి ఎలాంటి సంబంధంలేదు. మా వ్యాపారులు ఆయిల్ ప్యాకెట్లను డీలర్‌ద్వారా కొని ఎప్పటికప్పుడు డబ్బు చెల్లించారు. కానీ, ఇలాంటి నోటీసులు దురుద్దేశంతోనే పంపుతున్నారు. మేం నేరుగా వెళ్లి డైరెక్టర్‌ను నిలదీస్తే విషయాన్ని ఒప్పుకొన్నాడు. ఎంతో మంది పేదవ్యాపారులు ఈ నోటీసులతో దవాఖానల పాలవుతున్నారు.

- బొమ్మిడి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు, కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్, సూర్యాపేట జిల్లా

వ్యాపారం చేసుకునేవాళ్లను కోర్టులపాలు చేశారు..

మానసికంగా ఇబ్బంది పడుతున్నాం. షాప్ బంద్‌చేసుకుని కోర్టుల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి వచ్చింది. నిజాయితీగా వ్యాపారం చేసుకునే మమ్మల్ని కోర్టులపాలుచేశారు.

-వెన్న రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి, కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్,సూర్యాపేట జిల్లా

మార్కెట్‌లో తలెత్తుకుని తిరుగలేకపోతున్నాం

నేను రూ.7.60 లక్షలు బకాయి ఉన్నానంటూ మే 27 తేదీన నోటీసు వచ్చింది. నేను ఆ కంపెనీ నుంచి సరుకు కొన్నది లేదు. మాకు ఆయన ఎవరో కూడా తెలియదు. వ్యాపారం చేసుకోవాలా? వద్దా? బయట మార్కెట్‌లో తలెత్తుకుని తిరిగే పనిలేకుండా అయ్యింది. చెయ్యని తప్పుకు నోటీసులు ఇచ్చారు.

-ఓరుగంటి క్రిష్ణయ్య, ఉపాధ్యక్షుడు, కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్, సూర్యాపేట జిల్లా

చిన్న దుకాణాలకు రూ.7లక్షల బకాయి సాధ్యమా?

గజ్జెల నాగేశ్వరరావు, పీఎస్సార్ సెంటర్ దుకాణానికి రూ.7.90 లక్షల బకాయి అంటూ నోటీసు వచ్చింది. రోజుకు రూ.వెయ్యి లోపు వ్యాపారం కూడా జరుగని చిన్న దుకాణానికి రూ.7 లక్షల సరుకు తీసుకునే స్థాయి ఉంటుందా? ఆ దిగులుతో భార్యాభర్తలిద్దరూ దవాఖాన పాలయ్యారు. ఇలా ఎందరినో మోసగించినవారిపై చర్య తీసుకోవాలి.

- పాలవరపు వెంకటేశ్వర్లు, కోశాధికారి, కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్, సూర్యాపేట జిల్లా

ప్రభుత్వం జోక్యంచేసుకొని న్యాయంచేయాలి

ఈ మోసాలపై 55 మంది కోర్టుకు వెళ్లాం. మావాళ్లు చిన్న వ్యాపారులు. వాళ్లను ఇలా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సరైంది? మాకు న్యాయంచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- సవరాల సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు, కిరాణా అండ్ ఫ్యాన్సీ అసోసియేషన్, సూర్యాపేట జిల్లా

ఏ సంబంధంలేని మాకు నోటీసులు పంపుతున్నారు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు సుమారు 400 మందికి ఈ కంపెనీ నుంచి నోటీసులు వచ్చాయి. ప్రతి ఒక్కరికి రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు బకాయి ఉన్నట్టు నోటీసులలో ఉన్నది. దీనిపై మేం కోర్టులో కూడా పిటిషన్లు వేశాం.

- కొట్ర మధుబాబు, అధ్యక్షుడు, జిల్లా కిరాణం అసోసియేషన్, ఉమ్మడి మహబూబ్‌నగర్

ఎవరో నాకు తెలియదు

ఆ వ్యాపారి ఎవరో కూడా నాకు తెలియదు. ఆ కంపెనీ ప్రొడక్ట్స్ అసలు చూడనేలేదు. అలాంటిది నేను రూ.7.33 లక్షలు బాకీ అని జూలై 4న నోటీసు వచ్చింది. దీనిపై లీగల్‌గా ప్రొసీడ్ అవ్వాలనుకుంటున్నాం.

- శశిధర్, శిరిడిసాయి కిరాణం, జెడ్చర్ల

లోకం పోకడ

డ్రంకెన్ డ్రైవ్‌లో నన్ను అరెస్టు చేసి తీసుకెళ్తున్నారు సరే.. ఒక వేళ మీరు కూడా దొరికిపోతే మనిద్దరిని ఎవరు తీసుకెళ్తారు సార్?

టీజీటీ పోస్టులకు బీటెక్ అభ్యర్థులూ అర్హులే

మెరిట్ ప్రకారం నియామకాలు జరుపాలన్న హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : బీఈడీ చేసిన బీటెక్ అభ్యర్థులు టీజీటీ పోస్టులకు అర్హులేనని హైకోర్టు స్పష్టం చేసింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) 2014లో జారీచేసిన నూతన నిబంధనల ప్రకారం బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు బీటెక్ గ్రాడ్యుయేట్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం అంగీకరించింది. బీఈడీ చేసిన బీటెక్ అభ్యర్థులను టీజీటీ పోస్టులకు పరిగణనలోకి తీసుకుని మెరిట్ ప్రకారం నియామకాలు చేపట్టాలని ధర్మాసనం పేర్కొన్నది.

ఎంవీయాక్ట్ అమలుపై తాజానివేదిక ఇవ్వండి

డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మోటరు వాహన చట్టం (ఎంవీ యాక్ట్) సెక్షన్ 158లోని సబ్‌సెక్షన్ 6ను కచ్చితంగా అమలుచేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు రాష్ట్రంలో ఈ నిబంధన అమలు అంశాన్ని గతంలో సుమోటోగా స్వీకరించిన హైకోర్టు.. తాజా గణాంకాలతో నివేదిక సమర్పించాలని గురువారం డీజీపీని ఆదేశించింది. ఈ చట్టం ప్రకారం ఎక్కడైనా రోడ్డుప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రాంత పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ సదరు యాక్సిడెంట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఏఐఆర్)ను 30 రోజుల్లోగా సంబంధిత ప్రాంతం పరిధిలోని క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌కు, ఇన్సూరెన్స్ కంపెనీకి, వాహన యజమానికి పంపాల్సి ఉంటుంది. దీనిపై డీజీపీ గతంలోనే హైకోర్టుకు నివేదిక సమర్పించారు. అయితే ఆ నివేదికలో తాజా గణాంకాలు లేవని పేర్కొన్న ధర్మాసనం.. అసలు 2009 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ప్రమాదాలు జరిగాయి? వాటికి సంబంధించి 30 రోజుల్లోగా నివేదికలు పంపిన సందర్భాలెన్ని? అనే తాజా గణాంకాలతో మరోసారి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదావేసింది.

ఎంసెట్ కన్వీనర్ కోటాలో 64,709 సీట్లు

- ఈ నెల 6 నుంచి కౌన్సెలింగ్
- కన్వీనర్ నవీన్‌మిట్టల్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల లెక్క తేలింది. ఎంసెట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల ఐదో తేదీకి బదులుగా ఆరో తేదీ నుంచి ప్రారంభించాలని గురువారం నిర్వహించిన ఎంసెట్ అడ్మిషన్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 64,709 సీట్లు (70 శాతం కన్వీనర్ కోటా) భర్తీచేయనున్నట్టు ఎంసెట్ కౌన్సెలింగ్ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఇందులో 183 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలలో 61,638 సీట్లు, 14 యూనివర్సిటీ కాలేజీలలో 3,071 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కాగా జేఎన్టీయూహెచ్ పరిధిలోని 151 కాలేజీలలో మొత్తం 78,729 సీట్లు, ఓయూ పరిధిలోని 13 కాలేజీల్లో 7,760 సీట్లు, కేయూ పరిధిలోని 5 కాలేజీల్లో 1,710 సీట్లు వెరసి మొత్తం88,199 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 70 శాతం కన్వీనర్ కోటాలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 16,614 సీట్లు, సివిల్ ఇంజినీరింగ్‌లో 7,949, ఈసీఈలో 14,955, ఈఈఈలో 7,792, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 8,833 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆర్మ్‌డ్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాల ప్రవేశపరీక్ష ఫలితాల విడుదల

- ఎంపికైన విద్యార్థినులకు నేడు, రేపు కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆర్మ్‌డ్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాల ప్రవేశపరీక్ష ఫలితాలను విడుదలచేసినట్టు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని ఎస్సీ ఆర్మ్‌డ్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు తాత్కాలిక ఎంపిక జాబితాను విడుదలచేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు శుక్ర, శనివారాల్లో (ఈ నెల 5, 6 తేదీల్లో) కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, వివరాలకు https://www.tswreis.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

ప్రమాద బీమా.. కుటుంబానికి ధీమా

- టీఆర్ఎస్ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు చెల్లింపు
- పార్టీ క్యాడర్‌కు ఇన్సూరెన్స్ సౌకర్యం
- గత మూడేండ్లలో 1328 మందికి రూ.26.56 కోట్లు చెల్లింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) తమ పార్టీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల చొప్పున ప్రమాదబీమా సౌకర్యాన్ని అందిస్తున్నది. ఈ ఇన్సూరెన్స్ పథకం కింద మూడేండ్లలో ప్రమాదవశాత్తు చనిపోయిన 1328 మంది సభ్యుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పు న మొత్తం రూ.26.56 కోట్లు చెల్లించారు. ప్రమాదవశాత్తు పార్టీ సభ్యులు మరణిస్తే.. వారి కుటుంబాలు వీధినపడకుండా ఆదుకోవాలనే మానవతా దృక్పథంతో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పార్టీ సభ్యులందరికీ ప్రమాదబీమా సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. ఇందుకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని కూడా పార్టీయే చెల్లిస్తున్నది. టీఆర్ఎస్ పార్టీ బీమా ప్రీమియం కింద 2015 నుంచి 2018 వరకు రూ.19.47 కోట్లు చెల్లించింది. పార్టీ సభ్యత్వ నమోదు సయమంలో సభ్యులు నామినిగా సూచించినవారికి బీమాసొమ్మును చెల్లిస్తారు. 18 నుంచి 70 ఏండ్ల వయస్సు ఉండి, టీఆర్ఎస్ సభ్యత్వం పొందిన వారు ఈ ప్రమాదబీమాకు అర్హులు. చనిపోయిన నెలరోజుల్లో సంబంధిత పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చురుకుగా సాగుతున్నది. ఈ నేపథ్యంలో సభ్యత్వ పుస్తకంలో పొందుపరిచిన అన్ని వివరాలతోపాటు నామిని పేరును కూడా స్పష్టంగా నమోదుచేయాలని పార్టీ నాయకులు సూచిస్తున్నారు. ప్రమాదవశాత్తు చనిపోయినవారికి సంబంధించిన అవసరమైన అన్ని పత్రాలను నెలరోజుల్లో తెలంగాణభవన్‌లో సమర్పించాలని కోరుతున్నారు.

ఎవరికి ప్రమాద బీమా వర్తిస్తుంది..?

రోడ్డు, అగ్ని ప్రమాదాలు, ప్రమాదవశాత్తు చెరువుల్లో పడిపోవడం, ప్రమాదవశాత్తు భవనాల మీది నుంచి పడిపోవడం, పాముకాటు, కరెంట్‌షాక్, తేనెటీగల దాడి, జంతువులు కాటువేయడం ద్వారా చనిపోవడం లాంటి మరణాలకు ఈ ప్రమాద బీమా వర్తిస్తుంది.

సంవత్సరం	బీమా పొందిన వారి సంఖ్య
2015-16	500
2016-17	471
2017-18	357
మొత్తం	1,328

సమర్పించాల్సిన డాక్యుమెంట్లు

పార్టీ సభ్యత్వ నమోదుపత్రం, ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికెట్, చనిపోయినవ్యక్తి ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, ఓటరు ఐడీకార్డు, రేషన్ కార్డు, పోలీస్ ఫైనల్‌రిపోర్ట్, దవాఖానలో చనిపోతే డెత్‌రిపోర్ట్ సమర్పించాల్సి ఉంటుంది.

గురువారం రాత్రి సచివాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

సర్వాయి పాపన్న గుట్ట భద్రం

- యోధుడి జ్ఞాపకాన్ని పదిలం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఉమ్మడి ఏపీలో గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతి రద్దు
- హర్షం వ్యక్తంచేసిన కులసంఘాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపం.. గొలుసు కట్టు చెరువులకు ఆధారమైన సర్దార్ సర్వాయిపాపన్న గుట్టకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించింది. ఈ యోధుడి జ్ఞాపకాల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కలర్ గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దుచేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం రాత్రి ప్రొసీడింగ్స్ జారీ చేసింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండ లం ఆకునూర్ గ్రామంలో సర్వాయి పాపన్న అభివృద్ధిచేసిన ఈ ప్రాంతం 23 గొలుసుకట్టు చెరువులకు ఆధారంగా ఉండేది. అక్కడ కలర్ గ్రానైట్ ఉన్నదని గుర్తించిన ఉమ్మడి ఏపీ ప్రభు త్వం.. 2011లో ఆ గుట్ట పరిధిలోని 9 హెక్టార్లకుగాను 7.80 హెక్టార్లలో తవ్వకాల కోసం వర్ష గ్రానైట్ సంస్థకు అనుమతిచ్చింది. అప్పటి నుంచి ఈ గుట్టను కాపాడుకునేందుకు గౌడసంఘం నేతలు, సర్వాయి పాపన్న పరిరక్షణ కమిటీ, మోకుదెబ్బతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పోరాటంచేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి గ్రానైట్‌ను తరలించేందుకు పనులు చేపడుతుండటంపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. దీంతో 24 గంటల్లోనే దీనిపై పరిశీలన జరిపిన తెలంగాణ ప్రభుత్వం.. సర్వాయిపాపన్న గుట్టను చారిత్రాత్మకమైనదిగా గుర్తించి, గ్రానైట్ తవ్వకాల అనుమతులను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులపై గౌడ సంఘాల నేతలు హర్షం వ్యక్తంచేస్తూ సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సచివాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన గౌడ సంఘ నేతల్లో నారాయణగౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెంటయ్య గౌడ్, సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కలర్ సత్తన్న, ఇతర గీత కార్మిక సంఘాల నేతలు రవిగారి ప్రసాద్‌గౌడ్, భిక్షపతిగౌడ్, సత్తయ్యగౌడ్, నర్సయ్యగౌడ్, వీరస్వామిగౌడ్, బాలరాజ్‌గౌడ్ ఉన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ పాపన్న చరిత్రను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సర్దార్ పాపన్న అభివృద్ధిచేసిన ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

బ్యాలెట్‌తో మున్సిపోల్స్

- రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఈనెల 18 వరకు వార్డులవారీగా ఓటరు తుదిజాబితా
- మున్సిపల్ అధికారులతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇందుకోసం బ్యాలెట్ పత్రాలను స్థానికంగా ముద్రించుకోవచ్చని పేర్కొన్నది. మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం 131 మున్సిపాలిటీల కమిషనర్లు, సీడీఎంఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్, వరంగల్‌తోపాటు పలు కార్పొరేషన్లలో ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించినా.. వచ్చే మున్సిపల్ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈవీఎంలు సరిపడా లేకపోవడం, సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో బ్యాలెట్‌వైపే మొగ్గుచూపినట్టు తెలుస్తున్నది. ఆయా మున్సిపాలిటీల పరిధిలో ముద్రణసంస్థలను ఎంపికచేయాలని ఎస్ఈసీ సూచించింది. స్థానికంగా బ్యాలెట్‌పత్రాలను ముద్రించుకొనేందుకు అనుమతిస్తామని తెలిపింది.

ఐదుగురు దాటినా అదనపు పోలింగ్ కేంద్రం

మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధంచేస్తున్నారు. వార్డుల విభజన పూర్తికావడంతో.. పోలింగ్‌కేంద్రాల తుదిజాబితా కూడా సిద్ధమవుతున్నది. పోలింగ్‌కేంద్రాల ముసాయిదాను ఈ నెల 10న విడుదల చేయాల్సి ఉన్నది. 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని.. 800 మంది దాటి ఐదుగురు ఓటర్లున్నా ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎస్ఈసీ స్పష్టంచేసింది.

సీడీఎంఏకు ఓటరుజాబితా

131 మున్సిపాలిటీల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల ఓటరు జాబితాను దాదాపు ఖరారుచేసి.. సీడీఎంఏకు అప్పగించారు. ఈ నెల 18న ఓటర్ల ఫొటోలతో తుదిజాబితా విడుదల చేయాలని ఎస్ఈసీ ఆదేశాలిచ్చింది. 131 మున్సిపాలిటీలతోపాటు కరీంనగర్, నిజామాబాద్, రామగుండం కార్పొరేషన్లలో ఫొటో ఓటరుజాబితాను ఖరా రుచేయాలని నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 12న ఓట రు జాబితా ముసాయిదాను వార్డులవారీగా విడుదలచేయాలని, 12 నుంచి 16 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరా లు స్వీకరించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈనెల 12న జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో, 13న మున్సిపాలిటీల్లో రాజకీయపక్షాలతో సమావేశాలు నిర్వహించాలని సూ చించారు. 18న వార్డులవారీగా ఓటర్ల ఫొటోలతో తుదిజాబితాను విడుదలచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ఆదేశించారు. నోటిఫికేషన్ విడుదలయ్యే వర కూ జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్తఓటర్ల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు.

రేపు పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేయనున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ గురువారం ప్రకటించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్టు చెప్పారు.

డిగ్రీ కాలేజీల్లో రిపోర్టింగ్‌కు చివరి గడువు నేడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీ కళాశాలల్లో మూడోవిడుత కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయడానికి శుక్రవారం వరకు గడువు పొడిగించా రు. ఈ మేరకు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి గురువారం ప్రకటించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ నమోదు చేసుకున్న విద్యార్థులు శుక్రవారం కళాశాలకు వెళ్లి అడ్మిషన్ ఖరారు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ సీట్ల కోసం స్పెషల్‌ఫేజ్ దోస్త్ కౌన్సెలింగ్ హాజరుకు రిజిస్ట్రేషన్‌కు రూ.400 ఫీజు చెల్లించాలని చెప్పారు. ఈ నెల 5 నుంచి 7 వరకు ఇంట్రా-కాలేజీ వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకుంటే, ఈ నెల 10న సీట్ల కేటాయిస్తామన్నారు. ఇప్పటివరకు దోస్త్ ద్వారా సీట్లు పొంది, డిగ్రీ కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్నవారు 1,29,551 మంది ఉన్నారని, వారిలో కళాశాలకు వెళ్లి ప్రవేశం పొందినవారు 1,15,428 మంది విద్యార్థులున్నారని తెలిపారు.

గిరిజన సివిల్స్ అభ్యర్థులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్ ద్వారా సివిల్స్ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ క్రిస్టినాఖుడ్ చోంగ్తూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. http//studycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో 31 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అతివేగానికి కళ్లెం తప్పనిసరి!

- రవాణా వాహనాలన్నింటికీ స్పీడ్ గవర్నెన్స్
- అనుమతి పొందిన డీలర్లవద్దే కొనాలని ప్రభుత్వం స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు ప్రమా దాలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలో 2020 నాటికి రోడ్డు ప్రమాదాలను సగటున 20 శాతం మేరకైనా తగ్గించాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఇకనుంచి రవాణా వాహనాలన్నింటికీ తప్పనిసరిగా స్పీడ్ గవర్నెన్స్ ఉండాలని ఆదేశాలు జారీచేసింది. స్పీడ్ లిమిట్ డివైజ్ (ఎస్ఎల్‌డీ), స్పీడ్ లిమిట్ ఫంక్షన్స్ (ఎస్ఎల్ఎఫ్) యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, కార్ల తోసహా ప్రతి రవాణా వాహనంలో వేగనియంత్రణ సాధనాన్ని బిగించుకోవాలని స్పష్టం చేసింది. ప్రతి ఆర్టీవో కార్యాలయ పరిధిలో నిఘా పెంచాలని, ఈ నెల చివరినాటికి పూర్తిస్థాయిలో వేగనియంత్రణ పరికరాలు బిగించుకునేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతి పొందిన డీలర్లు, ఏజెన్సీల నుంచి మాత్రమే స్పీడ్ గవర్నెన్స్ యంత్రాలను కొనుగోలు చేయాలని, అనుమతిలేని డీలర్లు, ఏజెన్సీల నుంచి కొనుగోలుచేసే యంత్రాలను పరిగణనలోకి తీసుకోబోమని ప్రభుత్వం పేర్కొన్నది. అనుమతి పొందిన డీలర్లు, ఏజెన్సీ వివరాలను రవాణాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం.. 2015 అక్టోబర్ 1 తర్వాత తయారైన ప్రతి రవాణా వాహనానికి స్పీడ్ గవర్నెన్స్ తప్పనిసరి. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.

ఈ వాహనాలకు మినహాయింపు

రవాణా వాహనాల పరిధిలోకి వచ్చే కొన్ని వాహనాలకు స్పీడ్ గవర్నెన్స్ నుంచి మినహాయింపునిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ద్విచక్ర వాహనాలు, మూడుచక్రాల వాహనాలు, ఫైరింజన్లు, అంబులెన్స్‌లు, పోలీస్ వాహనాలకు స్పీడ్ గవర్నెన్స్ అవసరం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే ఈ వాహనాలకు మినహాయింపు వర్తిస్తుందని పేర్కొన్నది. వేగనియంత్రణ సాధనాలను బిగించాల్సిందిగా ఇప్పటికే హెచ్చరికలు జారీచేయగా.. కొన్ని వాహనాలకు వాటిని అమర్చారని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీసీ పాపారావు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మరియు మౌలిక సదుపాయాభివృద్ధి సంస్థ
ఫోన్ నెం. 040-24656688 ఫ్యాక్స్: +91-40-24745510, ఇ-మెయిల్: tsmsidcequ@gmail.com
Short Tender Notice No. 02/TSMSIDC/EQU/Procurement/2019-20 తేది: 03-07-2019
వివిధ NHM కార్యక్రమాలకు IEC ప్రింట్ మెటీరియల్ ముద్రించి మరియు సరఫరా చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని అర్హత గల ముద్రణకార్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా TSMSIDC సంక్షిప్త టెండరు కోరుచున్నది.
తదుపరి వివరాలకు దయచేసి చూడండి: **https//tender.telangana.gov.in** వద్ద 03-07-2019 **నుండి** తరుచుగా చూడగలరు. ఎట్టి కారణములూ తెలుపకనే టెండర్లను TSMSIDC సమయంలోనైనా రద్దు చేయవచ్చు.
DIPR R.O.No. 221 PP/CL/Advt/1/2019-20 తేది: 04-07-2019 సం/- మేనేజింగ్ డైరెక్టర్

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం
తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమం మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ :: హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నెం.SE/TSEWIDC/HYD/NIT/171 to 187/2019-20, Dt: 03-07-2019
తెలంగాణ రాష్ట్రంలో మోడల్ డిగ్రీ కళాశాల భవనం, కమ్యూనిటీ హాల్స్, KGBV భవనములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ZPHS పనులు వగైరా (17 పనులు) యొక్క నిర్మాణం కొరకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. అంచనా వ్యయం: (రూ. 68.08 లక్షల నుండి 900.00 లక్షలు) (1వ పిలుపు, 2వ పిలుపు, 3వ పిలుపు, 4వ పిలుపు మరియు 5వ పిలుపు).
ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేది: 19-07-2019న సా॥ 4.00 గం॥ వరకు.
గమనిక: G.O.Ms.No.94 రవాణా, రహదారులు మరియు భవనములు (R.1) శాఖ, తేది: 16-04-08 ప్రకారం అనగా కేవలం స్టీల్ మరియు సిమెంట్ కొరకు మాత్రమే ధర సర్దుబాటు వర్తిస్తుంది. పూర్తి వివరాలు **https://tender.telangana.gov.in** వద్ద లభిస్తాయి లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ మిషన్ భవనం, SCERT కాంపౌండ్, ఇ-గేట్ ఎదురుగా, ఎల్.బి. స్టేడియం, హైదరాబాద్ వారిని స్వయంగా సంప్రదించగలరు. **ఫోన్ నెం. 23326692.**
DIPR RO.No. 223-PP/CL/ADVT/1/2019-20, Dt: 04-07-2019 సం/- **సూపరింటెండింగ్ ఇంజినీర్, TSEWIDC, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, DSS భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్
NIT No. SE/TW/HYD/158 to 161 & 163 to 165/2019-20, Dt: 02-07-2019
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
జగిత్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలనందు ST ఆశ్రమ హైస్కూల్స్, వసతి గృహాలనందు చిన్నతరహా మరమ్మతులు మరియు ఇతర పనుల ఏర్పాటు చేపట్టు నిమిత్తం దిగువ సంతకందారుని ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. ECV మొత్తం: రూ. 117.35 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభం & ముగింపు తేది: 05-07-2019న సా॥ 5.00 గం॥ నుండి తేది: 20-07-2019 మ॥ 3.00 గం॥ వరకు. వాణిజ్య బిడ్ తెరచుట: 20-07-2019న సా॥ 4.00 గం॥. ఫోన్ నెం.: **040-23315950.** ఇ-మెయిల్: **setwhyd13@gmail.com.** తదుపరి వివరాల కొరకు దర్శించండి: **https://tender.telangana.gov.in//**
DIPR RO.No. 532-DP/CL/ADVT/1/2019-20, Dt: 04-07-2019 సం/- **సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వము
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
e-Proc.Notice No.51/SE/TS/TUFIDC/Thorrur & Sathupalli/General/2019-20/73, తేది: 03-07-2019. పని పేరు: మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ మున్సిపాలిటీలో ఇండోర్ స్టేడియం మరియు స్విమ్మింగ్ పూల్ నిర్మించుట ద్వారా యతి రాజారావు పార్కు అభివృద్ధిచేయుట మరియు సత్తుపల్లి మున్సిపాలిటీలో TUFIDC సహకారం క్రింద వార్డ్ నం.4లో వివిధ ప్రదేశాల వద్ద సిసి రోడ్లు డ్రెయిన్‌లు & BT రోడ్లు వేయుట. మొత్తం ECV: రూ. 220.96 లక్షలు. బిడ్ల డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 06-07-2019 నుండి 15-07-2019 వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా **www.tender.telangana.gov.in**లో చూడవచ్చును.
సం/- **సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH),TUFIDC, యూనిట్-I, వరంగల్**
DIPR R.O.No. 529 DP/CL/Advt/1/2019-20 తేది: 04-07-2019

TELANGANA STATE INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LTD., ZONAL OFFICE : INDL.PARK, WARANGAL - 506 007
Lr.No.162/ TSIIC / IP-WGL/2008, Dt: 02-07-2019
AUCTION NOTICE
The land alongwith old structures situated at Industrial Park, Warangal is proposed for sale by Open Auction on "As is where is" basis to be Commercial utilized for construction of warehouses / Convention Centre / Automobile / Showroom / Service Centre / Dispensaries. The land shall not be utilized for Industrial / Residential purpose.
Auction will be conducted on 18-07-2019 from 12:00 PM to 1:30 PM in O/o. Zonal Manager, TSIIC Limited, Industrial Park, Mulugu Road, Warangal - 506007

Sl. No.	Name of Industrial Park	Extent in Sq.Mts. with old structures	Upset Price Fixed by TSIIC	E.M.D.
1	IP Warangal	608.00 Sqm.	a) Rs.19,000/- per sqm b) Rs.82,045/- cost of structures	10% of the Upset price amounting to Rs.11,63,405.00

Terms and conditions are on display in TSIIC Official website: **www.tsiic.telangana.gov.in**
Sd/- Zonal Manager, TSIIC Ltd., Warangal

Government of India
Ministry of Skill Development & Entrepreneurship
DIRECTORATE GENERAL OF TRAINING
NATIONAL SKILL TRAINING INSTITUTE
(Formerly Advanced Training Institute)
Vidyanagar, Shivam Road, Hyderabad – 500 007.
ADMISSION NOTICE
The National Skill Training Institute (V), Government of India, Ministry of Skill Development & Entrepreneurship, Shivam Road, Vidyanagar, Hyderabad is conducting New age and Expensive trades of CTS Training Scheme under the aegis of NCVT and the session will commences from 1st August, 2019 in the following trades:-

Sl.No.	Name of Trade	Duration of course	NSQF Level
1	Solar Technician	One Year	4
2	Geo-informatics Assistant	One Year	5
3	Machinist	Two Year	5

1. Entry Qualification :
   i. 10th class pass under 10+2 system of education or its equivalent for courses at serial number 01 & 03.
   ii. Passed 12 class examination under 10+2 system of education with Mathematics in matriculation for courses at serial number 02.
2. **Issue of application forms for admission:** 17th June, 2019.
3. **Last date for submission of application form :** 17th July, 2019.
4. Selection Mode:
   i. Selection of candidates shall be on the basis of merit 10th class marks for courses at SL. No.1 & 3 and reservation as per Government policy..
   ii. Selection of candidates shall be on the basis of merit 10+2 class marks for courses at SL no 2 and reservation as per Government policy

How to apply:
Candidates desiring to take admission may obtain the application form and other details from the Institute on payment of Rs.25/- in cash and may also be downloaded from www.atihyderabad@nic.in . The registration fee of Rs 50/- has to be paid through Demand Draft /Cash only, in favor of DDO NSTI (V), Hyderabad, Duly filled-in application may be submitted to Regional Director, NSTI (V) Hyderabad-07 (No registration fee for SC / ST candidates).
Application should be addressed to:
THE REGIONAL DIRECTOR,
NATIONAL SKILL TRAINING INSTITUTE(V),
D.G.T., MINISTRY OF SKILL DEVELOPMENT & ENTERPRENEURSHIP,
GOVERNMENT OF INDIA,
SHIVAM ROAD, VIDYANAGAR, HYDERABAD – 500 007 (T.S.)
For other queries contact: 040-27428058, 09550601583, and 9985013302
REGIONAL DIRECTOR
RDSDE, HYDERABAD

Government of India
Ministry of Skill Development & Entrepreneurship
DIRECTORATE GENERAL OF TRAINING
NATIONAL SKILL TRAINING INSTITUTE (R)
(formerly Advanced Training Institute for Electronics and Process Instrumentation)
Ramanthapur, Uppal Road, Hyderabad – 500 013
ADMISSION NOTICE
The National Skill Training Institute, Ramanthapur campus, Hyderabad is conducting New Age trades of Craftsmen Training Scheme (CTS) under the aegis of NCVT and the session will commences from 1st August 2019 in the following trades:-

Sl.No.	Name of Trade	Duration of course	NSQF Level
1	IoT Technician (Smart Health Care)	One Year	Level – 4
2	Remotely Piloted Aircraft – Drone Pilot	6 Months	Level - 4

1. Entry Qualification:
   10th Class pass under 10+2 system of education or its equivalent.
2. Age Limit: Sl.No.2 needs minimum of 18 years of age.
3. **Issue of application forms for admission:** 17th June, 2019.
4. **Last date for submission of application form :** 17th July, 2019.
5. Selection Mode:
   Selection of candidates shall be on the basis of merit 10th Class marks for the above trades and reservation as per Government policy

How to apply:
Candidates desiring to take admission may obtain the application form and other details from the institute on payment of Rs.25/- in cash and may also be downloaded from www.atihyderabad.gov.in. The registration fee of Rs.50/- has to be paid through Demand Draft / Cash only, in favour of DDO, NSTI(R), Hyderabad. Duly filled-in application may be submitted to Regional Director, NSTI (R), Hyderabad – 500013 (No registration fee for SC/ST/PH candidates).
Application should be addressed to:
THE REGIONAL DIRECTOR
NATIONAL SKILL TRAINING INSTITUTE (R)
DIRECTORATE GENERAL OF TRAINING
GOVT. OF INDIA
MINISTRY OF SKILL DEVELOPMENT & ENTREPRENEURSHIP
RA



టిబెట్ సమస్య రాజకీయ స్వాతంత్ర్యం కోసం కాదు. టిబెట్ సంస్కృతి, మతం, భాష పరిరక్షించాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ స్వాతంత్ర్యం ప్రధానంగా ప్రజల ఆనందం కోసం ఉద్దేశించబడినది. దానిద్వారానే ఆనందం లభించదు.

దలైలామా, బౌద్ధ ఆధ్యాత్మిక గురువు

ఆధార్ సవరణ బిల్లు పారదర్శకంగా లేదు. నేను నా వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేట్ ఏజెన్సీకి వదిలిపెడుతున్నాను. ఒకవేళ ఆ వ్యవస్థ ఏర్పాటు విఫలమైతే, న్యాయం పొందే మార్గం ఉందని అంటున్నారు. కానీ ఆ మార్గాలేమిటో చెప్పడం లేదు..

మహువా మైత్రా, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

చరిత్రలో నేడు

1992

నెదర్లాండ్స్‌లో తొలిసారిగా సాధారణ ఎన్నికలు.

1959

రాజ్యాంగాన్ని పునరుద్ధరించుకున్న ఇండోనేషియా.

1960

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న మంగోలియా.

రెండేండ్ల కింద హాంకాంగ్ వాసులు ప్రజాస్వామ్యం కోసం శాంతియుత ఉద్యమం సాగించారు. కానీ తాజా ఉద్యమంలో చట్టసభ 'అప్పగింత బిల్లు'పై చర్చిస్తున్నప్పుడు కొందరు అందులోకి చొచ్చుకుపోయారు. అణిచివేత భయంతో నాయకుడు లేని ఉద్యమం రూపుదిద్దుకున్నది. దీని వల్ల కొన్ని అనుకూలాంశాలు ఉన్నట్టే, ప్రతికూలాంశాలూ ఉన్నాయి. ఉద్యమకారులు ఎవరి అంచనాలకు వారు వస్తున్నారు. ఈ పరిస్థితి నుంచి హాంకాంగ్ బయట పడలేదు. అయితే చైనా మారక పోతుందా అనే ఆశతో, ఈ ఉద్యమాన్ని ఎంత కాలం కొనసాగించలమనే ది ప్రధానం.

ది గార్డియన్

దక్షిణాదిన మెక్సికో సరిహద్దు దగ్గర నిర్బంధ శిబిరాలలో వలస వస్తున్న ప్రజల పరిస్థితి దారుణంగా ఉన్నది. వారాల కొద్దీ దుర్గంధమైన పడవల్లో ప్రయాణించి వచ్చిన వారికి నిర్బంధ శిబిరాలలో నిలబడి మాత్రమే ఉండవలిసి వస్తున్నది. వలస ప్రజల పరిస్థితి ట్రంప్‌కు రాజకీయ, నైతిక సమస్యగా మారింది. ప్రభుత్వ హోం లాండ్ సెక్యూరిటీ అధికారులే అక్కడి పరిస్థితి దారుణంగా ఉందని వెల్లడించారు. మీడియాను, న్యాయవాదులను నిర్బంధ శిబిరాల దగ్గరికి ఇంతకాలం అనుమతించలేదు కనుక, వాస్తవాలు వెలుగు చూడలేదు.

టొరంటో స్టార్

రాహుల్ వైరాగ్యం!

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ రాహుల్‌గాంధీ ఉత్తరం రాయడంతో ఇక ఆయన కొనసాగే అవకాశాలు లేవని మరింత స్పష్టమైపోయింది. వారంలోగా వర్కింగ్ కమిటీ సమావేశమై కొత్త నాయకుడిని ఎంపిక చేస్తుందని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నేపథ్యంలో ఆయన పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారే తప్ప 'పార్టీ నాయకత్వాన్ని' ఏదో విధంగా కాపాడుకుంటూనే ఉంటారనేది స్పష్టం. పార్టీ వైఫల్యాలకు తాను బాధ్యుడిగా ఉండకుండానే, నాయకత్వం నెరపాలనేది ఆయన కోరిక. తాను పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించిప్పటి మాటల్లో ఈ వైఖరి స్పష్టమైంది. వర్కింగ్ కమిటీ సమావేశంలో కొందరు పార్టీ నాయకత్వానికి ప్రియాంక పేరు ప్రస్తావించినప్పుడు 'ఆమెను ఇందులోకి లాగకండి' అనే రీతిలో వ్యాఖ్యానించారు. ఆమె ఎక్కువగా మాట్లాడకుండా నిరుత్సాహపరిచారని కూడా వార్తలను బట్టి తెలుస్తున్నది. తమ కుటుంబం వారికి (ప్రియాంకకు) అధ్యక్షపదవి ఇవ్వకూడదని రాహుల్ అంటున్నారు. కానీ తనకు ఆసక్తి లేదని ప్రియాంక ఇప్పటివరకు చెప్పలేదు. కాంగ్రెస్‌లోని అనేకమంది నాయకులను తొలిగించి, తనకు నచ్చిన రీతిలో ప్రక్షాళన కావించాలని, తన మార్గదర్శకత్వంలోనే పార్టీ నడువాలని రాహుల్ కోరుకుంటున్నారనేది ఆయన ఉత్తరాన్ని బట్టి తెలిసిపోతున్నది. పార్టీ పరాజయం తర్వాత కూడా రాహుల్ ఏ మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు.

రాజకీయ నాయకులకు ముందుండి పోరాడే లక్షణం ఉండాలె. నెహ్రూ మరణించే నాటికి ఇందిరాగాంధీ పార్టీ అధ్యక్షురాలిగా చురుగ్గా వ్యవహరించారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యత్వం పొంది లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో చేరారు. ఆమె పదవులు స్వయంగా సాధించుకుని, నిలబెట్టుకున్నవే. కానీ రాహుల్‌గాంధీ మొదటి నుంచి అధికారం నెరపాలె కానీ బరువు, బాధ్యతలు ఉండకూడదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆయనకు బాధ్యతలు చేపట్టడం మీద ఆసక్తి ఉంటే మన్మోహన్‌సింగ్ మంత్రివర్గంలోనే చేరేవారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ మొదటి పర్యాయం అధికారం చేపట్టిన తర్వాత, ఒక దశలో రాహుల్‌గాంధీ నాయకత్వంపై నమ్మకం సడలి కార్యకర్తలు అసహనం ప్రదర్శించడం మొదలుపెట్టారు. మొదటినుంచి పార్టీకి విధేయులుగా ఉండే మేధావులు కూడా ఆయన పట్ల అసంతృప్తిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆయన నాయకత్వ వైఫల్యం మరింత స్పష్టమైంది. దీంతో ఆయన ముందుగానే రాజీనామా చేసి విమర్శల నుంచి తప్పించుకున్నారు. పార్టీకి రాజీనామా చేస్తూ ఆయన రాసిన ఉత్తరాన్ని గమనిస్తే, పైకి తాను బాధ్యత వహిస్తున్నట్టు చెప్పుకున్నా, కారణాలను వేరొకరిపైకి తోసే ప్రయత్నమే కనిపిస్తున్నది. బీజేపీ, ఆరెస్సెస్‌తో పాటు మీడియా, న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ మొదలైనవన్నిటినీ తప్పుబట్టారు. పార్టీలో అనేక మంది బాధ్యత వహించాలన్నారు. తాను ఒంటరిగా పోరాటం చేశానని చెప్పుకోవడం అంటే పార్టీ తన వెనుక లేదనేది ఆయన ఆరోపణ. బీజేపీ– ఆరెస్సెస్ వ్యవహరించిన తీరు అభ్యంతరకరమైనదే. వ్యవస్థల్లో లోపాలున్న మాట నిజమే. కానీ ఈ పరిస్థితులను ఎదుర్కొనడంలో తన వైఫల్యాలను గుర్తించడం లేదు. ప్రాంతీయ పార్టీల నాయకులు ఇంత కన్నా విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న సందర్భాలున్నాయి. అయినా నెగ్గుకురావడం వారి నాయకత్వ లక్షణాన్ని సూచిస్తున్నది.

> **రాహుల్‌గాంధీ తన వ్యక్తిత్వంలోనే లోపాలున్నాయి. నాయకుడిగా విఫలమయ్యారనేది స్పష్టం. నెహ్రూ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తన ఆధిపత్యాన్ని వదులుకోదు. పార్టీకి కొత్త అధ్యక్షుడు రావచ్చు కానీ, కొత్త నాయకత్వం రావడం సమీప భవిష్యత్తులో అనూహ్యం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షోభం నుంచి బయటపడటం అంత సులభం కాదు. ప్రాంతీయ పార్టీలను సమాన స్థాయిలో గుర్తించి కలిసి నడిస్తే, దీర్ఘకాలికంగా నిలదొక్కుకోవడం ఎట్లా ఉన్నా, కనీసం కొంత తక్షణ వెసులుబాటయినా లభిస్తుంది.**

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాహుల్ వ్యవహారసరళి పట్ల ఏ మాత్రం రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారికైనా ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. బీజేపీ ఎంత దుందుడుకుగా వస్తున్నదో తెలుసు కనుక, దేశవ్యాప్తంగా రాజకీయపక్షాలను కూడగట్టాల్సింది. ప్రాంతీయ, తటస్థ పార్టీలు ఉన్నచోట వారు ఎన్ని సీట్లు ఇచ్చినా సరే ఆమోదించి, తమశక్తియుక్తులన్నిటినీ బీజేపీపై ప్రయోగించాల్సింది. బీజేపీతో ముఖాముఖి తలపడిన సీట్లలో ఆ పార్టీని ఓడించడానికి కృషిచేయాల్సింది. కానీ ఆయన తటస్థ పార్టీలతో తలపడటం ద్వారా తన శక్తియుక్తులను బీజేపీపై కేంద్రీకరించలేకపోయారు. దేశ ప్రజలకు సంఘటిత ప్రత్యామ్నాయం చూపడంలో విఫలమయ్యారు. ఎన్నికలముందు తాను ప్రధాని కావాలని తహతహలాడి, తీరా పరాజయం వరించాక తనకు పదవులు ముఖ్యం కాదని అంటున్నారు. రాహుల్‌గాంధీ తన వ్యక్తిత్వంలోనే లోపాలున్నాయి. నాయకుడిగా విఫలమయ్యారనేది స్పష్టం. నెహ్రూ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తన ఆధిపత్యాన్ని వదులుకోదు. పార్టీకి కొత్త అధ్యక్షుడు రావచ్చు కానీ, కొత్త నాయకత్వం రావడం సమీప భవిష్యత్తులో అనూహ్యం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షోభం నుంచి బయటపడటం అంత సులభం కాదు. ప్రాంతీయ పార్టీలను సమాన స్థాయిలో గుర్తించి కలిసి నడిస్తే, దీర్ఘకాలికంగా నిలదొక్కుకోవడం ఎట్లా ఉన్నా, కనీసం కొంత తక్షణ వెసులుబాటయినా లభిస్తుంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో లేవు. కానీ ఈ ఐదేండ్లు పార్లమెంటులో, బయటా బాధ్యతాయుతంగా కలుపుగోలుగా వ్యవహరించడం అవసరం.

జనగళం

క్రికెట్ వీరుడు పల్వంకర్ బాలు

భారతదేశ క్రికెట్ చరిత్రలో అత్యంత వివక్షకు గురైన క్రికెటర్లలో మొదటివాడు బాలు పల్వంకర్. తర్వాతి స్థానంలో వినోద్ కాంబ్లీ, అతుల్ బెడాదేను కూడా చేర్చవచ్చు. ప్రస్తుతం 12వ ప్రపంచకప్ జరుగుతున్న నేపథ్యంలో మొదటితరం దళిత క్రికెటర్ బాలు పల్వంకర్ గురించి చర్చించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. భారతదేశ చరిత్రలో మరుగునపడిన చాలామంది దళిత యోధుల్లో ఈయన ఒకరు. డయ్యర్‌ను చంపిన చమార్ వీరుడు ఉద్ధంసింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి తరపున తొలి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఝుల్కరీబాయి, సచిన్ ఛాయలో మరుగునపడిపోయిన వినోద్ కాంబ్లీ... ఇలా ఎందరో దళిత యోధులున్నారు.

బ్రిటిష్ ఇండియా ముంబై, ద్వారాడ్ మురికివాడలో 1876 మార్చి 19న చమార్(మాదిగ) కుటుంబంలో జన్మించారు పల్వంకర్. వీరి కుటుంబానిది చెప్పులు కుట్టే వృత్తి. ఆయనకు చిన్నప్పటినుంచి క్రికెట్ అంటే ఇష్టం. మొదట హిందూ, ఆ తర్వాత భారతజట్టుకు వెన్నెముకగా నిలిచాడు. పల్వంకర్ ఎడమచేతి వాటం స్పిన్నర్. అయినా బంతిని ఇరువైపులా తిప్పగల సామర్థ్యం అతనిది. తన మొదటి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ను 1906 ఫిబ్రవరి 8న ఆడారు. పల్వంకర్ 1905–21 వరకు 179 వికెట్లు తీశాడు.

పల్వంకర్‌ను అంటరానిగావాడిగా చూసేవారు. కేవలం ఈ వివక్ష వల్లనే అతను క్రికెట్ నుంచి తొలిగించివేయబడినాడు. క్రికెట్ తర్వాత వివక్షపై పోరాటం చేశారు పల్వంకర్. ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో సన్నిహితంగా మెదిలేవాడు. అంబేద్కర్‌తో కలిసి అణగారిన కులాల ఐక్యత కోసం పోరాటం చేశారు. పల్వంకర్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 'హీరో ఆఫ్ దళిత్'గా ప్రశంసించేవారు. 2018లో హిందీలో పల్వంకర్ బయోపిక్ సినిమా కూడా వచ్చింది. భారత దేశం గర్వించదగ్గ మొదటి దళిత క్రికెటర్ బాలు పల్వంకర్ అనడంలో సందేహం లేదు.

(నేడు బాలు పల్వంకర్ వర్ధంతి)

- డాక్టర్ పిడమర్తి రవి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10. బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

తెలంగాణం

డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

రాష్ట్రానికి రక్షణకవచం టీఆర్ఎస్

ఒక ఉద్యమం ప్రపంచాన్ని ఆకర్షించింది. ఒక్కడి దీక్ష దేశ ప్రజలను ఆలోచింపజేసింది. ఓ నాయకుడి ఉపన్యాసాలు ప్రజల రక్తాన్ని ఉరకలు పెట్టించినయి. ఒక వ్యక్తి కష్టం తెలంగాణకు స్ఫూర్తినిచ్చింది. ఆరు దశాబ్దాలు దోపిడికి గురైన ప్రజానీకానికి ఒక్క రూపం కనబడింది. ఆత్మహత్యలు, బలిదానాల సాక్షిగా కొనసాగిన ఉద్యమం చావో బతుకో తేల్చుకునేందుకు బరిగీసి నిలిచింది. అందరూ ఒకటై ఆయన అడుగులో అడుగువేశారు. ఒకరి దీక్ష నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది.

ఒక్కడి వల్ల దేశం మారిపోతుందా అనుకొనే ఏ ఒక్కడి వల్ల దేశానికి ప్రయోజనం లేదన్న ఫిడెల్ క్యాస్ట్రో మాటలను ఆదర్శంగా తీసుకొని అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపిన మహానేత కేసీఆర్ తన దీక్షతో రాష్ట్రాన్ని సాధించారు. కొట్లాడి సాధించిన తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చే లక్ష్యంతో ముందుకువెళ్తున్న మహానేత కూడా కేసీఆరే.

ఉద్యమం ఎంతో మహోధృతంగా సాగినా ప్రజాస్వామ్యంలో ఒక రాజకీయశక్తి అవసరమని భావించిన కేసీఆర్ ఉద్యమ ప్రారంభంలోనే టీఆర్ఎస్‌కు ఊపిరిపోశారు. ఇక ఆనాటి నుంచి కేసీఆర్ దార్శనికతకు, వ్యూహాలకు అనుగుణంగా టీఆర్ఎస్ ఉద్యమిస్తూనే ఉన్నది. కేసీఆర్‌కు రాష్ట్ర సాధన ఉద్యమం ఎట్లా ఉండాలె, బంగారు తెలంగాణను ఎట్లా నిర్మించుకోవాలనే విషయాల్లో ఎంత స్పష్టత ఉన్నదో రాజకీయపక్షంగా టీఆర్ఎస్ ఏయే దశల్లో ఏయే స్వభావంతో, నిర్మాణంతో ఉండాలనే విషయంలో కూడా అంతటి స్పష్టత ఉన్నది. రాష్ట్రం సిద్ధించడానికి ముందు కేసీఆర్ టీఆర్ఎస్‌ను ఒక ఉద్యమపార్టీగా నడిపించారు. రాష్ట్ర సాధన తర్వాత టీఆర్ఎస్ పక్కా రాజకీయపక్షమని స్పష్టంచేశారు. అయితే ఒక రాజకీయపక్ష నిర్మాణం హడావుడిగా ఒక్కరోజులోనో, ఒక ఏడాదిలోనో నిర్మించేది కాదు. పార్టీ స్వభావం కూడా అంత తొందరగా మారదు. రూపాంతరం చెందడానికి కొంత వ్యవధి అవసరం. ఇందుకోసం పూర్తి స్థాయి దృష్టి పెట్టవలసి వచ్చింది. ఎప్పుడు ఏ అంశాన్ని ప్రాధాన్యంగా చేపట్టాలనేది కేసీఆర్‌కు తెలుసు.

ముఖ్యమంత్రిగా కేసీఆర్ దృష్టిలో ప్రజలంతా సమానమే. మొత్తం సమాజాభివృద్ధిపై ఆయన దృష్టిసారించారు. బంగారు తెలంగాణ సాధన లక్ష్యంగా గల కేసీఆర్‌కు తెలంగాణ అంతా నా వాళ్లే అనే భావన ఉంటుంది. అందువల్ల పరిపాలనా సంస్కరణలపై, సామాజిక–ఆర్థిక అభివృద్ధిపై తన శక్తియుక్తులన్నీ కేంద్రీకరించారు. అరువై ఏండ్ల పరాయి అణిచివేతలో అతలాకుతలమైన తెలంగాణ సమాజం కుదుటపడటం ప్రధానంగా భావించారు. మొదటి ఐదేండ్లలో సమాజాన్ని కుదుటపర్చగలిగారు. ఇది కేసీఆర్ సాధించిన గొప్ప విజయం. కేసీఆర్ సాగించిన అసాధారణ కృషే టీఆర్ఎస్‌ను మళ్ళా అధికారంలోకి తెచ్చింది. ప్రజల దృష్టిలో కేసీఆర్ వేరు, టీఆర్ఎస్ వేరు కాదు. ప్రజలకు కేసీఆరే అన్నీ. కేసీఆర్‌ను చూసే ఓటేస్తారు. అందువల్ల టీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడానికి కేసీఆర్‌కు కొంత వెసులుబాటు లభించింది.

రాజనీతి చతురుడైన కేసీఆర్‌కు రాజకీయపక్షం స్వభావం, పాత్ర, నిర్మాణంపై పూర్తి స్పష్టత ఉన్నది. ఉద్యమకాలం నుంచి తమ వెంట ఉన్న కార్యకర్తల గురించి తెలుసు. వారి శక్తియుక్తులను సమాజం కోసం ఎట్లా ఉపయోగించాలనే అవగాహన కేసీఆర్‌కు ఉన్నది. కార్యకర్తల మనోభావాలు, వారి బాగోగులపై కేసీఆర్‌కు స్పష్టత ఉన్నది. అందుకే ఒకవైపు పరిపాలన సాగిస్తూనే మరోవైపు పార్టీ పటిష్టత వైపు ఆయన దృష్టి సారించారు. టీఆర్ఎస్‌ను ఒక ఉద్యమ పార్టీ నుంచి పటిష్టమైన రాజకీయపక్షంగా మార్చే ప్రక్రియను ప్రారంభించారు.

ఒకనాడు ఉద్యమమే ఊపిరిగా బతికిన టీఆర్ఎస్ పార్టీ నేడు సకల జనుల ప్రయోజనాలే పరమావధిగా ముందుకు సాగుతున్నది. యావత్ దేశం తెలంగాణ వైపు చూసేలా సీఎం కేసీఆర్ తన పాలన కొనసాగిస్తున్నారు. కొత్త రాష్ట్రమైనా ఇతర పెద్ద రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువడం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం. అలాంటి ఇంటి పార్టీని పటిష్టం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతూ సంస్థాగతంపై దృష్టిపెట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ టీఆర్ఎస్‌ను, కార్యకర్తలను కాపాడుకుంటూ నడిపిన తీరును కూడా గుర్తించడం అవసరం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా కేసీఆర్ 2001 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. నాటి నుంచి 2014 వరకు రాష్ట్ర సాధనోద్యమాన్ని నిర్వహించారు. మొదటినుంచి టీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులు ఉద్యమ ఆవేశంతో ఉన్నారు. అయినా కేసీఆర్ వారిని రెచ్చగొట్టకుండా, నష్టపరుచకుండా ఉద్యమాన్ని చాకచక్యంగా నడిపారు. పరాయి పాలకులు టీఆర్ఎస్‌ను దెబ్బకొట్టడానికి అనేక కుట్రలు పన్నినా వాటిని తిప్పికొట్టి పార్టీని కాపాడుకున్నారు. ఒక్క రక్తపు బొట్టు చిందించకుండా రాష్ట్రాన్ని సాధించిన నేతగా కేసీఆర్ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. ఈ 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను, అవాంతరాలను, కళ్లు కుతంత్రాలను ఛేదించారు. ఉద్యమకాలంలో తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాన్ని నిర్వహించడం జరిగింది. కార్మికులను, ఉద్యోగులను, విద్యావంతులను, రచయితలను, కళాకారులను, తెలంగాణవాదులను ఇతర అన్ని వర్గాల ప్రజలతో జేఏసీలు ఏర్పాటు చేసి తెలంగాణ భావజాల వ్యాప్తిని ప్రజల్లోకి తీసుకెళ్ళడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పారు.

కేసీఆర్ అసెంబ్లీ వేదికగా పారాటాలు నిర్వహించారు. పార్లమెంట్‌లో ఒక్కరో ఇద్దరో ఉన్నా, అక్కడా తెలంగాణ గళాన్ని వినిపించగలిగారు. ఆనాడు కేసీఆర్ కేంద్ర మంత్రి పదవి తీసుకున్నది కూడా అన్ని పార్టీలు తెలంగాణకు మద్దతు తెలిపేలా చేయడానికే తప్పా ఇతర ఏ ప్రయోజనాలు ఆశించలేదు. తెలంగాణ రాష్ట్రం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. జయశంకర్ సార్–లాంటి మేధావులను ముందుంచి ఉద్యమ భావజాలాన్ని వ్యాపిచేశారు. ఒక్క కేసీఆర్‌తో మొదలైన ఉద్యమం లక్షలాది మందితో పెద్ద పెద్ద సభలను నిర్వహించి తెలంగాణ భావజాల వ్యాప్తిని విజయవంతం చేయడం జరిగింది. ఈ క్రమంలో అనేక ఎన్నికలను కూడా భావజాల వ్యాప్తికే ఉపయోగించారు. అవి శాసనసభ, పార్లమెంటు ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా చివరికి టీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు రాజీనామా చేసి ఉప ఎన్నికకు సవాలు విసిరినా ఉద్యమం కోసం చేశారే తప్ప ఇతరత్రా ప్రయోజనాలను ఆశించి కాదు.

2001 నుంచి 2014 వరకు కూడా తెలంగాణ భావజాల వ్యాప్తి, రాష్ట్ర ఆవిర్భావ ఆవశ్యకత, తెలంగాణ ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా టీఆర్ఎస్ పనిచేసింది. విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, ఉద్యోగుల నుంచి మొదలుకొని చివరికి చెత్త ఏరుకునే వారు కూడా జేఏసీలు ఏర్పాటుచేశారు. అయితే వీటన్నిటికీ కేంద్రంగా టీఆర్ఎస్ పనిచేసింది. కేసీఆర్ పార్టీ ప్రాధాన్యం తెలిసి క్రియాశీలంగా ఉపయోగించారనే కానీ ఉద్యమాన్ని పార్టీ పరిధికి కుదించలేదు. తెలంగాణ రాష్ట్ర కోసం సంఘటిత, అసంఘటిత రంగాలన్నింటికి ఆజ్యం పోసి, రూపం ఇచ్చిన నాయకుడు కేసీఆర్. ఈ నేపథ్యంలో దేశంలోని 35 పార్టీలను తెలంగాణకు మద్దతు పలికించడంలో ఒప్పించడంతో పాటు పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు మద్దతు తెలిపేలా చేయడంలో కేసీఆర్ సఫలీకృతులయ్యారు. ఈ క్రమంలో వచ్చిన ఎన్నో అవమానాలను, ఆటుపోట్లను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే ఏకైక ఎజెండాగా పార్టీని నడిపించారు.

ప్రభుత్వం ముందుకెళ్తుంటే కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు ప్రయత్నిస్తునే ఉన్నారు. వాటిని ఒకవైపు ఎదుర్కొంటూ మరోవైపు ప్రాజెక్టుల నిర్మాణాలను తొందరగా పూర్తి చేసేందుకు కేసీఆర్ నిత్యం కష్టపడుతున్నారు. సాగునీటి రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు విజయవంతం కావడం వెనుక కేసీఆర్ కృషి ఎంతో ఉన్నది. మరోవైపు చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయడం, నిజాం నాటి కాలంలో ఏర్పాటుచేసిన చెరువులపై, వాటి పునః నిర్మాణాలపై దృష్టిసారించి కోట్ల రూపాయలు వెచ్చించి వేల చెరువులను అభివృద్ధి చేసి రైతులకు, మత్స్యకారుల జీవనశైలి మార్చిన ఏకైక నేత మన కేసీఆర్.. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న అన్నిరకాల చేతివృత్తుల వారికి ప్రోత్సాహం ఇచ్చి వారి స్థితిగతులు మార్చిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుంది.

కేసీఆర్ చిత్తశుద్ధి, పాలనాదక్షత మూలంగా తెలంగాణలో ఇటీవల జరిగిన అన్నీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శాసనసభ ఎన్నికల్లో 3/4 వంతు మెజారిటీని అందించడం గొప్ప విషయం. సర్పంచ్ ఎన్నికల్లో 82 శాతం సీట్లను ఇవ్వడం సాధారణమైన విషయం కాదు. జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో 90 శాతం సీట్లతో పాటు రాష్ట్రంలోని మొత్తం 32 జిల్లా పరిషత్‌లలో టీఆర్ఎస్‌ను గెలిపించారు. అంటే దాదాపుగా 95 శాతం పదవులు టీఆర్ఎస్‌కు లభించినవి.

> **టీఆర్ఎస్‌ను తెలంగాణ సమాజానికి వెన్నెముకగా మార్చవలసిన సందర్భం వచ్చిందని కేసీఆర్ గ్రహించారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. దీనిలో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను నియమించారు. అన్ని జిల్లా కేంద్రాలలో పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలు ఉండేలా ఏర్పాట్లుచేశారు.**

టీఆర్ఎస్‌ను తెలంగాణ సమాజానికి వెన్నెముకగా మార్చవలసిన సందర్భం వచ్చిందని కేసీఆర్ గ్రహించారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. దీనిలో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను నియమించారు. అన్ని జిల్లా కేంద్రాలలో పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలు ఉండేలా ఏర్పాట్లుచేశారు. గ్రామ, మండల కమిటీలలో 51 శాతం పైన సభ్యులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో నింపాలని నిర్ణయించారు. టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించారు. అన్ని స్థాయిలలో శిక్షణలు ఇవ్వడం ద్వారా పార్టీని పటిష్టం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు.

తెలంగాణ ప్రజలు తమ రక్షణ కవచంగా టీఆర్ఎస్‌ను భావిస్తున్నారు. కనుక వారి నమ్మకానికి అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకొనిపోతున్నారు. తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్‌పై ఉన్న ప్రేమతో, అచంచల విశ్వాసంతో అద్భుతమైన విజయాలు అందించారు. వారి ప్రేమకు, నమ్మకానికి, విశ్వాసానికి ప్రతిరూపంగా తెలంగాణ సమాజానికి, ప్రజలకు ఒక అభేద్యమైన రక్షణ కవచంగా టీఆర్ఎస్ పార్టీని చేయడం, సంస్థాగతంగా పటిష్టపరుచుకోవడం ప్రతి నాయకుని, కార్యకర్త విధి, బాధ్యత.

(వ్యాసకర్త: ఎమ్మెల్సీ, మండలి విప్)

ఒడిబియ్యం ఒక భరోసా

చరిత్ర

శ్యాంమోహన్

వికారాబాద్ జిల్లా మారుమూల గ్రామంలో అప్పటి కలెక్టర్ దివ్యదేవరాజన్ ప్రజల సమస్యలు వింటున్నారు. ఆమెతో సహా అందరూ నేల మీదే కూర్చున్నారు. మీటింగ్ అయ్యాక అందరూ లేచి నిలబడటానికి ప్రయత్నిస్తున్నారు. అక్కడున్న ఇద్దరు 70 ఏండ్లున్న వృద్ధులు మెరుపులా లేచి నిలబడి లేవలేని తమకన్నా చిన్న వయసున్న వారికి చేయి అందిస్తున్నారు. ఆ వయస్సులో వారిలోని స్టిఫ్‌నెస్ చూసి వారి ఆహారపుటలవాట్లు అడిగారామె.. 'జొన్న రొట్టెలు, కొర్రల బువ్వ, రాగి అంబలి, మా తాతల నుంచీ గిట్లనే తింటున్నం..' అన్నారా పెద్దలు. అప్పటి నుంచీ ఆ కలెక్టరమ్మ చేతిలోకి అంబలి బాటిల్ వచ్చింది. అంతేకాదు, ఇప్పటివరకు తెల్లన్నం పెడుతున్న అంగన్వాడీ బిడ్డల మెనూలో కొర్రలు చేరాయి. తెలంగాణ పూర్వీకుల ఆహారం ఎంత గొప్పదో చెప్పే ఉదాహరణ ఇది.

పచ్చని వరి పొలాలతో ధాన్యపు రాసులతో సస్యశ్యామలంగా ఉండే మెదక్ జిల్లాను గతంలో మెతుకు దుర్గం అనేవారు. తెలంగాణలోకెళ్లా వరిని ఎక్కువగా పండించడం వల్ల ఆ జిల్లాకు పేరు వచ్చింది. కాలక్రమేణా ఇది మెతుకుగానూ, ఆ తర్వాత మెదక్‌గా మారింది. ఇక్కడ వరితో పాటు జొన్న, మొక్కజొన్న, చెరకు ప్రధాన పంటలు. మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల వర్షపాతం తగ్గడంతో భూమిలో తేమ శాతం తగ్గడం గమనించిన రైతులు ఇప్పుడు రాగులు, కొర్రలు, సజ్జలు వంటి అపరాలు పండిస్తున్నారు. ధాన్యం కంటే, చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగింది. తెల్లన్నం తినేటోళ్లు కూడా ఆరోగ్యం కోసం, మిల్లెట్స్ వెంటపడటం నేటి దృశ్యం.

ఒడి బియ్యం అంటే..? 'పెళ్లి' అనే బంధం కారణంగా ఆడబిడ్డ తల్లిదండ్రులకు, దూరంగా వెళ్లిపోవడమే కాక, కొత్త జీవితం ప్రారంభించాలి. అలా పుట్టింటివారిని వదిలేసి వ

వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న పరిశీలకుడు గట్టు రాంచందర్‌రావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లిలో సర్పంచ్ జాము రవికి సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

సభ్యత్వాల సంబురం

ఊరూరా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ▪ ఉత్సాహంగా పాల్గొంటున్న పార్టీ శ్రేణులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఊరూరా సంబురంగా సాగుతున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటుండగా ప్రజలు సైతం సభ్యత్వాలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కడ చూసినా సభ్యత్వాల సందడి కన్పిస్తున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇంచార్జీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం గోపాల్‌రావుపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసిన పార్టీ నాయకులను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం అభినందించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూ రి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ జనగామ లక్ష్మి, పార్టీ నాయకులు చింతల జగన్మోహన్‌రెడ్డి, జనగామ రాజయ్య తదితరులు కలిసి గ్రామంలో 200 సాధారణ, 100 క్రియాశీల సభ్యత్వ సేకరణ పూర్తి చేసి రూ.16,750 నగదును మంత్రి కొప్పులకు ధర్మారంలో అందజేశారు. మిగతా గ్రామాల వారు కూడా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లిలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సర్పంచ్ జాము రవి తదితరులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు.

గురువారం కరీంనగర్‌లోని ఐదో డివిజన్‌లో సభ్యత్వ రసీదును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు

మెదక్ జిల్లా కూచన్‌పల్లిలో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి

కరీంనగర్‌లో..

కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇంచార్జి బస్వరాజ్ సారయ్య గురువారం సభ్యత్వ నమోదును పరిశీలించారు. కరీంనగర్‌లోని 5వ డివిజన్‌లో స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రామడుగు మండలం షానగర్‌లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గన్నేరువరం మండలం జంగపల్లిలో బెజ్జంకి జెడ్పీటీసీ సభ్యులు తన్నీరు శరత్‌రావు సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల బోయినపల్లిలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు, జోగినపల్లి ప్రేమ్ సాగర్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ తదితరులకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ సభ్యత్వాలను అందజేశారు.

ఉమ్మడి వరంగల్‌లో..

వరంగల్ అర్బన్ జిల్లాలోని కాజీపేట చౌరస్తాలో సభ్యత్వ నమోదులో మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ పదో డివిజన్ చింతల్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. జనగామ జిల్లా జాఫర్‌ఘడ్‌లో మండలి విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వాజేడులో ఖమ్మం ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి పరిశీలించారు. ఇంద్రవెల్లిలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి, షట్‌పల్లి, పంగిడిసోమారం, సర్వాయిపేట గ్రామాల్లో ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ అరుణక్క నగర్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పలువురికి సభ్యత్వం అందజేశారు. కామారెడ్డి జిల్లా గాంధారిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో..

ఖమ్మం జిల్లా వైరాలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రాములునాయక్, మధిరలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మంలో పలువురు కార్పొరేటర్లు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మణుగూరులో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కార్యకర్తలకు సభ్యత్వ నమోదు రసీదులు అందజేశారు.

నల్లగొండ జిల్లాలో..

నల్లగొండ జిల్లా పీఏపల్లి మండల కేంద్రంలో దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, నల్లగొండ పట్టణంలోని మూడోవార్డులో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మునుగోడు, నాంపల్లి మండలాల్లో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్, అడ్డగూడూరు మండలాల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తుర్కపల్లిలో టీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజాపేటలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి నమోదులో పాల్గొన్నారు.

వికారాబాద్‌లో..

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస్‌చారి, సంతోశ్‌కుమార్, రాజన్‌గౌడ్, రాజు, సాయిరెడ్డితోపాటు పలువురు కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం వీరికి టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు పరిశీలకులు గుట్టు రాంచందర్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సభ్యత్వాలను అందజేశారు. పరిగి పట్టణంలోని శాంతినగర్‌లో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బొంరాస్‌పేట మండల కేంద్రంలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సభ్యత్వ నమోదు నిర్వహించారు. మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలం కూచన్‌పల్లిలో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్, అడ్డగూడూరు మండలాల్లో సభ్యత్వాన్ని అందజేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్

పెద్దపల్లి జిల్లా ధర్మారంలో సభ్యత్వ సేకరణ పూర్తయిన పుస్తకాలు, డబ్బులను మంత్రి కొప్పులకు అందజేస్తున్న గోపాల్‌రావుపేట నాయకులు

సభ్యత్వ సేకరణ లక్ష్యం పూర్తి చేయాలి

రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ నిర్దేశించిన ప్రకారం టీఆర్ఎస్ సభ్యత్వ సేకరణ లక్ష్యం పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మారం మండల పరిధిలోని గోపాల్‌రావుపేట గ్రామంలో సభ్యత్వ సేకరణ ఇన్‌చార్జి అయిన ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ జనగామ లక్ష్మి, పార్టీ నాయకులు చింతల జగన్మోహన్‌రెడ్డి, జనగామ రాజయ్య తదిరులు కలిసి గ్రామంలో 200 సాధారణ, 100 క్రియాశీల సభ్యత్వ సేకరణ పూర్తి చేసి రూ. 16, 750 నగదును మంత్రి ఈశ్వర్‌కు ఎంపీపీ కార్యాలయం వద్ద అందజేశారు. మొట్ట మొదటి సారి సభ్యత్వ సేకరణ చేసి డబ్బులు అందించిన నాయకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ పార్టి సభ్యత్వ సేకరణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈనెల 7లోగా పూర్తి చేయాలని పార్టి నాయకులకు సూచించారు. సభ్యత్వ సేకరణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు.

వరంగల్ అర్బన్ జిల్లా చింతల్‌లో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో సభ్యత్వ రసీదులు అందజేస్తున్న డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

నల్లగొండ జిల్లా మునుగోడులో సభ్యత్వాలను అందజేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

కామారెడ్డి జిల్లా గాంధారిలో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్

తెలంగాణలో బీజేపీ పప్పులుడకవు

వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలో సభ్యత్వాన్ని అందజేస్తున్న కడియం శ్రీహరి. చిత్రంలో పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి

- దేశం చూపంతా కేసీఆర్ పాలనపైనే
- మాజీ డిప్యూటీ సీఎం కడియం

కాజీపేట(వరంగల్ అర్బన్): ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో బీజేపీ గాలి వీచినా తెలంగాణలో మాత్రం పప్పులు ఉడకలేదని, ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకున్నారని మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట చౌరస్తాలో గురువారం నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ భద్రంగా ఉంటుందని, ప్రజలు పార్టీ సభ్యత్వాలను తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. భవిష్యత్‌లోనూ రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు తప్ప మరే పార్టీకి మనుగడ ఉండదని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. మనుగడలో లేని పార్టీల తరపున గెలిచిన కొందరు ప్రజాప్రతినిధులు కేసీఆర్ నాయకత్వంలో సేవ చేసేందుకు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. టీఆర్ఎస్‌లో కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని కడియం తెలిపారు.

'సాగర్'లో హైడ్రో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సర్వే

నందికొండ: నాగార్జున సాగర్‌లో హైడ్రో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. నేవీ అధికారి నాగేష్ ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం కృష్ణానదిలో అండర్ వాటర్ సర్వే నిర్వహించారు. కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఉడాన్ స్కీంలో భాగంగా నాగార్జునసాగర్‌లో హైడ్రో ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్, చిల్డ్రన్స్ పార్క్, విజయవిహార్ వెనక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించారు. నీటిలో రాళ్లు ఎంత లోతులో ఉన్నాయి. నదిలోతు ఎంత, లోపలి వాతావరణం ఎలా ఉంది తదితర విషయాలపై సర్వే చేస్తున్నామని, ఇది నాలుగు రోజుల పాటు జరుగుతుందని అధికారులు తెలిపారు.

కృష్ణానదిలో అండర్ వాటర్ సర్వే నిర్వహిస్తున్న నేవీ బృందం

రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ : ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ పాలనలో తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని తిరుమల వేంకటేశ్వరుడిని కోరుకున్నానని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు దేశానికే ఆదర్శంగా నిలిచేలా అడుగులు వేస్తున్నాయన్నారు. అనంతరం స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అందరితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మంత్రి దయాకర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఒకే రోజు 282 యూనిట్ల రక్త సేకరణ

తొర్రూరు, నమస్తే తెలంగాణ : మంత్రి ఎర్రబెల్లి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకుర్తి నియోజకవర్గంలో పెద్దఎత్తున రక్తదాన శిబిరాలను నిర్వహించారు. తొర్రూరులోని గుడిపూడి మధుకర్‌రావు విశ్రాంతి భవనం ఆవరణలో టీఆర్ఎస్ కార్యకర్తలు 155 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. రాయపర్తిలో గుడిపూడి గోపాల్‌రావు ఆధ్వర్యంలో 64 యూనిట్లు, దేవరుప్పులలో 63 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.

తిరుమలలో శ్రీవారిని దర్శించుకొని బయటికి వస్తున్న మంత్రి ఎర్రబెల్లి దంపతులు

రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ అమయ్‌కుమార్, అధికారులు, టీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు వేమిరెడ్డి నర్సింహారెడ్డి

దేశానికే ఆదర్శంగా నిలవాలి

రైతుల ఆర్థిక స్వావలంబనకే పాడి పరిశ్రమ పైలట్ ప్రాజెక్టు

లబ్ధిదారుల అవగాహన సదస్సులో మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్ : పాడి పరిశ్రమలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలనీ, రైతుల ఆర్థిక స్వావలంబనకే పాడి పశువుల పెంపకం పైలట్ ప్రాజెక్టును సూర్యాపేట జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట సుమంగళి ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్ అధ్యక్షతన లబ్ధిదారుల అవగాహన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట నియోజకవర్గంలో ఎస్సీ కులాలకు చెందిన 829 మంది లబ్ధిదారులను గుర్తించి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు పాడి పశువుల పెంపకాన్ని పైలట్ ప్రాజెక్టును రూపొందించామన్నారు. రూ.33.16 కోట్లతో పాడి పశువులను అందజేయనున్నట్లు, రూ.19.89 కోట్లను లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ అందజేయనున్నట్లు తెలిపారు. విజయ డెయిరీ అనుసంధానంతో 25 మందితో ఒక సొసైటీ చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్‌తో చర్చించి ప్రాజెక్టును రూపొందించినట్లు మంత్రి చెప్పారు. భూమిని, గోవును నమ్ముకున్న వారు ఎప్పుడూ నష్టపోరని, వాటి ద్వారా అన్నీ లాభాలే సంక్రమిస్తాయన్నారు. లబ్ధిదారులు తమకు నచ్చిన పశువులను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

పొరహక్కుల సంఘం నాయకుల అరెస్ట్

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామంలో అటవీశాఖ అధికారులు, నాయకులకు మధ్య జరిగిన ఘటనకు సంబంధించి నిజనిర్ధారణ చేసేందుకు వెళ్తున్న పొరహక్కుల సంఘం నాయకులను ముందస్తుగా గురువారం అరెస్ట్ చేశారు. పొరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, నాయకులు మాదన కుమారస్వామి, సారయ్య, సోయం చిన్నయ్యను ఈజ్‌గాం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజేశ్వర్ తెలిపారు.

మురుగు కాల్వలో శిశువుల మృతదేహాలు

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదివేనగర్ కాలనీ సమీపంలో మురుగు కాల్వలో గురువారం పసికందుల మృతదేహాలు లభ్యమయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరిబాబు తెలిపారు.

దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

లింగాలఘనపురం : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గురువారం జనగామ జిల్లా లింగాల ఘనపురంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, బానిస బతుకుల విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై కొమురయ్య పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏడవెల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో

ఇద్దరు చిన్నారుల మృతి

రామడుగు/సుల్తానాబాద్ రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి శివారులోని సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో పని చేసేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బాలోడ్ జిల్లాకు చెందిన నీలం, నందకుమార్ సాహు దంపతులు తమ కూతురు హన్సిక(2)తో కలిసి మూడు రోజుల క్రితం వచ్చారు. నీలం సాహును ఇటుకల తయారీ పనిలో ఉంచి నందకుమార్ ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లాడు. గురువారం ఇటుకల తయారీలో నిమగ్నమైన నీలం తన కూతురు హన్సికను అక్కడే నిద్రపుచ్చింది. కాగా, ఉదయం 11.30 గంటలకు ఫ్లైయాష్ తెచ్చిన ట్రాక్టర్ రివర్స్ తీసుకుంటున్న క్రమంలో అక్కడే నిద్రిస్తున్న హన్సిక తలపైకి ఎక్కడంతో చిన్నారి అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బకెట్‌లో పడి..

ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి రెండేండ్ల బాలుడు మృతి చెందిన ఘటన పెద్దపల్లి జిల్లా కదంబాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ జరీనా-కరీమ్ దంపతులకు కుమారుడు హర్షిత్(2) ఉన్నాడు. కరీమ్ పనికి వెళ్లగా, తల్లి జరీనా, తాత ఖాసీంలు ఇంటి పక్కనే ప్రహరీ నిర్మిస్తున్నారు. హర్షిత్ అడుకుంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్లి అక్కడే ఉన్న బకెట్‌లో ప్రమాదవశాత్తు పడి ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బకెట్‌లో విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు.

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

మోఖాలో ఉన్నా రికార్డుల్లో మాయం

- పహాణీలోనుంచి వివరాలు తొలగింపు
- కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వమంటే రేపు మాపంటూ కాలయాపన
- రెవెన్యూ అధికారుల తీరుతో తిప్పలుపడుతున్న ఓ వృద్ధురాలు
- న్యాయంకోసం ధర్మగంటను ఆశ్రయించిన వరంగల్ అర్బన్ జిల్లావాసి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ అర్బన్ జిల్లా, ఖిల్లా వరంగల్ మండలం, ఖిలా వరంగల్ తూర్పుకోట గ్రామానికి చెందిన ఏసిరెడ్డి లచ్చమ్మకు స్తంభంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 481లో 2.30 ఎకరాలు, సర్వే నంబర్ 482 ఏ/1లో 1.38 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని 1973లో అర్హం కొమురయ్య, బిల్ల మల్లయ్యల వద్ద లచ్చమ్మ భర్త మొగిలయ్య కొన్నారు. ఆ సమయంలో పాస్‌పుస్తకాలు అందుబాటులో లేనికారణంగా మంజూరు కాలేదు. కాస్తులో మాత్రం లచ్చమ్మ భర్త మొగిలయ్య ఉన్నారు. కొన్నేండ్ల తర్వాత లచ్చమ్మ భర్త చనిపోయారు. అప్పట్నుంచి లచ్చమ్మ మోఖాలో ఉన్నప్పటికీ, ఆ భూమిలో సాగుచేయలేదు. భూమి సాగుచేయకపోతే అది అన్యాక్రాంతమవుతుందనే ఆందోళనతో.. 2010లో లచ్చమ్మ భూ సర్వే చేయించుకొన్నారు. సర్వేచేసిన రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 481లో 2.30 ఎకరాలు, 482 ఏ/1లో 1.38 ఎకరాలు ఉన్నదని గుర్తించి, పంచనామా కాపీని ఆర్డీవోకు సమర్పించారు. ఆర్డీవో ఆదేశానుసారం అప్పుడే సదరు భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను లచ్చమ్మ పేరిట మంజూరుచేశారు. 2014 వరకు అంతా సవ్యంగానే సాగింది. 2014లో సర్వే నంబర్ 481లో లచ్చమ్మ పేరిట ఉన్న 2.30 ఎకరాల భూమిని ఉన్నట్టుండి రెవెన్యూ అధికారులు రికార్డుల్లోనుంచి తొలగించారు. 2014లో స్తంభంపల్లి గ్రామం గీసుగొండ మండలంలో ఉండేది. రికార్డుల్లోంచి తొలగించిన భూమిని తిరిగి తమ పేరిట మార్చాలని అప్పటి వీఆర్వో, ఎమ్మార్వో చుట్టు ఎన్నిసార్లు తిరిగినా, మొర పెట్టుకున్నా రేపు మాపంటూ దాటవేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేశారు. రెవెన్యూ అధికారుల కాలయాపనకు తోడు తమ గ్రామం ఖిల్లా వరంగల్ మండలానికి మారిందని, మండలం మారినా తమ సమస్య మాత్రం పరిష్కారం కాలేదంటూ వాపోతున్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో సదరు భూమిని సర్వేచేసి పాస్‌పుస్తకాలు జారీచేస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదని పేర్కొన్నారు. గుడ్డిలో మెల్లగా సర్వే నంబర్ 482 ఏ/1లోని 1.38 ఎకరాలకు సంబంధించిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకమైతే లచ్చమ్మకు ఇచ్చారు. భూమి కొన్న నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం భూమిపై లచ్చమ్మ కుటుంబమే మోఖా మీద కొనసాగుతున్నది. తన భర్త కొన్న భూమిలో కొంత భూమికి కొత్త పాస్‌పుస్తకమిచ్చి.. మిగతాదానికి ఇవ్వకపోవడంపై బాధితురాలు లచ్చమ్మ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పైసలిచ్చినా పనిచేయలే

మండలం మారకముందే అప్పటి వీఆర్వోకు ఆడీడ అప్పుచేసి రూ.17 వేల వరకు అప్పజెప్పిన. కానీ ఆ వీఆర్వో పైసలు తీసుకొని కూడా పని చేయలే. అంతల తాసిల్దార్ ట్రాన్స్‌ఫర్ అయిండు. కొత్త తాసిల్దార్ వచ్చినంకనైనా సమస్య పరిష్కారమైతదంటే ఇప్పుడు కూడా అదే పరిస్థితి. ఇప్పటికే రెండు విడుతల రైతుబంధు నష్టపోయిన. సగం భూమికి ఇస్తున్నరు. సగం భూమికి రైతుబంధు వస్తలేదు. ఉన్నతాధికారులే విచారణచేసి 2.30 ఎకరాలకు కొత్త పాస్‌పుస్తకం ఇప్పించాలి. **- ఏసిరెడ్డి లచ్చమ్మ, బాధితురాలు**

మోఖా మీద లచ్చమ్మ ఉన్నది వాస్తవమే

సర్వే నంబర్ 482ఏ/1లో ఏసిరెడ్డి లచ్చమ్మ మోఖా మీద ఉన్న మాట వాస్తవమే. రికార్డులో మాత్రం ఆమె పేరు రావడంలేదు. వేరే వాళ్ల పేర్లు చూపిస్తున్నయ్. లచ్చమ్మ దగ్గరున్న ఆధారాలన్నింటినీ పరిశీలిస్తున్నాం. వీరి భూములను ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాల్సి ఉన్నది. దీంతోపాటు సదరు భూమి స్తంభంపల్లి, ధర్మారం రెండు గ్రామాల శివార్లలో కలిసి ఉండటంతో సమస్య ఏర్పడ్డది. సర్వేచేసి సమస్యను పరిష్కరిస్తాం. **- శ్రీధర్‌రెడ్డి, స్తంభంపల్లి వీఆర్వో**

గురువారం పెన్‌పహాడ్‌లో తాసిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ తాసిల్ ఎదుట రైతుల ధర్నా

పెన్‌పహాడ్: మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న వీఆర్వోపై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ తాసిల్ కార్యాలయం ఎదుట గురువారం సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్ గ్రామాలకు చెందిన కొందరు రైతులు ధర్నాచేశారు. సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్ వీఆర్వో వెంకటరత్నంను తొలగించాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన పట్టామార్పిడి, ఆన్‌లైన్, కొత్త పాస్‌పుస్తకాల జారీ విషయంలో వీఆర్వో తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఎన్నిసార్లు కలిసినా రేపు మాపు అంటూ కాలయాపనచేస్తున్నారని ఆరోపించారు. సదరు వీఆర్వోను కార్యాలయంలో నిర్బంధించడానికి ప్రయత్నించగా, వీఆర్వో అక్కడినుంచి జారుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

'ధర్మగంట' రైతుల భూసమస్యల పరిష్కారానికి చక్కని వేదిక. భూసమస్యల పరిష్కారానికి రికార్డుల ప్రక్షాళన చేపట్టినా అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తి స్థాయిలో ఫలితం కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భూసమస్యలను అధికారులు పట్టించుకోక పోవడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సివస్తున్నది. రైతు సమస్యలను అర్థం చేసుకున్న 'నమస్తే తెలంగాణ' ధర్మగంట పేరుతో రాస్తున్న కథనాలు అన్నదాతలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. రోజూ పేపర్‌లో వస్తున్న భూసమస్యల కథనాలు, రైతులు పడుతున్న ఇబ్బందులు కండ్లకు కట్టినట్టు ప్రచురిస్తుండటం, వాటికి కలెక్టర్, ఆర్డీవో వంటి ఉన్నతాధికారులతోపాటు, మండల స్థాయిలో తాసిల్దార్ స్పందిస్తున్నారు. రైతుల పక్షాన 'నమస్తే తెలంగాణ' నిలువడం అభినందనీయం.

- తిర్మణి రమణారెడ్డి, సుద్దపల్లి, పెగడపల్లి మండలం, జగిత్యాల జిల్లా

నా భూమిని రికార్డుల్లో చేర్చండి

- జనగామ జిల్లా బచ్చన్నపేట మండలవాసి అంజమ్మ వేడుకోలు

జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారం గ్రామానికి చెందిన చల్లా సుగుణాకర్‌రెడ్డికి వారసత్వంగా 22.19 ఎకరాల భూమి సంక్రమించింది. అందులో 7.20 ఎకరాల భూమిని విక్రయించారు. 1994లో సుగుణాకర్‌రెడ్డి మరణించిన తర్వాత 1996లో మిగిలిన భూమి భార్య చల్లా అంజమ్మ పేరిట పట్టా మార్పు జరిగింది. అంజమ్మ భూమిని అదే గ్రామానికి చెందిన చల్లా సుధాకర్‌రెడ్డి ఆక్రమించుకున్నారు. అంతేగాకుండా అంజమ్మతోపాటు ఆమె కొడుకులను బెదిరించిన సుధాకర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకొని ఇతరుల పేరిట పట్టా చేయించారు. అంజమ్మ రెవెన్యూ అధికారులను కలిసి తన వద్ద ఉన్న ఆధారాలు చూపించి భూమికి హక్కుదారురాలైన తనను పట్టాదారు, కాస్తుదారుగా గుర్తించాలని దరఖాస్తుచేసుకొన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంలో అంజమ్మ సంబంధిత రెవెన్యూ అధికారులకు తన భూమికి సంబంధించిన రికార్డులు, సాక్ష్యాధారాలు చూపించారు. ఆ రికార్డులను పరిశీలించిన రెవెన్యూ అధికారులు వివాదాస్పద భూమి అంజమ్మదే అని నిర్ధారించుకొని ఆమెకు 1-బీ జారీ చేశారు. అనంతరం పట్టాదారు పాస్‌పుస్తకం కూడా అందజేశారు. కానీ సర్వే నంబర్ 163/డీ లో ఉన్న 2.20 ఎకరాలు పాస్‌పుస్తకంలో నమోదు చేయలేదు. దీంతో అంజమ్మ వీఆర్వో, తాసిల్దార్, ఆర్డీవోలను కలిసి పాస్‌పుస్తకంలో నమోదుచేయని కోరగా సమాధానం రాలేదు. ఈ విషయమై సమగ్ర విచారణచేసి సర్వే నంబర్ 163/డీ లోని 2.20 ఎకరాల భూమిని తన పట్టాదారు పాస్‌పుస్తకంలో నమోదు చేయాలని బాధితురాలు 'ధర్మగంట' ద్వారా రెవెన్యూ అధికారులను వేడుకొన్నారు.

తాసిల్దార్ నిర్బంధం

- పునరావాస భూమి కోసం మాజీ నక్సలైట్ దంపతుల ఆందోళన
- హక్కున్నది ఒకచోట.. భూమి చూపించింది మరోచోట
- మూడేండ్లుగా తిరుగుతున్న మహబూబాబాద్ జిల్లా జగ్నతండావాసి

బయ్యారం: జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రభుత్వం అందించే పునరావాసంతో హాయిగా జీవించాలనుకున్న మాజీ నక్సలైట్‌కు రెవెన్యూ అధికారుల తప్పిదంతో జీవనోపాధి లేకుండా పోయి గోస పడాల్సిన దుస్థితి నెలకొన్నది. తన భూమి తనకు అప్పగించాలని మూడేండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయిన ఈ మాజీ నక్సలైట్ దంపతులు గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం తాసిల్ కార్యాలయంలో తాసిల్దార్‌ను నిర్బంధించి నిరసన వ్యక్తంచేశారు. బయ్యారం మండలం జగ్నతండాకు చెందిన భూక్య ఖాసీరాం, సుభద్ర దంపతులు 1994 నుంచి 2006 వరకు ప్రజా ప్రతిఘటన మోహన్ దళంలో పనిచేశారు. 2006లో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రభుత్వం 2013లో సర్వే నంబర్ 202లోని 4.20 ఎకరాల భూమిని పునరావాసం కింద వీరికి మంజూరుచేస్తూ హక్కుపత్రాలు అందించింది. ఆ భూమికి హద్దులు చూపించింది. మూడేండ్లపాటు అంతా సజావుగానే సాగింది. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా కొత్త పాస్‌పుస్తకం, రైతుబంధు కూడా ఖాసీరాం, సుభద్ర దంపతులకు అందాయి. అయితే, 2016లో కట్టుగూడెంకు చెందిన కొందరు ఖాసీరాం సాగుచేస్తున్న భూమి సర్వే నంబర్ 204కు చెందినదని, అది తమదేనని ఘర్షణకు దిగడంతో సమస్య మొదలైంది. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చొరువతో భూమిని సర్వే చేయించి, సమస్య పరిష్కారం అయ్యేవరకు వివాదాస్పదభూమిగా పరిగణించి ఎవరూ పనులు నిర్వహించొద్దని ఆదేశాలు జారీచేశారు. అప్పటినుంచి బాధితుడు సమస్యను పరిష్కరించాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. గతేడాది అధికారులు సర్వేచేశారు. సర్వే నంబర్లు 202లో 20 గుంటలు, 204లో 4 ఎకరాలు ఉన్నట్టు తేల్చారు. భూమి కేటాయించే సమయంలో అధికారులు హక్కుపత్రాలను సర్వే నంబర్ 202లో ఉన్న భూమికి ఇచ్చి, మరోచోట హద్దులు చూపించినట్టు తేల్చారు.

గురువారం బయ్యారం తాసిల్దార్‌ను నిర్బంధించి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ నక్సలైట్ దంపతులు

పోలీసులు, అధికారుల హామీతో విరమణ

తనకు ప్రభుత్వం అందించిన భూమి తనకు చెందేలా చూడాలంటూ.. ఖాసీరాం దంపతులు గురువారం తాసిల్దార్ పుల్లారావు గదిలో ఉండగానే తలుపులు వేసి నిర్బంధించి బయట కూర్చుని నిరసన వ్యక్తంచేశారు. భూమి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకొన్న ఎస్సై మురళీధర్ అక్కడికి చేరుకొని బాధితులను తాసిల్దార్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడారు. ఈ నెల 8న పోలీసు, రెవెన్యూ అధికారులు భూమి వద్దకు వెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో దంపతులు ఆందోళన విరమించారు.

త్వరలో పరిష్కరిస్తాం

పునరావాసం కింద ఖాసీరాం దంపతులకు అందించి హద్దులు నిర్ణయించిన భూమి సర్వే నంబర్లు 202, 204లో ఉన్నది. గతంలో అధికారులు సర్వే నంబర్ 202లోనే 4.20 ఎకరాల భూమికి హక్కుపత్రాలు అందించడం వల్ల సమస్య తలెత్తింది. సర్వే నంబర్ 204లోని 344 ఎకరాలకు గతంలో అసైన్డ్ పట్టాలు అందించారు. వాటన్నింటినీ సర్వేచేసి ఖాసీరాంకు పునరావాస భూమిని అందిస్తాం. **- జీ పుల్లారావు, తాసిల్దార్**

మ్యుటేషన్ చేస్తలేరు

జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన బూర్ల మాధవి తమ గ్రామ శివారు సర్వే నంబర్ 29/ఏ లోని 2.17 ఎకరాల భూమిని జూలై 17, 2014లో శవల్ల రాజయ్య అనే వ్యక్తి వద్ద నుంచి (డాక్యుమెంట్ నంబర్: 1495/2014, 1496/2014) కొన్నారు. అనంతరం మ్యుటేషన్ కోసం తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నాటినుంచి నేటి వరకు నిత్యం తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ భూమికి మ్యుటేషన్ చేయకుండా, పాస్‌పుస్తకం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్‌పుస్తకం రాకపోవడం వల్ల తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు ఆర్థిక సాయం పొందలేకపోతున్నానని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తన భూమిని మ్యుటేషన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకం అందజేయాలని వేడుకుంటున్నారు.

పాస్‌బుక్ కోసం తిప్పలు

రాజాపేట: నా పేరు జూకంటి ముత్తిలింగం. మాది యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పారుపల్లి గ్రామం. బూర్గుపల్లి శివారులో సర్వే నంబర్లు 137, 138, 139, 140, 141, 142లలో 12.10 ఎకరాల భూమిని అన్నదమ్ములం ఇద్దరం భాగ పంపిణీ చేసుకున్నాం. నా భాగానికి వచ్చిన ఆరెకరాల భూమిని ఆర్థిక పరిస్థితి బాగలేక పోవడంతో అమ్ముకున్నా. సర్వే నంబర్ 142అలో గల 10 గుంటల భూమికి పాస్‌పుస్తకం ఉన్నది. ఆ భూమికి కొత్త పాస్‌పుస్తకం కోసం భూరికార్డుల ప్రక్షాళనలో సమయంలో దరఖాస్తు చేసుకున్నాను. అప్పటి నుంచి రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకం జారీ చేయకుండా కార్యాలయం చుట్టు తిప్పించుకొని ముప్పుతిప్పలు పెడుతున్నారు. తిరిగి తిరిగి విసిగిపోయి.. జిల్లా కలెక్టర్, ఆర్టీవోను కూడా కలిసి విన్నవించుకున్నాను. పాస్‌పుస్తకం జారీచేయాలని తాసిల్దార్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. తాసిల్దార్‌ను కలువగా కాగితాలు సరిగ్గా లేవని విసిరి పారేశారు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.. ఎవరికి బయపడేదిలేదని అరుస్తూ బయటికి వెళ్లగొట్టారు. నా పేరిట ఉన్న భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని ధర్మగంట ద్వారా రెవెన్యూ ఉన్నతాధికారులను వేడుకొంటున్నాను.

పైసలిస్తేనే పనైతది!

- భూమి రికార్డుల్లో ఎక్కాలంటే చెయ్యి తడుపాల్సిందే
- ఇదీ నిజామాబాద్ జిల్లా పాల్దా గ్రామ వీఆర్వో తీరు
- లంచమివ్వలేక సన్న, చిన్నకారు రైతుల ఇబ్బందులు
- న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించిన బాధితులు

నిజామాబాద్ రూరల్: మోఖాలో భూమి ఎక్కువగా ఉండి రికార్డులో తక్కువ ఉంటే దానిని రికార్డుల్లో ఎక్కించాలంటే వీఆర్వోకు పైసలు ముట్టజెప్పాల్సిందే. లేదంటే నిజామాబాద్ జిల్లా, నిజామాబాద్ మండలంలోని పాల్దా గ్రామంలో పని అయ్యే పరిస్థితి లేదు. ఆర్థిక స్థోమత ఉన్నవారు వీఆర్వోకు అడిగినన్ని పైసలు ముట్టజెప్పి పనిచేయించుకొంటున్నారు. లంచం ఇవ్వలేని స్థితిలో ఉన్న చిన్న, సన్నకారు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరుగాల్సిన పరిస్థితి నెలకొన్నది. మోఖాలో ఉన్నంత భూమి పాత పాస్‌బుక్‌లో ఉన్నప్పటికీ.. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన కొత్త పాస్‌బుక్‌లో మాత్రం తక్కువగా నమోదైంది. ఇలా తక్కువ ఉన్న భూమిని రికార్డులో సరిచేసి ఎక్కించడానికి వీఆర్వోకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో వీఆర్వో అందుబాటులో ఉండడు.. తాసిల్దార్ కార్యాలయానికి వెళ్తే రోజంతా పడిగాపులుగాసినా తమ గోడు ఎవరూ వినిపించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ తరపున మైక్‌లో ప్రకటనచేయగా 50 మంది రైతులు వచ్చి సర్పంచ్ సుప్రియ నవీన్, ఉపసర్పంచ్ శరణ్య జితేందర్ రెడ్డికి తమ భూసమస్యలను వివరించారు. ఇంక చాలామంది రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. 'ధర్మగంట' ద్వారానైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్నామని బాధిత రైతులు పేర్కొన్నారు.

మూడేండ్ల నుంచి తిరుగుతున్నా..

30 ఏండ్ల క్రితం 36 గుంటల పట్టాభూమి కొన్నాను. ఆ భూమిని నా పేరిట మార్చాలని మూడేండ్ల నుంచి వీఆర్వోను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పాత వీఆర్వోకు రూ.15 వేలు ఇచ్చాను. అయినా, ఆ భూమి నా పేరిట చేయలేదు. రెండేండ్ల క్రితం వచ్చిన కొత్త వీఆర్వోను కూడా కలిసి 36 గుంటల భూమి నా పేరిట పట్టా చేయమని ఎన్నోసార్లు బతిమాలాను. రూ.30 వేలు ఇవ్వాలని ఇప్పుడున్న వీఆర్వో డిమాండ్‌చేశారు. అంత డబ్బు నా దగ్గర లేదని తేల్చిచెప్పటంతో అప్పుడు ఇప్పుడంటూ తిప్పుతున్నాడే తప్ప భూమిని నా పేరిట మార్చడం లేదు. జిల్లా అధికారులే నాకు న్యాయంచేయాలి. **- సుంకరి గంగాధర్, రైతు**

తిరుగని రోజు లేదు

ఆరేండ్ల క్రితం 2.05 ఎకరాల పట్టా భూమి కొన్నాను. 2018లో 1.10 ఎకరాల భూమి రికార్డులో ఎక్కించి కొత్త పాస్‌పుస్తకం ఇచ్చారు. ఇంకా సర్వే నంబర్ 695లో ఉన్న 20 గుంటలు, సర్వే నంబర్ 697/ఆలోని 15 గుంటలు.. మొత్తం 35 గుంటల భూమి రికార్డులో ఎక్కించకుండా వీఆర్వో నానా తిప్పలు పెడుతున్నారు. ఏడాది నుంచి ఆయన చుట్టూ తిరుగని రోజు లేదు. అయినా, భూమిని రికార్డులో ఎక్కించడం లేదు. ఉన్నతాధికారులే స్పందించి నాకు న్యాయంచేయాలి. **- ధర్మపురి, రైతు**

వీఆర్వో పట్టించుకుంటలేడు

మా గ్రామ శివారులో గతంలో 1.08 ఎకరాల పట్టా భూమి కొన్నాను. అందులో 31 గుంటల భూమిని మాత్రమే రికార్డులో ఎక్కించి కొత్త పాస్‌పుస్తకం ఇచ్చారు. ఇంకా 17 గుంటల భూమి మోఖా మీద ఉన్నప్పటికీ రికార్డులో మాత్రం ఎక్కించడం లేదు. వీఆర్వోకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. **- కుమ్మరి సాయిలు, రైతు**

రూ.45 వేలు ఇస్తేనే అరెకరం పట్టా అయింది

మా అమ్మానాన్నలు 30 ఏండ్ల కింద గాండ్ల చిన్నుబాయి, గాండ్ల నారాయణల వద్ద ఎకరం పట్టా భూమి కొన్నారు. అందులో అరెకరం మా అమ్మ విజయ పేరిట పట్టా చేయాలని ఇప్పుడున్న వీఆర్వోకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. చివరికి వీఆర్వో రూ.1.50 లక్షలు లంచం డిమాండ్‌చేయగా.. రూ.45 వేలు ఇచ్చిన తర్వాతనే అరెకరం భూమిని రికార్డుల్లోకి ఎక్కించారు. మిగిలిన అరెకరం భూమిని రికార్డులో నమోదు చేయలేదు. మళ్లీ లంచం ఇవ్వటానికి మా దగ్గర లేనందున భూమి రికార్డులో ఎక్కించలేదు. ఈ వీఆర్వో వెళ్లిపోయాక కొత్త వీఆర్వోతో మిగిలిన అరెకరం రికార్డులో నమోదు చేయించుకుందామని ఊరుకున్నాం. **- ప్రదీప్, రైతు**

వృద్ధుడిని అనే కనికరం కూడా లేదు

పాత పాస్‌పుస్తకంలో 35 గుంటల పట్టా భూమి ఉన్నది. ఇందులో నుంచి 29 గుంటల భూమి మాత్రమే కొత్త పాస్‌పుస్తకంలోకి ఎక్కించారు. ఇంకా ఆరు గుంటల భూమిని ఎక్కించ లేదు. మా ఊరు వీఆర్వోను కలిసి ఆరు గుంటల భూమి రికార్డులో ఎక్కించమని ఎన్నిసార్లు అడిగినా వినిపించుకోవడం లేదు. వృద్ధుడిని అయిన నేను నిజామాబాద్ ఆఫీసుకు వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. అయినా, నా భూమిని రికార్డులో నమోదు చేస్తలేరు. పెద్దసార్లే న్యాయంచేయాలి. **- బూరుగు మాణిక్యం, రైతు**

రికార్డులో భూమి ఎక్కించడం లేదు

మా గ్రామ శివారులో సర్వే నంబర్ 542లో నాకు ఉన్న 10 గుంటల భూమిని రికార్డులో ఎక్కించాలని పలుమార్లు వీఆర్వో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ. 10 వేలు ఆరు నెలల క్రితం ఇచ్చాను. అయినా ఇంతవరకు భూమిని రికార్డులో ఎక్కించకుండా ఏవో కుంటిసాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నారు. అధికారులు న్యాయంచేయాలి. **- పెద్దోల్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతు**

మా పోరాటం స్వాతంత్ర్యం కోసం కాదు

మా సంస్కృతి, మతం, భాషలను కాపాడటం అంతకన్నా ముఖ్యం: దలైలామా

న్యూఢిల్లీ: తమ పోరాటం రాజకీయ స్వాతంత్ర్యం కోసం కాదని టిబెటన్ ఆధ్యాత్మిక గురువు దలైలామా పేర్కొన్నారు. టిబెట్ సంస్కృతి, మతం, భాషల ఉనికిని కాపాడటంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. రాజకీయ స్వాతంత్ర్యం అనేది ప్రజల సంతోషం కోసమేనని, కానీ, కేవలం అదొక్కటే సంతోషాన్ని ఇవ్వగలదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రముఖ మ్యాగజైన్ 'ది వీక్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. '70 ఏండ్లుగా రగులుతున్న టిబెట్ సమస్యను తమ విధానాలతో పరిష్కరించలేమనే భావన చైనా నాయకుల్లో క్రమంగా పెరుగుతున్నది. కాబట్టి, వాళ్ళు మరింత వాస్తవిక విధానాన్ని అవలంభించాలి. రాజకీయంగా చైనా టిబెట్‌ను ఆక్రమించినా, ఇప్పటికీ టిబెట్ స్వతంత్ర దేశమే' అని అన్నారు. భారత్‌లోని భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా చైనా, టిబెట్ కలిసిమెలిసి ఉండాలన్నారు.

45 వేల బ్యారళ్ల మద్యం అగ్నికి ఆహుతి

మద్యం తయారీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం.. అమెరికాలో ఘటన

వాషింగ్టన్, జూలై 4: అమెరికా వుడ్‌ఫోడ్ కౌంటీలోని ఓ మద్యం తయారీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించి 45,000 బ్యారెళ్ల మద్యం ధ్వంసమైంది. జిమ్ బీమ్ డిస్టిలరీ గిడ్డంగిపై మంగళవారం అర్ధరాత్రి పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి. ఇవి క్షణాల్లో అంతటా వ్యాపించాయి. అగ్నికీలలు భారీగా ఎగిసిపడ్డాయి. ఈ మంటల వల్ల వెలువడిన వేడితో చుట్టుపక్కల వాళ్లు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళాలు రంగంలోకి దిగి మంటలను అదుపు చేశాయి. అగ్నిమాపక దళాలు ఉపయోగించిన నీళ్లు, కాలిపోగా మిగిలిన మద్యం, బూడిద డిస్టిలరీ పక్కనే ఓ నదిలో కలువడంతో అది కలుషితమైంది.

దేశంలో 16 కోట్లకుపైగా మద్యం ప్రియులు!

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో 16 కోట్లకుపైగా ప్రజలు మద్యాన్ని తాగుతున్నారని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు తెలిపింది. గురువారం బీజేపీ ఎంపీ ఆర్కే సిన్హా అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ధావర్ చంద్ గెహ్లాట్ సమాధానమిస్తూ.. గంజాయికి 3.1 కోట్ల మంది, డ్రగ్స్‌కు 77 లక్షల మంది అలవాటు పడ్డారని చెప్పారు.

త్వరలో హఫీజ్ సయీద్ అరెస్టు

ఉగ్ర సంస్థలకు నిధుల అందజేత కేసులో చర్యలు: పాక్

లాహోర్: ముంబై పేలుళ్ల సూత్రధారి, జమాత్ ఉద్ దావా అధిపతి హఫీజ్ సయీద్‌తో పాటు ఆయన 12 మంది అనుచరులను త్వరలోనే అరెస్టు చేస్తామని పాకిస్థాన్ పోలీసులు గురువారం తెలిపారు. తమ దేశంలోని పంజాబ్ రాష్ట్రంలో ఉగ్రవాద సంస్థలకు నిధులు అందించేందుకు విరాళాలు వసూలు చేస్తున్నారన్న కారణంతో సయీద్‌తో పాటు మరో 12 మంది జేయూడీ నాయకులపై పాక్ కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ బుధవారం 23 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. అనుమానితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పంజాబ్ పోలీస్ ప్రతినిధి నియబ్ హైదర్ నఖ్వీ తెలిపారు. 'లాహోర్‌లోని జౌహర్ పట్టణంలో సయీద్ ఉన్నాడు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అతని నివాసంలో సోదాలు చేసి అరెస్ట్ చేస్తాం' అని అన్నారు. ఈ వారంలోనే అరెస్టయ్యే సూచనలున్నట్టు చెప్పారు. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఆదేశాల మేరకు పాక్ ఈ చర్యలకు దిగింది.

జై జగన్నాథ

పూరీలో వైభవోపేతంగా సాగుతున్న రథయాత్ర దృశ్యం

- ప్రారంభమైన తొమ్మిది రోజుల ఉత్సవాలు
- రథాలపైకి చేరిన మూలవిరాట్టులు
- జగన్నాథ నామస్మరణతో మార్మోగిన పూరీ
- శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని

పూరీ, జూలై 4: పూరీ జగన్నాథుడి రథయాత్ర మొదలైంది. తొమ్మిది రోజులపాటు కన్నుల పండువగా నిర్వహించే ఈ ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తుల శరణుఘోష మధ్య జగన్నాథుడి రథచక్రాలు కదిలాయి. తొలిరోజు స్వామిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమయిన భద్రత ఏర్పాట్లు చేశారు. నెలరోజుల కిందటే ఒడిశాలో ఫొని తుఫాన్ విలయం సృష్టించిన సంగతి తెలిసిందే. తుఫాన్ కారణంగా జనజీవనం అస్తవ్యస్తమై, భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. కానీ జగన్నాథుడి ఉత్సవాలపై ఆ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. లక్షలాది భక్తులు తరలిరావడంతో జగన్నాథుడి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

జగన్నాథ స్మరణ ఘోష

చెరా పహారా అనంతరం ప్రధాన పూజారి ఆదేశాల మేరకు భక్తులు జగన్నాథుడి రథాన్ని లాగడం ప్రారంభించారు. మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో భక్తుల శరణుఘోష మధ్య జగన్నాథుడి రథచక్రాలు కదిలాయి. శ్రీ మందిరం నుంచి మూడు కి.మీ. దూరంలోని గుండీచా ఆలయానికి బయలుదేరాయి. మూడు రథాలు సాయంత్రానికి గుండీచా ఆలయానికి చేరుకున్నాయి. రథయాత్ర ప్రారంభోత్సవంలో ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని ఆ జగన్నాథుడిని కోరుకున్నట్టు సీఎం తెలిపారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, ప్రతాప్ చంద్ర సారంగి తదితరులు కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'రథయాత్ర సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు. జగన్నాథుడి ఆశీర్వాదాలతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలని కోరుకుంటున్నా' అని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. 'రథయాత్ర సందర్భంగా ప్రతి ఒక్కరికీ నా శుభాకాంక్షలు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదించాలని ఆ జగన్నాథుడిని ప్రార్థిస్తున్నాను' అని మోదీ ట్వీట్ చేశారు.

భారీ భద్రత

రథయాత్ర నేపథ్యంలో పూరీలో పటిష్ఠ భద్రత కల్పించారు. 142 ప్లాటూన్ల పోలీస్‌లు, రెండు కంపెనీల ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, మూడు యూనిట్ల ఒడిశా ఆర్మ్‌డ్ ఫోర్స్, ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందం, వెయ్యి మందికిపైగా ఒడిశా పోలీసులతో ఆలయం వద్ద భద్రత కల్పించారు. భారీ సంఖ్యలో సీసీ కెమెరాలు బిగించారు. నాయకులు, అధికారులు, భక్తుల సహకారంతో కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని ఆలయ ముఖ్య అధికారి పీకే మహాపాత్ర తెలిపారు.

ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీ మందిరంలోని జగన్నాథుడితోపాటు ఆయన సోదరి, సోదరులు సుభద్రాదేవి, బలభద్రుడు (బలరాముడు), సుదర్శనుడి మూల విరాట్టులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నలుగురు మూర్తుల విగ్రహాలను వేదమంత్రాలు, మేళతాళాల మధ్య ఆలయం బయటికి తీసుకొచ్చారు. వారికోసం ప్రత్యేకంగా సిద్ధం చేయించిన రథాలపై కొలువుదీర్చారు. ఈ ప్రక్రియను 'పహండి' అని పిలుస్తారు. 45 అడుగుల ఎత్తున్న రథంపై జగన్నాథ స్వామిని కొలువుదీర్చారు. ఈ రథాన్ని 'నందిఘోష' అని పిలుస్తారు. బలభద్రుడిని 44 అడుగుల ఎత్తున్న 'తాళధ్వజం' రథంపై, సుభద్రాదేవి, సుదర్శనుడి విగ్రహాలను 'దర్పదలం' రథంపై కొలువుదీర్చారు. విగ్రహాలకు 'పూరీ శంకరాచార్య స్వామి' నిశ్చలనానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్ర ప్రారంభానికి ముందు పూరీ మహారాజు దివ్యసింఘ దేవ్ అక్కడికి చేరుకొని జగన్నాథుడికి నమస్కరించుకున్నారు. అనంతరం రథం మీదికి ఎక్కి స్వామి ముందు బంగారు చీపురుతో శుభ్రం చేశారు. స్వామిపై గంధం నీళ్లు చిలకరించి రథం దిగారు. ఈ ప్రక్రియను 'చెరా పహారా' అని పిలుస్తుంటారు.

ఇంజినీర్‌పై బురద నీరు చల్లుతున్న ఎమ్మెల్యే నితీశ్ అనుచరులు

ఇంజినీరుపై బురదతో దాడి

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎమ్మెల్యే నితీశ్ రాణే వీరంగం.. అరెస్ట్

ముంబై.: ఇటీవల మధ్యప్రదేశ్‌లో ఓ బీజేపీ ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడిచేసిన ఘటన మరువకముందే మహారాష్ట్రలో అలాంటి సంఘటనే మరొకటి జరిగింది. మాజీ సీఎం నారాయణ్ రాణే కొడుకు, కాంగ్రెస్ ఎమ్మెల్యే నితీశ్ రాణే ఓ ఇంజినీరుపై తన అనుచరులతో బురదనీటిని పోయించాడు. ఈ ఘటన గురువారం కన్కవల్లి ప్రాంతంలో జరిగింది. ఇటీవలి వర్షాలకు ఇక్కడి రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. వీటిని పరిశీలించడానికి ఎమ్మెల్యే నితీశ్ తన అనుచరులతో కలిసి వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న అధికారులు రహదారిని పరిశీలిస్తుండగా.. ఇంజినీరుపై ఎమ్మెల్యే చిందులేశాడు. చేతులతో నెట్టేశాడు. ఇదే సమయంలో అతడి అనుచరులు ఒక బకెట్‌లో బురద నీటిని తీసుకొచ్చి ఇంజినీరుపై గుమ్మరించారు. అనంతరం ఆ ఇంజినీరును వంతెనకు కట్టేసి ఎమ్మెల్యే కూడా బురదను పోశాడు. నోటికొచ్చినట్టు తిట్టాడు. తనను ఏమీ చేయొద్దంటూ ఆ ఇంజినీరు ప్రాధేయపడినా వినిపించుకోకుండా వీరంగం సృష్టించాడు. 'బకెట్‌లో బురద నీళ్లను తెచ్చి ఇంజినీరుపై గుమ్మరించండి' అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని చెప్పడమే తన ఉద్దేశమంటూ మాట మార్చాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఆకాశ్‌విజయకు బీజేపీ నోటీసులు

విధుల్లో ఉన్న మున్సిపల్ అధికారిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసిన మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గీయాకు బీజేపీ అధిష్ఠానం షోకాజ్ నోటీసు జారీ చేసింది.

మజా ఆ రహా హై!

నాపై వస్తున్న విమర్శలను ఆస్వాదిస్తున్నా ■ ఇకపై బీజేపీ మీద పది రెట్లు గట్టిగా పోరాడుతా
నేను చేస్తున్నది సైద్ధాంతిక పోరాటం ■ ముంబై కోర్టు వద్ద రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు

ముంబైలోని కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

ముంబై: గత ఐదేండ్లలో చేసిన పోరాటం కంటే ఇకపై పది రెట్లు గట్టిగా పోరాడుతానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. గురువారం ముంబైలోని ఒక స్థానిక కోర్టు వద్ద మీడియాతో మాట్లాడారు. పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన తర్వాత తనపై దాడి మరింత పెరిగిందన్నారు. అయితే ఆ దాడిని తాను ఆస్వాదిస్తున్నానని చెప్పారు. 'ఆక్రమణ్ హో రహా హా, మజా ఆ రహా హై' అని వ్యాఖ్యానించారు. 'నేను చేస్తున్నది సైద్ధాంతిక పోరాటం. మునుపటికన్నా పదిరెట్లు గట్టిగా పోరాడుతా. నేను పేదలు, రైతుల పక్షాన ఉన్నా. బీజేపీతో ఈ పోరాటం కొనసాగుతుంది' అని రాహుల్ స్పష్టం చేశారు. తన రాజీనామా నిర్ణయంపై మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. ఆరెస్సెస్ కార్యకర్త ఒకరు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో కలిసి ముంబైలోని మజ్గావ్-సేవ్రీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ కేసులో కోర్టు వీరిద్దరికి గత ఫిబ్రవరిలోనే సమన్లు జారీ చేసింది. వారిపై దాఖలైన ఫిర్యాదును కోర్టు వారిద్దరికీ చదివి వినిపించింది. ఫిర్యాదులో తమపై మోపిన అభియోగాలను తాము అంగీకరించడం లేదని రాహుల్, ఏచూరి కోర్టుకు స్పష్టం చేశారు. దీంతో వారిద్దరిపై విచారణ కొనసాగనున్నది. ఇద్దరు నేతలకు బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిచ్చింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 21కి వాయిదా వేసింది. మరోవైపు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టుకు చేరుకొని రాహుల్ తన రాజీనామా నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ దమ్ము అందరికీ ఉండదు: ప్రియాంక

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ రాహుల్ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తున్నానని ఆయన సోదరి ప్రియాంక చెప్పారు. ఇలా పదవులను త్యాగం చేసే దమ్ము కొంత మందికే ఉంటుందని, అందులో రాహుల్ ఒకరని ప్రశంసించారు. రాహుల్ రాజీనామా లేఖను ప్రియాంక గురువారం రీ ట్వీట్ చేశారు. మరోవైపు అసోం కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి హరీశ్‌రావత్ రాజీనామా చేశారు.

ఇకపై 'ఆధార్' స్వచ్ఛందమే!

- ఆధార్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- దుర్వినియోగం చేసే సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు
- తగిన కసరత్తు చేయలేదంటూ బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, జూలై 4: ఆధార్ చట్టంలో సవరణల కోసం ఉద్దేశించిన 'ఆధార్, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2019'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది మార్చిలో ప్రవేశపెట్టిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును రూపొందించారు. దీని ప్రకారం ప్రజలు బ్యాంక్ ఖాతా తెరిచేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్ తీసుకునేందుకు ఆధార్‌ను స్వచ్ఛందంగా వినియోగించే అవకాశం కలుగుతుంది. ఇష్టం ఉంటేనే ఆధార్‌ను గుర్తింపుకార్డుగా సమర్పించవచ్చు. అలాకాకుండా ఏ వ్యక్తి అయినా సంస్థ అయినా ఆధార్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తే కఠిన శిక్ష పడుతుంది. అంతేకాకుండా 18 ఏండ్లు నిండిన వ్యక్తి వ్యక్తులకు నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కూడా ఈ బిల్లు కల్పిస్తుంది. ఈ బిల్లును కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దేశంలో 123 కోట్ల మంది పౌరులకు ఆధార్ కార్డులు ఉన్నాయని, వారి బయోమెట్రిక్, రెటీనా, ఇతర వివరాల గోప్యతను కాపాడేందుకు, మరింత భద్రతను కల్పించేందుకు ఈ బిల్లు సహాయపడుతుందని చెప్పారు. ఆధార్ లేదనే కారణంతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు లేదా సేవలు అందకుండా చేయడాన్ని అడ్డుకుంటుందని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి ఆధార్ డాటాను అక్రమంగా పోగు చేసే వ్యక్తులు, సంస్థల యాజమాన్యాలకు రూ.కోటి జరిమానాతోపాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఆధార్‌తోపాటు పౌరుల ఇతర సమాచారానికి మరింత రక్షణ కల్పించేందుకు త్వరలో 'సమాచార రక్షణ చట్టం'ను లోక్‌సభలో ప్రవేశపెడుతామన్నారు. ఇటీవల ప్యానల్ స్పీకర్‌గా నియమితులైన వైసీపీ ఎంపీ, లోక్‌సభలో వైసీపీ పక్ష నేత మిథున్‌రెడ్డి ఆధార్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా సభకు అధ్యక్షత వహించారు.

లోక్‌సభలో ఆధార్ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్న కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

వ్యతిరేకించిన ప్రతిపక్షం

ఆధార్ (సవరణ) బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. సరైన కసరత్తు లేకుండా బిల్లును రూపొందించారని కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావడానికి ఆర్డినెన్స్‌ను ఓ మార్గంగా వాడుకున్నదని విమర్శించారు. ఈ చట్టం సాయంతో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. చర్చ సందర్భంగా టీడీపీ-వైసీపీ ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఏపీలో 2016లో స్మార్ట్‌పల్స్ పేరుతో నిర్వహించిన సర్వే వివరాలను టీడీపీ లీక్ చేసిందని వైసీపీ ఆరోపించగా.. టీడీపీ ఎంపీలు వ్యతిరేకించారు.

ఎంసీఐ రద్దుకు రాజ్యసభ ఆమోదం

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను రెండేండ్లపాటు రద్దు చేసేందుకు ఉద్దేశించిన ఎంసీఐ (సవరణ)-2019 బిల్లుకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 21న తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లు చట్టంగా మారనున్నది. కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హర్షవర్ధన్ ఈ బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఎంసీఐ తన విధుల నిర్వహణలో విఫలమైందని, అవినీతి స్థావరంగా మారిపోయిందని చెప్పారు. కొందరు ప్రముఖ డాక్టర్లు 'గవర్నర్స్ బాడీ'గా ఏర్పడి ఎంసీఐ విధులను నిర్వహించేందుకు ముందుకొచ్చారని, ఇది 2018 సెప్టెంబర్ 26 నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఈ మేరకు రెండేండ్లపాటు బోర్డును రద్దుచేసేలా ఆర్డినెన్స్ తీసుకొచ్చామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని, మన దేశంలో ప్రతి 1,457 మందికి ఒక డాక్టర్ ఉన్నారన్నారు.

మతం, రాజకీయం వేర్వేరు

- దీదీ ఈద్‌కు వచ్చి మాతో ఆ వేడుకలో పాల్గొంటారు
- నేను ముస్లిం యువతినే
- ఇస్కాన్ వార్షిక రథయాత్రలో టీఎంసీ ఎంపీ నుస్రత్ జహాన్

కోల్‌కతాలో జరిగిన ఇస్కాన్ వార్షిక రథయాత్రలో పూజలు చేస్తున్న నుస్రత్ జహాన్. చిత్రంలో బెంగాల్ సీఎం మమత

కోల్‌కత, జూలై 4: మతాన్ని, రాజకీయాలను వేరువేరుగా చూడాలని, మతపరమైన ఉత్సవాల్లో రాజకీయాలకు తావులేదని.. విశ్వాసం, నమ్మకంపై అవి ఆధారపడుతాయని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ నుస్రత్ జహాన్ అన్నారు. గురువారం కోల్‌కతాలో ఇస్కాన్ సంస్థ నిర్వహించిన వార్షిక రథయాత్ర ఉత్సవానికి సీఎం మమతా బెనర్జీతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా నుస్రత్ మాట్లాడుతూ.. 'మమతా బెనర్జీ ముస్లింల పండుగ (ఈద్)కు వచ్చి మాతో ఆ వేడుకలో పాల్గొంటారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవు. ఇది నమ్మకం, విశ్వాసానికి సంబంధించినది. మతాన్ని రాజకీయంతో పోల్చడం తగదు. అవి రెండూ వేరువేరు' అని అన్నారు. ఇస్లాం మతానికి చెందిన నుస్రత్ నుదుటన బొట్టు, మంగళసూత్రంతో పార్లమెంటులో ఎంపీగా ప్రమాణం చేయడం ఆ మతానికి చెందిన కొందరిలో ఆగ్రహం తెప్పించిన సంగతి తెలిసిందే. అయినా ఆమె వాటిని పట్టించుకోకుండా తాజాగా ఇస్కాన్ కార్యక్రమానికి వెళ్లారు. పసుపు రంగు చీర, ఎరుపు రంగు గాజులు, సింధూరం, మంగళసూత్రం ధరించి భర్త నిఖిల్‌జైన్‌తో కలిసి వేడుకలో పాల్గొన్నారు. 'కులం, మతంతో సంబంధం లేకుండా ఇక్కడ అన్ని వేడుకల్లో పాల్గొంటాం. స్నేహానికి బెంగాల్ చిహ్నం' అని ఆమె అన్నారు. తన మీద ఫత్వా జారీ వార్తలపై స్పందిస్తూ.. 'నిరాధారమైన వార్తలను పట్టించుకోకండి. నా మతం ఏమిటో నాకు తెలుసు. పుట్టుకతో నేను ముస్లింను. ఇప్పటికీ ముస్లిం యువతినే. ఇది విశ్వాసానికి సంబంధించినది. దీన్ని మనసుతో ఆలోచించాలి. మెదడుతో కాదు' అని అన్నారు. వేడుకకు తనను ఆహ్వానించినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. 'నుస్రత్ నవ్య భారతానికి ఓ సూచిక. ఇతర మతాల నమ్మకాల్ని గౌరవిస్తూ.. మతాలకతీతంగా అన్ని పండుగల్లో అందరూ పాల్గొనడం భారత్ గొప్పదనాన్ని ఇనుమడింపజేస్తుంది. నుస్రత్ లాంటి వాళ్ళు దీనికి మార్గనిర్దేశనం చేస్తున్నారు' అని ఇస్కాన్ ప్రతినిధి రాధా రామ్‌దాస్ పేర్కొన్నారు. అందరితో కలిసిమెలిసి సామరస్యంతో ఉండటమే నిజమైన మతం అని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు.

నౌక మునిగి.. 27 మంది మృతి

హోండురస్‌లో దుర్ఘటన



ప్రమాద స్థలంలో సహాయక చర్యలు

హోండురస్: కరేబియన్ సముద్రంలో హోండురస్‌కు చెందిన ఓ మత్స్యకారుల నౌక మునగడంతో 27 మంది మృతి చెందినట్లు ఆ దేశ మిలిటరీ అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 9 మంది గల్లంతుకాగా 55 మందిని రక్షించినట్లు వెల్లడించారు. చేపల వేటకు వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ ఆ నౌక సముద్రంలోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఆ దేశ మిలిటరీ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై సమీపంలోని పెద్ద పడవలను అప్రమత్తం చేయడంతో పలువురిని కాపాడగలిగినట్లు వివరించారు. కాగా మరో నౌక మునిగిన ఘటనలో అందులోని 49 మందిని రక్షించినట్లు వెల్లడించారు.

జపాన్‌లో కుండపోత

టోక్యో: జపాన్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో దక్షిణ జపాన్‌లోని పలు లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తగా, పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు 8 లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించారు.గత వారం అదృశ్యమైన ఓ మహిళ మృతదేహం లభించింది. దీంతో వర్షాల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య రెండుకు చేరింది. పశ్చిమ జపాన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 200 మందికిపైగా చనిపోయారు.

చైనాలో భీకర సుడిగాలి.. ఆరుగురు మృతి

190 మందికిపైగా గాయాలు, దెబ్బతిన్న 3500 ఇండ్లు

బీజింగ్: సుడిగాలికి ఈశాన్య చైనాలో ఆరుగురు మృతి చెందగా 190 మందికిపైగా గాయపడ్డారు. బుధవారం లియావోనింగ్ రాష్ట్రంలోని కైయువాన్ నగరంలో భారీ టొర్నాడో సంభవించింది. సెకనుకు 23 మీటర్ల వేగంతో వీచిన ఆకస్మిక సుడిగాలిని చూసి అక్కడి ప్రజలు భయపడ్డారు. దీని తాకిడికి 3500 ఇండ్లు దెబ్బతిన్నాయి. సుమారు పది వేల మంది దీని ప్రభావానికి గురయ్యారు. చైనా జాతీయ వైద్య సంస్థ అత్యవసర వైద్య బృందాలను రంగంలోకి దించింది. ధ్వంసమైన ఇండ్లలో చిక్కుకున్నవారిని సహాయక బృందాలు వెలికితీశాయి. తీవ్రంగా గాయపడిన 63 మందికి పలు దవాఖానాల్లో చికిత్స అందజేస్తున్నారు. కాగా ఈ ప్రాంతంలో ఎన్నడూ లేనంతగా ఏర్పడిన భీకర టొర్నాడోపై స్థానిక ప్రభుత్వం పరిశోధనకు ఆదేశించినట్లు ఆ రాష్ట్ర అధికార వార్త సంస్థ పేర్కొంది.

వారసులకు పార్టీ బాధ్యతలు

ప్రత్యక్ష రాజకీయాల్లోకి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి
డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా నియామకం
దేవెగౌడ మనుమడు నిఖిల్‌కు జేడీఎస్ యువజన విభాగం బాధ్యతలు

తల్లిదండ్రులతో ఉదయనిధి స్టాలిన్

చెన్నై/బెంగళూరు, జూలై 4: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రెండు రాజకీయ పార్టీల వారసులకు గురువారం కీలక బాధ్యతలు దక్కాయి. తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ తన కొడుకు, నటుడు ఉదయనిధి(42)ని పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా గురువారం నియమించారు. దీంతో ఉదయనిధి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించినట్లయ్యింది. ఈ బాధ్యతలు చేపట్టిన నాలుగో వ్యక్తిగా ఉదయనిధి నిలిచారు. ఆయన రెండేండ్లుగా పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరుపున స్టార్ క్యాంపెయినర్‌గా ఉండి డీఎంకే విజయానికి దోహదపడ్డారు. దీంతో యువజన విభాగం కార్యదర్శి పదవికి ఆయన అర్హుడేనని సీనియర్ నేతలు ప్రశంసించారు. స్టాలిన్ 35 ఏండ్లపాటు డీఎంకే యువజన విభాగం బాధ్యతలు నిర్వహించారు. ఆయన తర్వాత ఈ పదవిని నిర్వహించిన మాజీ మంత్రి వెల్లకోవిల్ సామినాథన్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు.

జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కుమారస్వామి

కర్ణాటకలోని అధికార జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా హెచ్‌కే కుమారస్వామి నియమితులయ్యారు. మాజీ సీఎం ఎస్ బంగారప్ప కుమారుడు మధు బంగారప్పకు వర్కింగ్ ప్రెసిడెంట్, సీఎం హెచ్‌డీ కుమారస్వామి కుమారుడు, నటుడు నిఖిల్ కుమారస్వామికి యువజన విభాగం అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ గుర

పాయింట్ల పట్టిక

స్థానం	జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే.	ర.రే	పా
1. ✔	ఆస్ట్రేలియా	8	7	1	0	+1.00	14
2. ✔	భారత్	8	6	1	1	+0.81	13
3. ✔	ఇంగ్లండ్	9	6	3	0	+1.15	12
4.	న్యూజిలాండ్	9	5	3	1	+0.17	11
5.	పాకిస్థాన్	8	4	3	1	-0.79	9
6.	శ్రీలంక	8	3	3	2	-0.93	8
7.	బంగ్లాదేశ్	8	3	4	1	-0.19	7
8.	దక్షిణాఫ్రికా	8	2	5	1	-0.08	5
9.	వెస్టిండీస్	9	2	6	1	-0.22	5
10.	ఆఫ్ఘనిస్థాన్	9	0	9	0	-1.32	0

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✔ - అర్హత

వరల్డ్‌కప్‌లో నేడు | బంగ్లాదేశ్ X పాకిస్థాన్ - 3 గం. | స్టార్ స్పోర్ట్స్‌లో | అత్యధిక పరుగులు 544 రోహిత్ (ఇండియా) | అత్యధిక వికెట్లు 24 స్టార్క్ (ఆస్ట్రేలియా)

విజయంతో వీడ్కోలు



ఆఫ్ఘన్‌పై విండీస్ గెలుపు.. ఆఖరి ప్రపంచకప్ ఆడిన గేల్

లీడ్స్: విశ్వసమరం తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై నెగ్గిన వెస్టిండీస్ మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఓడి ఆఖరి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై విజయం సాధించింది. నామమాత్రమైన పోరులో గురువారం విండీస్ 23 పరుగుల తేడాతో ఆఫ్ఘన్‌పై నెగ్గి టోర్నీకి వీడ్కోలు పలికింది. విజయానికి దగ్గర దాక వచ్చినా.. సరైన ముగింపు దొరక్క గెలుపు గీత దాట లేక సతమతమవుతున్న ఆఫ్ఘనిస్థాన్ ఈ మ్యాచ్‌లోనూ ఓడి 9 మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా లేకుండానే ఇంటిబాట పట్టింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 311 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హోప్ (77; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), లెవీస్ (58; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), పూరన్ (58; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ సరిగ్గా 50 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. ఇక్రామ్ (86; 8 ఫోర్లు), రహ్మత్ షా (62; 10 ఫోర్లు) ఆకట్టుకున్నారు. విండీస్ బౌలర్లో బ్రాత్‌వైట్‌కు 4, రోచ్‌కు 3 వికెట్లు దక్కాయి. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ తన కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ ఆడాడు.

ఆరంభంలో ఆకట్టుకున్నా..

భారీ లక్ష్య ఛేదనకు బరిలో దిగిన ఆఫ్ఘనిస్థాన్ రెండో ఓవర్‌లోనే కెప్టెన్ గుల్బదీన్ నైబ్ (5) వికెట్ కోల్పోయినా ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. కరీబియన్ల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తూ.. ముందుకు దూసుకెళ్లింది. రహ్మత్ షా, ఇక్రామ్ జోడీ ఎడాపెడా బౌండ్రీలు బాదడంతో లక్ష్యం కరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో ముందు రహ్మత్ షా, ఆ తర్వాత ఇక్రామ్ చెరో 57 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత రహ్మత్ షా ఔటైనా.. నజీబుల్లా (31; 1 ఫోర్, 1 సిక్స్) చక్కటి సహకారం అందించడంతో ఒక దశలో ఆఫ్ఘన్ 189/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనుకుంటున్న దశలో జోరు మీదున్న ఇక్రామ్‌ను గేల్ ఎల్బీగా వెనక్కిపంపాడు. ఆ తర్వాత నజీబ్, నబీ (2), సమీఉల్లా (6) వెంటవెంటనే ఔటయ్యారు. అస్గర్ (32 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) పోరాడిన ఫలితం లేకపోయింది.

సమిష్టిగా రాణించి..

క్రిస్ గేల్ (7) ఆడిన చివరి ప్రపంచకప్ మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. మిగిలిన వాళ్లు తలో చేయి వేయడంతో వెస్టిండీస్ భారీ స్కోరు చేసింది. ఆరో ఓవర్‌లోనే గేల్ ఔటైనా.. మరో ఓపెనర్ లెవీస్‌తో కలిసి హోప్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు సాధికారికంగా ఆడుతూ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. ఆఫ్ఘన్ స్పిన్ త్రయం రషీద్ (1/52), నబీ (1/56), ముజీబ్ (0/52) పరుగులు కట్టడి చేస్తుండటంతో పేసర్లను లక్ష్యంగా చేసుకొని రన్స్ రాబట్టారు. అర్ధశతకం అనంతరం లెవీస్ ఔటైనా.. హెట్‌మైర్ (39; 3 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి హోప్ మూడో వికెట్‌కు 65 పరుగులు జోడించాడు. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ వెనుదిరిగినా.. యువ ఆటగాడు నికోలస్ పూరన్ ఫామ్ కొనసాగించాడు. అతడికి కెప్టెన్ హోల్డర్ (34 బంతుల్లో 45; 1 ఫోర్, 4 సిక్సర్లు) జతవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 71 బంతుల్లోనే 105 పరుగులు జోడించడంతో విండీస్ స్కోరు 300 దాటింది. విండీస్ చివరి 10 ఓవర్లలో 111 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ బౌలర్లలో దౌలత్ జద్రాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

సంక్షిప్తస్కోర్లు: వెస్టిండీస్: 50 ఓవర్లలో 311/6 (హోప్ 77, పూరన్ 58, లెవీస్ 58; దౌలత్ 2/73), **ఆఫ్ఘనిస్థాన్:** 50 ఓవర్లలో 288 ఆలౌట్(ఇక్రామ్ 86, రహ్మత్ షా 62; రోచ్ 3/37, బ్రాత్‌వైట్ 4/63).

క్రిస్‌గేల్ (7, 1/28)

> ఐదు ప్రపంచకప్‌లలో వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నా. కానీ జట్టు సెమీస్‌కు చేరకపోవడం బాధ కలిగించింది. యువ ఆటగాళ్లకు తోడుగా మరికొన్ని మ్యాచ్‌లు ఆడుతా. నా శరీరాన్ని మరింత కష్టపెట్టదల్చుకోవడం లేదు. అందుకే ఇదే నా చివరి ప్రపంచకప్. హెట్‌మైర్, హోప్, పూరన్, హోల్డర్ రూపంలో విండీస్ భవిష్యత్తులో సరైన దిశలో నడుస్తుందని ఆశిస్తున్నా.
>
> -క్రిస్ గేల్, వెస్టిండీస్

ఎవరితో ఎవరు?

అంచనాలు తప్పలేదు. సంచలనాలు నమోదు కాలేదు. అనుకున్నదే నిజమైంది. దాదాపు నెల రోజుల ముందు అభిమానులంతా ఏ జట్టైతే సెమీఫైనల్ చేరుతాయని భావించారో ఆ నాలుగే నాకౌట్‌లో అడుగుపెట్టాయి. దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌పై ఏ మూలో ఆశలు పెట్టుకున్నా.. ఆ రెండు జట్లు మేమింతే.. మా ప్రస్థానం ఇక్కడి వరకే అని డిసైడ్ అయిపోయాయి. లీగ్ దశలో మరో మూడు మ్యాచ్‌లు మిగిలున్నా ఇప్పటికే దాదాపుగా టాప్-4 జట్లు ఖరారై పోయాయి. ఇక తేలాల్సిందల్లా స్థానాలే. ఎవరితో.. ఎవరు ఢీకొంటారనేదే.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ప్రతిష్ఠాత్మక పన్నెండో ప్రపంచకప్ నాకౌట్ బెర్త్‌లు దాదాపు ఖరారైపోయాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియా (14 పాయింట్లు), భారత్ (13 పాయింట్లు), ఇంగ్లండ్ (12 పాయింట్లు), న్యూజిలాండ్ (11 పాయింట్లు) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వీటిలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్‌లు ముగియగా.. దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా, శ్రీలంకతో భారత్ తలపడాల్సి ఉంది. వరుస విజయాలతో జోరుమీదున్న ఆస్ట్రేలియా.. సమస్యలతో సతమతమవుతున్న దక్షిణాఫ్రికాపై విజయం సాధిస్తే.. 16 పాయింట్లతో అగ్రస్థానంలోనే ఉంటుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా.. లంకను ఓడిస్తే 15 పాయింట్లతో రెండో స్థానంలోనే కొనసాగుతుంది. అప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఆసీస్.. నాలుగో ప్లేస్‌లోని న్యూజిలాండ్‌తో, రెండో స్థానంలో ఉన్న భారత్.. మూడో ప్లేస్‌లో నిలిచిన ఇంగ్లండ్‌తో ఢీకొనాల్సి ఉంటుంది. అలాకాక ఆస్ట్రేలియా చివరి మ్యాచ్‌లో ఓడి, భారత్ గెలిస్తే.. 15 పాయింట్లతో టాప్‌కు వెళ్తుంది. అప్పుడు సెమీఫైనల్లో న్యూజిలాండ్‌ను ఢీకొంటుంది. ప్రస్తుతానికి సెమీస్ బెర్త్‌లు పూర్తిగా ఖరారు కాకపోయినా.. ప్రత్యర్థులు ఎవరో తేలాలంటే శనివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్ వరకు ఆగాల్సిందే. ఏది ఏమైనా సెమీస్‌లో ఆస్ట్రేలియా మాత్రం భారత్ ప్రత్యర్థి అయ్యే అవకాశాలు లేవు.

పడిలేచిన కెరటం..

ఫించ్

ఆఫ్ఘనిస్థాన్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో నెగ్గిన ఆసీస్.. విండీస్‌పై 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడినా.. ఆ తర్వాత పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లను చిత్తు చేసింది. హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్‌పై 64 పరుగులతో నెగ్గిన కంగారూలు.. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 86 పరుగులతో మట్టికరిపించి అగ్రస్థానంలోనిలిచారు. టోర్నీ ఆరంభంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా.. టీమ్‌ఇండియా చేతిలో ఓటమి అనంతరం ఉత్తుంగ తరంగంలా ఎగిసిపడింది. ఓపెనర్లు వార్నర్, ఫించ్ పరుగుల వరద పారిస్తు మంచి ఆరంభాలు అందిస్తుంటే.. ఖవాజా, స్మిత్ వాటిని భారీ స్కోర్లుగా మలుస్తున్నారు. మ్యాక్స్‌వెల్ స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయినా.. కష్టకాలంలో బాధ్యతలు మోయడానికి లోయర్‌ఆర్డర్ కూడా సిద్ధంగా ఉంది. బౌలింగ్ విభాగంలో స్టార్క్ ఇప్పటికే వికెట్ల జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. కమ్మిన్స్, కౌల్టర్‌నైల్, స్టాయినిస్, బెరెన్‌డార్ఫ్, జంపా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు.

ఆస్ట్రేలియా	
ఆడినవి	: 8
గెలిచినవి	: 7
ఓడినవి	: 1
మిగిలినవి	: 1

అత్యధిక పరుగులు: వార్నర్(516)
అత్యధిక వికెట్లు: స్టార్క్(24)

అజేయంగా వచ్చి.. ఆఖర్లో తడబడి

మొదటి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6 వికెట్లతో గెలిచిన భారత్.. రెండో మ్యాచ్‌లో ఆసీస్‌ను 36 పరుగులతో చిత్తు చేసింది. న్యూజిలాండ్‌తో జరగాల్సిన మూడో మ్యాచ్ వర్షం కారణంగా రద్దుకాగా.. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 89 పరుగుల తేడాతో చెడుగుడాడుకుంది. ఆఫ్ఘన్‌పై 11 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గినా.. విండీస్‌పై 125 పరుగులతో పవర్ చూపెట్టింది. అజేయంగా సెమీస్ చేరేలా కనిపించిన టీమ్‌ఇండియా.. ఇంగ్లండ్ చేతిలో ఓడినా.. వెంటనే తేరుకొని బంగ్లాపై 28 రన్స్ తేడాతో నెగ్గి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఆతిథ్య జట్టు చేతిలో ఓడేంతవరకు అప్రతిహత విజయాలతో దూసుకెళ్లిన టీమ్ ఇండియా గత మ్యాచ్‌లో బంగ్లాను చిత్తుచేసి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. ఓవైపు గాయాల బెడద వెంటాడుతున్నా.. ప్రత్యామ్నాయ ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో అదేమంత ఇబ్బందిగా కనిపించడం లేదు. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ప్రపంచకప్‌లో నాలుగు సెంచరీలతో చక్కటి ఫామ్‌లో ఉంటే రాహుల్ ఫర్వాలేదనిపిస్తున్నాడు. కోహ్లీ జోరుమీదుండగా.. పంత్, పాండ్యా ఆకట్టుకుంటున్నారు. భారీ షాట్లతో అభిమానులను అలరించే మహేంద్రసింగ్ ధోనీ.. నెమ్మదైన బ్యాటింగ్‌తో విసిగిస్తున్నాడు. బౌలింగ్‌లో బుమ్రా, షమీ అద్భుత ప్రదర్శన చేస్తుండగా.. స్పిన్నర్లూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

భారత్	
ఆడినవి	: 8
గెలిచినవి	: 6
ఓడినవి	: 1
రద్దు	: 1
మిగిలినవి	: 1

అత్యధిక పరుగులు: రోహిత్(544)
వికెట్లు: బుమ్రా, షమీ(14)

ఆపసోపాలు పడ్డ ఆతిథ్య జట్టు



మోర్గాన్

టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 104 పరుగుల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్‌ను రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఖంగుతినిపించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్‌పై గెలిచినా.. లంక చేతిలో అనూహ్యంగా ఓడి సందేహాలు రేకెత్తించింది. ఆ తర్వాత ఆసీస్‌తో మ్యాచ్‌లోనూ ఓటమే వెక్కిరించడంతో అసలు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చివరి రెండు మ్యాచ్‌ల్లో భారత్, న్యూజిలాండ్‌ను ఓడించి 27 ఏండ్ల అనంతరం సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఆతిథ్య హోదాలో ఫ్లాట్ పిచ్‌లపై భారీ స్కోర్లు బాదేసి తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడాలనుకున్న ఇంగ్లండ్.. స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదనే చెప్పాలి. ఓపెనర్లు రాయ్, బెయిర్‌స్టో జోరు మీదుంటే.. రూట్, మోర్గాన్, బట్లర్, స్టోక్స్, చక్కగా రాణిస్తున్నారు. బ్యాటింగ్‌కు తగ్గ బౌలింగ్ లేకపోవడం ఇంగ్లిష్ జట్టును వేధిస్తుంటే.. బార్బడోస్ పేసర్ ఆర్చర్ కాస్తలో కాస్త ఆ బెంగ తీరుస్తున్నాడు.

ఇంగ్లండ్	
ఆడినవి	: 9
గెలిచినవి	: 6
ఓడినవి	: 3

అత్యధిక పరుగులు: జో రూట్(500)
అత్యధిక వికెట్లు: ఆర్చర్(17)

పాపం పాకిస్థాన్..

టోర్నీ ఆరంభంలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లోనే నెగ్గిన పాకిస్థాన్.. టీమ్‌ఇండియా చేతిలో ఓటమి అనంతరం హ్యాట్రిక్ విజయాలతో చెలరేగినా.. ఆ జట్టును దురదృష్టం వెక్కిరించింది. భారత్, న్యూజిలాండ్‌తో ఆడిన మ్యాచ్‌ల్లో ఆతిథ్య ఇంగ్లండ్ ఓడితే.. పాకిస్థాన్ ముందుకెళ్లే అవకాశాలుండేవి. అందుకే ఇంగ్లండ్ పరాజయం పాలవ్వాలని పాక్ అభిమానులు కోరుకున్నా అది జరుగలేదు. ప్రస్తుతం 9 పాయింట్లు ఖాతాలో ఉన్న పాకిస్థాన్ చివరి మ్యాచ్‌లో నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే.. న్యూజిలాండ్‌తో సమానంగా 11 పాయింట్లతో నిలుస్తుంది కానీ.. మెరుగైన రన్‌రేట్ కారణంగా కివీస్ ముందడుగు వేస్తుంది. అలా కాకుండా పాక్ నాకౌట్ చేరాలంటే మహాద్భుతమే జరగాలి. బంగ్లాతో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసి 350పై చిలుకు స్కోరు చేయడంతో పాటు ప్రత్యర్థిని 39 పరుగులకే ఆలౌట్ చేయాలి. అంటే 311 పరుగుల తేడాతో నెగ్గాలన్నమాట. ప్రపంచకప్‌లోనే కాదు వన్డే క్రికెట్ చరిత్రలోనే ఇంత వరకు ఇలా జరుగలేదు కాబట్టి ఇది అసాధ్యమనే చెప్పొచ్చు. ఇక పోరపాటున బంగ్లా మొదట బ్యాటింగ్ చేస్తే.. మ్యాచ్ మొదలవకముందే పాక్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది.

సెమీస్‌స్టార్ ఏడోసారి

కేన్ విలియమ్సన్

తొలి మ్యాచ్‌లో లంకపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన న్యూజిలాండ్.. తర్వాత బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లను మట్టికరిపించింది. భారత్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దుకాగా.. అనంతరం దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌పై విజయాలు సాధించి 11 పాయింట్లతో సెమీస్ బెర్త్‌కు అడుగు దూరంలోనిలిచింది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ చేతిలో ఓడినా.. ఇత ర జట్ల జయాపజయాలు అనుకూలించడంతో టాప్-4 లో చేరింది. కెప్టెన్ విలియమ్సన్ నిలకడకు ఆల్‌రౌండర్ల అండదండలు తోడవడంతో కివీస్ ఇక్కడి వరకు చేరింది. అయితే తొలి ఆరు మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగని బ్లాక్ క్యాప్స్ లీగ్ దశలో ఆడిన చివరి మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలవడం కలవరపెడుతున్నది.

న్యూజిలాండ్	
ఆడినవి	: 9
గెలిచినవి	: 5
ఓడినవి	: 3
రద్దు	: 1

అత్యధిక పరుగులు: కేన్(481)
వికెట్లు: ఫెర్గూసన్ (17)

హిమా దాస్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ : పోలండ్‌లో జరుగుతున్న పోజ్నన్ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో భారత ప్లేయర్లు సత్తా చాటారు. మహిళల 200 మీటర్ల రేసులో హిమా దాస్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే పురుషుల షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ కాంస్యాన్ని దక్కించుకున్నాడు. ఇటీవలే కోలుకున్న హిమా దాస్ గురువారం జరిగిన పోటీలో అద్భుత ప్రదర్శన చేసి 200మీటర్ల లక్ష్యాన్ని 23.65 సెకన్లలో ఛేదించి జయకేతనం ఎగురవేసింది. ఆమె ఈ ఏడాది పాల్గొన్న 200 మీటర్ల తొలి పందెం ఇదే కావడం విశేషం. కేఎస్ జీవన్ 400మీటర్ల పరుగును 47.25 సెకన్లలో ఛేదించి కాంస్యాన్ని కైవసం చేసుకున్నాడు.

రానున్న టోర్నీల్లో సత్తాచాటుతా

జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో సింధు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: రానున్న టోర్నీల్లో సత్తాచాటుతానని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు పేర్కొంది. ఈనెల 16న మొదలయ్యే ఇండోనేషియా ఓపెన్‌లో ఆడబోతున్న సింధు తిరిగి పుంజుకుంటానని ప్రకటించింది. గురువారం పీఎన్‌బీ మెట్‌లైఫ్ కంపెనీ ఆధ్వర్యంలో జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్(జేబీసీ)ప్రారంభోత్సవంలో సింధు పాల్గొంది. జేబీసీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న సింధు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడింది. 'వచ్చే మూడు టోర్నీలు ఆడేందుకు సరిపోయే సమయం దొరికింది. మానసిక సన్నద్ధతతో పాటు శారీరక ధారుడ్యంపై ప్రధానంగా దృష్టి సారించాను. చాలా మంది షట్లర్లు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవడంతో పాటు ప్రత్యర్థుల బలహీనతలపై దృష్టి పెడుతున్నారు' అని సింధు అంది. ఈ ఏడాది జేబీసీని దేశవ్యాప్తంగా పది నగరాల్లో నిర్వహించబోతున్నారు. ప్రతిభ కల్గిన షట్లర్లకు చేయూతనందిస్తూ అత్యుత్తమ శిక్షణనిచ్చేందుకు పీఎన్‌బీ మెట్‌లైఫ్ పూనుకుంది. ఈనెల 9న చండీగఢ్‌లో జేబీసీకి తెరలేవనుంది. ఈ టోర్నీలో ఆడాలనుకునే వారు +91 91725 30523(టోల్ ఫ్రీ నంబర్) కాల్ చేయడంతో పాటు http://www.pnbmetlifejbc. com/ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో భారత మాజీ షట్లర్ విమల్ కుమార్, సింధు తండ్రి రమణ, పీఎన్‌బీ ఎండీ అండ్ సీఈవో అశీష్ కుమార్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సన్నాహాల్లో ధోనీ!

లీడ్స్: ధోనీ రిటైర్మెంట్ ఊహాగానాలు అంతకంతకు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచకప్ తర్వాత ధోనీ క్రికెట్‌కు వీడ్కోలు పలుకబోతున్నట్లు పలు వార్త సంస్థలు కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. మెగాటోర్నీలో భారత్ ఆడే చివరి మ్యాచ్ ధోనీకి ఆఖరిదంటూ వచ్చిన వార్తలు నిజమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రిటైర్మెంట్‌కు సంబంధించి టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేకున్నా..ధోనీ తీరును బట్టి చూస్తే వీడ్కోలు సన్నాహాల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. కెరీర్ ఆసాంతం అండగా నిలిచిన వాళ్లకు సరైన రీతిలో కృతజ్ఞతలు తెలిపేందుకు ధోనీ వాడుతున్న బ్యాట్లు ఒక ఉదాహరణ అని చెప్పొచ్చు. తొలి నాళ్లలో మద్దతిచ్చిన ఎస్‌జీతో మొదలుపెడితే..ఆ తర్వాత వాంపైర్(బాస్) బ్రాండ్లతో ఉన్న బ్యాట్లను మార్చి మార్చి వాడుతున్నాడు. కెరీర్ తోడ్పాటుకు సహకరించిన కంపెనీలకు ధోనీ ఈ రకంగా కృతజ్ఞత భావం కనబరుస్తున్నాడని అతని సన్నిహిత మిత్రుడు అరుణ్ పాండే అనడం వీడ్కోలు వార్తలకు బలం చేకూరుస్తున్నాయి.

కెర్బర్ నిష్క్రమణ

రెండో రౌండ్‌లోనే డిఫెండింగ్ చాంపియన్‌కు షాక్.. గాఫ్, బార్టీ జోరు..

లండన్ : వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో గురువారం మరో సంచనలం నమోదైంది. డిఫెండింగ్ చాంపియన్ అంజెలిక్ కెర్బర్(జర్మనీ) రెండో రౌండ్‌లోనే లారెన్ డేవిస్(95వ ర్యాంకు) చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు వీనస్ విలియమమ్స్‌ను తొలి రౌండ్‌లోనే ఓడించిన 15 ఏండ్ల కోరీ గాఫ్(అమెరికా) రెండో రౌండ్‌లోనూ అదే జోరు కొనసాగించగా, టాప్ సీడ్ ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా) మూడో రౌండ్‌లో అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఫెదరర్(స్విట్జర్లాండ్) విజయం సాధించి మూడో రౌండ్‌కు అర్హత సాధించగా, తొమ్మిదో సీడ్ ఇస్నర్‌కు షాక్ తగిలింది.

ఖంగు తిన్న కెర్బర్

డిఫెండింగ్ చాంపియన్ కెర్బర్... రెండో రౌండ్‌లోనే లారెన్ డేవిస్(అమెరికా) చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. 6-2, 2-6, 1-6తో పేలవ ప్రదర్శన చేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఒక్క ఏస్ కూడా సాధించలేక పోయిన కెర్బర్.. కేవలం 13 విన్నర్లు సాధించగా.. ప్రత్యర్థి డేవిస్ 45విన్నర్లతో సత్తా చాటింది. టాప్ సీడ్ ఆష్లే బార్టీ 6-1, 6-3 తేడాతో వాన్ యుత్వాంక్(బెల్జియం)పై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో యువ సంచనలం కోరీ గాఫ్(313) 6-3, 6-3తేడాతో రైబోరికోవా(స్లోవేకియా,139)పై విజయం సాధించి మరోసారి ఔరా అనిపించింది. 1991 తర్వాత వింబుల్డన్ మూడో రౌండ్‌కు అర్హత సాధించిన తొలి 15ఏండ్ల అమ్మాయిగా చరిత్ర సృష్టించింది.

పురుషుల సింగిల్స్‌లో..

బ్రిటన్‌కు చెందిన జే క్లార్క్(169)పై రెండో సీడ్ రోజర్ ఫెదరర్ 6-1, 7-6(7/3), 6-2 తేడాతో రెండో రౌండ్‌లో గెలుపొందాడు. మొత్తం 10ఏస్‌లు బాదిన స్విస్ దిగ్గజం ఏకంగా 46 విన్నర్లను సాధించాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో మూడో రౌండ్‌కు అర్హత సాధించడం ఫెదరర్‌కు ఇది 70సారి కావడం విశేషం. మరో మ్యాచ్‌లో 8వ సీడ్ నిషికోరీ(జపాన్) 6-4, 6-4, 6-0తో సి.నోరీ(55వ ర్యాంకు)పై గెలుపొందాడు. కజకిస్థాన్‌కు చెందిన కుకుష్కిర్(58) 6-4, 6-7(3/7), 4-6, 6-1, 6-4 తేడాతో అమెరికా ఆటగాడు, 9వ సీడ్ జాన్ ఇస్నర్‌కు షాకిచ్చాడు. పురుషుల డబుల్స్‌లో క్యువాస్(ఉరుగ్వే)తో కలిసి బరిలోకి దిగిన భారత స్టార్ బోపన్న తొలి రౌండ్‌లోనే ఓటమి పాలై, టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

కోరీ గాఫ్

సెన్సెక్స్	నిఫ్టీ
39,908	11,947
↗69	↗30

ముడి చమురు (బ్రెంట్) ↘ 63.18 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	34,210
22 క్యారెట్లు	34,020
వెండి (కిలో)	38,580

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.00	71.50
యూరో	74.00	80.00
బహ్రెయిన్ దినార్	172.50	186.50
కువైట్ దినార్	215.00	229.00
సౌదీ రియాల్	16.80	18.60
యూఏఈ దిర్హామ్	17.70	19.40

చికెన్ ధరలు

(రూ.లలో)

ఫారం ధర	93.00
రిటైల్ లైవ్	115.00
డ్రెస్డ్	167.00
స్కిన్‌లెస్	190.00

నెక్ (వంద గుడ్లకు)

(రూ.లలో)

హైదరాబాద్	427-00
రంగారెడ్డి	427-00
మెదక్	427-00
కరీంనగర్	430-00
వరంగల్	430-00
రిటైల్ ప్రైస్	4-85

ఆర్థిక సర్వేలో 'సమగ్ర కుటుంబ సర్వే'

ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుపై ప్రశంసలు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'సమగ్ర కుటుంబ సర్వే'ను.. తాజా ఆర్థిక సర్వే ప్రత్యేకంగా ప్రస్తావించింది. బ్రిటన్, అమెరికాల్లో పౌరుల సమగ్ర వివరాల సేకరణకు వినియోగిస్తున్న అత్యుత్తమ విధానాలను.. తెలంగాణ ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూరదృష్టితో చేపట్టిన ఈ సర్వే వల్ల బహుళ ప్రయోజనాలున్నాయంటూ ప్రశంసించిన ఆర్థిక సర్వే.. ఇది ఓ 'సమగ్ర వేదిక' అని, పౌరుల జీవన ప్రమాణాలను మెరుగు పరుచడానికి, వారికి పాలనాపరమైన ప్రయోజనాలను అందించడానికి, సంక్షేమ ఫలాలను వేగంగా చేర్చడానికి ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వం సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు దాదాపు 25 ప్రభుత్వ డేటాబేస్‌లకు అనుసంధానమై ఉన్నది. దీంతో నాటి సర్వేలో పాల్గొన్నవారి వివరాలన్నీ కూడా పేరు, చిరునామాలతోసహా అన్నింటా నిక్షిప్తమై ఉన్నాయి. నేరాలు, ఆస్తులు, రాయితీలు, విద్య, పన్నులు, గుర్తింపు, పనులు ప్రధానంగా ఈ సర్వే జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో జరిపిన ఈ సర్వేలో కుటుంబ సభ్యులందరి వివరాలనూ ప్రభుత్వం సేకరించింది. ఈ వివరాలు దుర్వినియోగం కాకుండా, చౌర్యానికి వీల్లేకుండా తగిన జాగ్రత్తలనూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్నది. ఇక ఆర్థిక సర్వే చాప్టర్ 4లో డేటా గొప్పదనాన్ని వివరించిన సర్వే రూపకర్త కృష్ణమూర్తి సుబ్రమణ్యన్.. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం నేర్చుకోవాల్సిందే చాలానే ఉందని సమగ్ర కుటుంబ సర్వేను ఊటంకించడం గమనార్హం. అలాగే చాప్టర్ 9లో తెలంగాణ సర్కారు.. పర్యావరణ హిత, విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని ఏవిధంగా ప్రోత్సహిస్తున్నదో కూడా వివరించారు. రాష్ట్ర ప్రజా రవాణా వ్యవస్థలో వాటి వాడుకను చాటి చెప్పారు. పొరుగు రాష్ట్రాలన్నీ పరిమితస్థాయి లక్ష్యాలను నిర్దేశించుకుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం 100 శాతం విద్యుత్ ఆధారిత బస్సుల వినియోగాన్ని లక్ష్యంగా పెట్టుకుందని కొనియాడారు. అలాగే కనీస వేతనాల విషయంలోనూ తెలంగాణ ముందున్నదని జాతీయ సగటు రూ.176గా ఉంటే, తెలంగాణలో రూ.327గా ఉందని ఆర్థిక సర్వే ఈ సందర్భంగా స్పష్టం చేసింది. రాష్ట్ర నికర దేశీయోత్పత్తి (ఎన్ఎస్‌డీపీ) కూడా చాలా పెరిగిందని, 2011-12లో రూ.3,25,139 కోట్లుగా ఉంటే, 2018-19లో రూ.7,88,566 కోట్లుగా ఉందన్నది. తలసరి ఎన్ఎస్‌డీపీ రూ.91,121 నుంచి రూ.2,06,107 కోట్లకు ఎగిసింది.

మళ్లీ పట్టాలపైకి జీడీపీ

ఈసారి దేశ వృద్ధిరేటు 7 శాతం.. ఆర్థిక సర్వే అంచనా

న్యూఢిల్లీ, జూలై 4: గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి కుదురుకోనుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పార్లమెంట్‌లో 2018-19 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2024-25కల్లా భారతీయ ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఇప్పటితో పోల్చితే రెట్టింపై 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవాలంటే 8 శాతం వృద్ధిరేటు అవసరమని సర్వే అభిప్రాయపడింది.

శుక్రవారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను లోక్‌సభలో సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న క్రమంలో దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని ప్రతిబింబిస్తూ ఆర్థిక సర్వే విడుదలైంది. ఐదేండ్ల కనిష్ఠానికి పడిపోయిన జీడీపీ.. మళ్లీ పట్టాలెక్కుతుందన్న విశ్వాసాన్ని ఆర్థిక సర్వే రూపకర్త, ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగ పెట్టుబడులు, ఎగుమతులు, ఉపాధి కల్పన.. మోదీ సర్కారు ముందున్న ప్రధాన లక్ష్యాలుగా అభివర్ణించింది. కాగా, ఈ జనవరి-మార్చిలో 5.8 శాతంగా ఉన్న దేశ జీడీపీ ఈ ఆర్థిక సంవత్సరం మొత్తంగా 7 శాతానికి పెరుగవచ్చని అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం 6.8 శాతంగా ఉన్న వృద్ధి రేటు.. అంతకుముందు ఆర్థిక సంవత్సరం 7.2 శాతంగా ఉన్న విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం 2.7 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. వచ్చే ఏడాది బ్రిటన్‌ను వెనకకు నెట్టి ఐదో స్థానంలోకి రావచ్చన్నది. డిమాండ్, వినియోగ సామర్థ్యం పెంపు, కార్మిక శక్తి మెరుగు, కొత్త టెక్నాలజీ రాక వంటి వాటిలో పెట్టుబడులదే ప్రధానమని, అవి పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. అప్పుడే ఉద్యోగాలు పెరుగుతాయన్నది. కార్మిక రంగంలో సంస్కరణలు అవసరమని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లపైనా దృష్టి పెట్టాలని, దీనివల్ల ఉపాధి కల్పన పుంజుకోగలదన్నది.

వ్యవ'సాయం' చేయాలి

దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతుల ఆదాయ వృద్ధికి చర్యలు చేపట్టాలని, గ్రామీణ వినియోగ సామర్థ్యం బలపడితే.. అన్ని రంగాల్లో కొనుగోళ్లు ఊపందుకుంటాయని సర్వే ఈ సందర్భంగా అభిప్రాయపడింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గితే కూడా దేశీయ వినిమయ సామర్థ్యం పెరుగుతుందని చెప్పింది.



ఏ మతమూ పన్నులు ఎగ్గొట్టమనదు..

పడిపోతున్న పన్ను వసూళ్లు, ప్రభుత్వ ఆదాయం తిరిగి పుంజుకోవాలంటే కొన్ని నిర్మాణాత్మకమైన మార్పులు అవసరమని ఆర్థిక సర్వే ఈ సందర్భంగా అభిప్రాయపడింది. నిజాయితీగా పన్నులు చెల్లించేవారికి ప్రోత్సాహకాలను అందించాలని, పన్ను చెల్లింపుల్లో ముందు వరుసలో ఉన్నవారి పేర్లను రహదారులు, వీధులు, భవనాలు, రైళ్లకు పెట్టాలని సూచించింది. ఇదే క్రమంలో హిందూ, ముస్లీం, క్రిస్టియన్ మతాలు పన్ను ఎగవేతలకు వ్యతిరేకమని గుర్తుచేసింది. నిజాయితీగా వ్యవహరించకపోతే నరకం తప్పదని, అల్లా క్షమించడని, యేసు కాపాడడని పేర్కొన్నది. ఇందుకు సంబంధించి ఆయా మత గ్రంథాల్లో ఉన్న వాఖ్యాలను సర్వేలో కృష్ణమూర్తి ప్రస్తావించడం గమనార్హం.

2018-19 ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు

- 2019-20లో 7 శాతంగా జీడీపీ
- పెట్టుబడులు, వినియోగమే కీలకం
- 2024-25కల్లా 5 లక్షల కోట్ల డాలర్లకు దేశ ఆర్థిక వ్యవస్థ చేరాలంటే 8 శాతం వృద్ధిరేటు అవసరం
- డిమాండ్, ఉద్యోగాలు, ఎగుమతులు, ఉత్పాదకత పెరుగుదలకు పెట్టుబడులే ప్రధానం
- ముడి చమురు ధరలు తగ్గితే పెట్టుబడులు, రుణ వృద్ధికి ఊతం
- 2018-19లో ద్రవ్యలోటు 5.8 శాతం
- జూన్ నాటికి 422.2 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలు
- ఎంఎస్ఎంఈల బలోపేతంతో ఉపాధి కల్పన, ఉత్పత్తి మెరుగు
- కొత్త సంస్థలను ప్రోత్సహిస్తే.. వ్యాపార, పరిశ్రమల రంగానికి వృద్ధి
- దశలవారీగా పదవీ విరమణ వయసు పెంచాలి
- న్యాయపరమైన చిక్కులతో వ్యాపార నిర్వహణకు దెబ్బ
- తక్కువ వేతనాలతో వృద్ధిరేటుకు విఘాతం
- విద్యుత్ ఆధారిత వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలి
- సహజ వనరుల వినియోగాన్ని పెంచుకోవాలి

రిటైర్మెంట్ వయసును పెంచాలి

పదవీ విరమణ వయసును పెంచాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. జనాభాపరంగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్‌లో మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) చాలావరకు తగ్గిందని తాజా సర్వేలో తేలడం గమనార్హం. 0-19 వయసుగలవారు దేశంలో చాలా తక్కువ మంది ఉన్నట్లు సర్వే పేర్కొన్నది. ఈ క్రమంలోనే రాబోయే రెండు దశాబ్దాలకుపైగా కాలంలో జనాభా వృద్ధి భారీగా మందగించే వీలుందన్న సర్వే.. రిటైర్మెంట్ వయసును పెంచాలని, పాఠశాలలను విలీనం చేయాలని సూచించింది. ప్రస్తుతం ఒక మహిళకు టీఎఫ్ఆర్ 2.1 చిన్నారులుగానే ఉన్నది. ఇది పెరుగాల్సిన అవసరం ఉందని చెప్పింది.

ఐబీసీతో రూ.1.73 లక్షల కోట్ల రుణాలకు పరిష్కారం

మొండి బకాయిలపై ఉక్కుపాదం మోపడానికి నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన దివాలా చట్టం (ఐబీసీ) సత్ఫలితాలను ఇస్తున్నది. ఈ నూతన చట్టం ద్వారా రూ.1.73 లక్షల కోట్ల బకాయిలకు పరిష్కారం లభించిందని సర్వే వెల్లడించింది. మార్చి 31, 2019 నాటికి కార్పొరేట్ ఇన్‌సాల్వెన్స్ రిసొల్యూషన్స్ ప్రాసెస్ (సీఐఆర్‌పీ) కింద 94 కేసులు పరిష్కరించినట్లు, వీటి విలువ రూ.1,73,359 కోట్ల స్థాయిలో ఉందని తెలిపింది. మొండి బకాయిలపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలంటే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదని, దీంతో వసూళ్లు పెరిగి బ్యాంకులు కూడా ఆర్థికంగా బలోపేతం అవడానికి దోహదపడనున్నదని పేర్కొంది. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరంలో నిరర్థక ఆస్తులు తగ్గుముఖం పట్టడంతో బ్యాంకుల పనితీరు మెరుగుపడింది. గతేడాది వరుసగా 50 బేసిస్ పాయింట్లు పెంచిన రిజర్వు బ్యాంక్.. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, మరోవైపు ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన భారత ఆర్థిక వ్యవస్థను మళ్లీ ఊతమివ్వడానికి ఈ నిర్ణయం తీసుకున్నది. మార్చి 2018 నాటికి 11.5 శాతంగా ఉన్న బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ డిసెంబర్ చివరి నాటికి 10.1 శాతానికి తగ్గినట్లు పేర్కొంది.

రూ.39 వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి

గడిచిన ఆర్థిక సంవత్సరంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) రూ.38,931 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అంతక్రితం ఏడాది రూ.1,44,681 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు ఆతర్వాతి ఏడాది వెనక్కితీసుకోవడానికి మొగ్గుచూపినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మార్చి 31, 2019 నాటికి రూ.2,48,154 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..రూ.2,53,653 కోట్లను తరలించుకుపోయినట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు.

రూ.13 లక్షల కోట్లు కావాలి!

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుచాలంటే ప్రతియేటా కనీసం 200 బిలియన్ డాలర్ల నిధులు అవసరమవుతాయని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. మన కరెన్సీలో ఇది రూ.13 లక్షల కోట్లకు పైమాటే. వీటిలో ప్రైవేట్ రంగ పెట్టుబడులను ప్రోత్సహించినప్పుడే ఈ లక్ష్యానికి చేరుకోవడానికి సులభతరమవుతుంది. 2032 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవాలంటే మౌలిక రంగానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే ఈ లక్ష్యానికి చేరుకోవడానికి మరింత సులభతరమవుతుందని వెల్లడించింది. ప్రస్తుతం భారత్‌లో మౌలిక సదుపాయాలకోసం 100 నుంచి 110 బిలియన్ డాలర్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు, రైల్, విమానాశ్రయాల కోసం భారీ స్థాయిలో నిధులను ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నదని సర్వే గుర్తించింది. ప్రైవేట్ రంగ సంస్థలు భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నప్పటికీ దేశీయంగా నెలకొన్న పలు ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో వెనక్కి తగ్గుతున్నట్లు సర్వే అభిప్రాయపడింది. జాతీయ రహదారులకు ప్రాజెక్టులకు నిధుల లభ్యత చాలా క్లిష్టంగా మారిందని, ముఖ్యంగా భూ సేకరణ, పరిహారం చెల్లింపులు, పర్యావరణ అనుమతులు లభించడం ఆలస్యం కావడంతో ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని తెలిపింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 107 విమానాశ్రయాల అందుబాటులోకి వచ్చాయి.

సుబ్రమణ్యన్ వర్సెస్ సుబ్రమణ్యన్

గత ప్రధాన ఆర్థిక సలహాదారు, ప్రస్తుత ప్రధాన ఆర్థిక సలహాదారుడి మధ్య మాటలయుద్ధం తీవ్రస్థాయికి చేరుకున్నది. దేశ వృద్ధిరేటు గణాంకాలను ఎక్కువచేసి చూపెట్టారని అరవింద్ సుబ్రమణ్యన్ వ్యాఖ్యలను ప్రస్తుత ఆర్థిక సలహాదారుడు కే సుబ్రమణ్యన్ కొట్టిపారేశారు. 2011-12 నుంచి 2016-17 మధ్య కాలంలో దేశ వృద్ధిరేటును 2.5 శాతం కంటే ఎక్కువ చేసి చూపెట్టారని అరవింద్ ప్రధాన ఆరోపణ. దీనిపై కే సుబ్రమణ్యన్ స్పందిస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న పలు విషయాలను క్రోడీకరించి వృద్ధి గణాంకాలను తయారు చేస్తారు..వీటిలో పాలసీ నిర్ణయాలు, ఇతర అంశాలు కూడా కీలకం అని నా పరిశీలనలో వెల్లడైందన్నారు. వరుసగా 8 శాతం వృద్ధిని సాధిస్తే 2024-25 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశాలు మెండుగావున్నాయని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పరుగులు పెట్టాలంటే పెట్టుబడులు పుంజుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఇదే సమయంలో ఉద్యోగ కల్పన కూడా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. విదేశీ పెట్టుబడులకు రాచబాట వేయడానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి సంస్కరణలకు పెద్దపీట వేసేదిశగా చర్యలు తీసుకుంటున్నదన్నారు. 2018-19లో కరెంట్ ఖాతాలోటు(క్యాడ్) 57.2 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 2.1 శాతంగా నమోదైంది.

ద్రవ్యలోటు కట్టడే అతిపెద్ద సవాల్

ద్రవ్యలోటు కట్టడి ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాల్ అని ప్రధాన ఆర్థిక సలహాదారు కేవీ సుబ్రమణ్యన్ అన్నారు. కేంద్రానికి వచ్చే ఆదాయం కంటే పెట్టే ఖర్చు అధికంగా ఉందని, తద్వారా లోటు ఏర్పడుతుండటంతో అధికంగా అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆర్థిక సర్వే విడుదల అనంతరం ఆయన విలేకరులతో చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటు 3.4 శాతంగా నమోదైంది. ఫిబ్రవరి నెలలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కూడా ఇంతే స్థాయిలో అంచనావేసింది. పెట్టుబడులు, ఖర్చుల మధ్య పెరుగుతున్న అంతరాన్ని పూడ్చడానికి కేంద్ర ప్రభుత్వం..సెక్యూరిటీ, ట్రెజరీ బాండ్లను జారీ చేయడం ద్వారా వీటిని పూడుస్తున్నదని చెప్పారు. తద్వారా తాత్కాలికంగా ఉపశమనం లభించనున్నప్పటికీ..దీర్ఘకాలికంగా మాత్రం ఆర్థిక వ్యవస్థకు చేటు చేయనున్నదని తెలిపారు.

పద్దులు తేలేది నేడే..

లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 4: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టబోతున్నారు. ఇది సామాన్యుడి బడ్జెట్టా లేదా కార్పొరేట్ల బడ్జెట్టా లేదా రైతులకు లబ్దిచేకూర్చే బడ్జెట్టా అంటే.. మరికొన్ని గంటల్లో తేలబోతున్నది. ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్న దేశ వృద్ధిరేటుకు మళ్లీ ఊతమివ్వడం తోపాటు గరిష్ఠ స్థాయిలో కదలాడుతున్న ద్రవ్యలోటును కట్టడి చేయడం నిర్మలా సీతారామన్‌కు కత్తిమీద సాములాంటిదే మరి. రెండోసారి అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ.. పన్ను చెల్లింపుల నుంచి సామాన్యుడికి ఊరటనిస్తారా?.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి పన్ను చెల్లింపుల్లో రిబేట్ ఇచ్చిన సర్కార్.. ఈసారి పూర్తి స్థాయిలో ఊరట కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యక్తిగత ఆదాయం పన్ను పరిమితి పెంచడంతోపాటు వ్యవసాయం, ఆరోగ్యం, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తున్నది. మౌలిక రంగానికి మరింత బూస్ట్‌నివ్వడానికి రోడ్లు, రైల్వేలకు భారీ స్థాయిలో నిధులను కేటాయించవచ్చునని అంచనా. పారిశ్రామిక ప్రగతి నెమ్మది, అంతంత మాత్రపు వాహన అమ్మకాలు వృద్ధిపై ప్రభావం చూపాయి.

బడ్జెట్ టీంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో ఆ శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్

ప్రత్యక్ష పన్ను కోడ్ అమల్లోకి..

మోదీ మరోమారు అతిపెద్ద పన్నుల సంస్కరణకు సిద్ధమవుతున్నారు. రెండేండ్ల క్రితం జీఎస్టీని ప్రవేశపెట్టి సఫలీకృతమైన సర్కార్..ఈసారికిగాను ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను అమలులోకి తేవాలని చూస్తున్నారు. గడిచిన తొమ్మిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యక్ష పన్ను కోడ్‌ను ఈ బడ్జెట్‌లోనే ప్రవేశపెట్టి అమల్లోకి తేవాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది.

బడ్జెట్ కథ కమామిషు..

నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో తన తొలి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెడుతున్నారు. స్వతంత్ర భారతావనిలో కేంద్ర బడ్జెట్‌ను ప్రకటిస్తున్న తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రి సీతారామనే కావడం విశేషం. ఇంతకుముందు 1970-71లో ఇందిరా గాంధీ కేంద్ర బడ్జెట్‌ను ఓసారి ప్రకటించారు. అయితే మొరార్జీ దేశాయ్ రాజీనామాతోనే తాత్కాలిక ఆర్థిక మంత్రి హోదాలో ఇందిరా బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇక పూర్తి, మధ్యంతర బడ్జెట్లను కలుపుకుని ఈసారిది 89వ బడ్జెట్. ఒక్కసారి బడ్జెట్ చరిత్రకెళ్తే..

తొలి బడ్జెటే మధ్యంతరం



స్వతంత్ర భారతంలో వచ్చిన తొలి బడ్జెటే.. మధ్యంతర బడ్జెట్ కావడం గమనార్హం. 1947 ఆగస్టు 15 నుంచి 1948 మార్చి 31దాకా ఏడున్నర నెలలపాటు ఈ బడ్జెట్ అమల్లో ఉన్నది. మార్చిలో ఏడాది కాలం కోసం బడ్జెట్‌ను ఆమోదించినా.. భారత్, పాకిస్తాన్ విభజన కారణంగా అదికాస్తా రద్దయ్యింది. స్వేచ్ఛా భారతం కోసం తొలి కేంద్ర బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న అప్పటి ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం శెట్టి ప్రవేశపెట్టారు.

సుదీర్ఘ, సంక్షిప్త ప్రసంగాలు

పదాల పరంగా 1991లో మన్మోహన్ సింగ్ సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇందులో 18,177 పదాలున్నాయి. ఆ తర్వాతి మూడు స్థానాల్లో అరుణ్ జైట్లీ ప్రసంగాలే ఉన్నాయి. 2014, 2017, 2016ల్లో బడ్జెట్ ప్రకటన సందర్భంగా ఈ సుదీర్ఘ ప్రసంగాలిచ్చారు. ఇవి వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచాయి. అయితే సమయం ప్రకారం 2003లో జస్వంత్ సింగ్ ఏకంగా రెండు గంటల 13 నిమిషాలు ప్రసంగించారు. అయితే 1977లో హెచ్ఎం పటేల్ చేసిన మధ్యంతర బడ్జెట్ ప్రసంగం అతి చిన్నదిగా రికార్డైంది. ఇందులో కేవలం 800 పదాలున్నాయి.

మొరార్జీ దేశాయ్ టాప్

మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 బడ్జెట్లను ప్రకటించారు. దేశ ఆర్థిక శాఖ మంత్రుల చరిత్రలో ఇన్నిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టినవారెవరూ లేరు. తొమ్మిదిసార్లు బడ్జెట్ ప్రకటించి కాంగ్రెస్ నేత పీ చిదంబరం రెండో స్థానంలో ఉన్నారు.

మార్పులు

1999కి ముందు ఏటా ఫిబ్రవరి నెల చివరి పని దినాన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. సాయంత్రం 5 గంటలకు ప్రకటించేవారు. దీనికి ముగింపు పలుకుతూ యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు ప్రకటించారు. ఇక అరుణ్ జైట్లీ 2017-18 ఆర్థిక సంవత్సరం కోసం ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను తెచ్చారు. అప్పట్నుంచి ఇదే రోజున బడ్జెట్ వస్తుండగా, ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆ రోజున మధ్యంతర బడ్జెట్‌ను తేవాల్సి వచ్చింది. ఈ కారణంగానే ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రకటిస్తున్నారు.

చరిత్రలో కొన్ని..

టీటీ కృష్ణమాచారి 1964-65 బడ్జెట్.. తొలిసారి అప్రకటిత ఆదాయం లేదా బ్లాక్‌మనీ అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఈ సొమ్మును స్వచ్ఛందంగా వెల్లడించే అవకాశాన్ని (వీడీఐఎస్) ఆయన తన 1965-66 మధ్యంతర, కేంద్ర బడ్జెట్లలో పరిచయం చేశారు. ఇక 1997-98 బడ్జెట్‌లో చిదంబరం వీడీఐఎస్ కిందే జరిమానాలు, వడ్డీలను రద్దు చేశారు. చర్యల నుంచి కూడా నల్లధన సంపన్నులకు విముక్తి కలిగించారు. 1991లో మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలను పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలను అంతర్జాతీయ విపణిలోకి పంపించారు.

ప్రధాని హోదాలోనే..

జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ప్రధాన మంత్రి హోదాల్లోనే కేంద్ర బడ్జెట్లను ప్రకటించారు. గతంలో ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఆర్ వెంకటరామన్, ప్రణబ్ ముఖర్జీలు రాష్ట్రపతులయ్యారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా పనిచేసిన సీడీ దేశ్‌ముఖ్.. ఆ తర్వాత ఆర్థిక మంత్రి అయ్యారు. 1951లో ఈయన తన తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మోకాళ్ల నొప్పులకు పెయిన్ కిల్లర్సా?

అన్నీ సక్రమంగా ఉన్నా ఒక్కోసారి అడుగులు తడబడుతూఉంటాయి. అలాంటిది మోకాళ్ల నొప్పులు కూడా ఉంటే ఏమైనా ఉందా? అన్నీ మామూలుగా ఉన్నప్పుడే ఒక్కోసారి జీవితం పట్ల ఆసక్తి తగ్గిపోతూ ఉంటుంది. అసలు కాలు కదపడమే కష్టమైపోతే అంతా అయిపోయినట్లే అనిపిస్తుంది. పాతరోజుల్లో 60 ఏళ్లు దాటితే

బెస్ట్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా దశరథరామరెడ్డి

యశోదా హాస్పిటల్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టీ దశరథ రామరెడ్డి ఉత్తమ ఆర్థోపెడిక్ సర్జన్‌గా నిలిచారు. డాక్టర్స్ డే సందర్భంగా హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, ప్రపంచ ప్రఖ్యాత రేడియాలజిస్ట్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు చేతుల మీదుగా డాక్టర్ దశరథరామరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

రైల్వేస్‌లో పొడవైన సొరంగమార్గం!

- చెర్లోపల్లి -రాపూర్ స్టేషన్ల మధ్య రాకపోకలు ప్రారంభం
- కృష్ణపట్నం పోర్టు-తీరప్రాంతాలు అనుసంధానం
- దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణాలో కీలకమార్గం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలోని నెల్లూరు –వెలిగొండ కొండల కింద నిర్మించిన ఈ సొరంగమార్గం బుధవారం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. చెర్లోపల్లి–రాపూర్ స్టేషన్ల మధ్య 6.6 కిలోమీటర్ల పొడవుగల సొరంగమార్గంలో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. విద్యుదీకరించిన సొరంగ మార్గాల్లో ఇదే అతిపొడవైనది. ఈ సొరంగమార్గం ద్వారా గూడ్స్ రైళ్ల రాకపోకలు విజయవంతంగా సాగుతున్నాయి. ఓబులవారిపల్లి –వెంకటాచలం మధ్య కొత్తగా నిర్మించిన రైల్వేలైనులో ఈ సొరంగమార్గం ఓ భాగం. ఇది కృష్ణపట్నం పోర్టుతో తీరప్రాంతాలను అనుసంధానంచేస్తూ గూడ్స్ రైళ్ల రాకపోకలకు వీలు కలిగిస్తున్నది. గూడ్స్ రైళ్లను నడుపడానికి ఉద్దేశించిన ఈ మార్గంలో సొరంగ మార్గాన్ని 43నెలల రికార్డుకాలంలో పూర్తిచేశారు. ఈ మార్గం వల్ల కృష్ణపట్నం పోర్టు, తీరప్రాంతాల మధ్య దూరం 60 కిలోమీటర్లు తగ్గుతుంది. ఈ రైలు మార్గం వల్ల విజయవాడ–గూడూరు ప్రధాన రైలుమార్గంపై రద్దీ తగ్గుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్‌మాల్యా పేర్కొన్నారు.

రైల్వే సొరంగమార్గం ప్రత్యేకతలు

న్యూ ఆస్ట్రేలియన్ టన్నెలింగ్ మెథడ్ (ఎన్ఏటీఎం) ఉపయోగించి నిర్మించారు.

నిర్మాణానికి అయిన ఖర్చు రూ.460 కోట్లు. సొరంగం పూర్తి పొడవు 6,660 మీటర్లు. ఎత్తు (పైకప్పు వరకు) 6.5 మీటర్లు, కాంటాక్టు వైరు కనీస ఎత్తు 5.2 మీటర్లు. ప్రతి 10 మీటర్లకు ఒక ఎల్ఈడీ లైటుతోపాటు సొరంగమార్గంలో పనిచేసే సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులకు వినతిపత్రాలు సమర్పిస్తున్న సంచార జాతుల ప్రతినిధులు

మా జాతులను ఆదుకోండి

బీసీ కమిషన్‌కు సంచార జాతుల ప్రతినిధుల వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే రిజర్వేషన్లు, ఆర్థిక, సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు ఎటువంటి ప్రయోజనాలను పొందలేకపోయిన తమను ఆదుకోకుంటే తమ జాతులు అంతరించిపోతాయని గవులి, తెరచీరల, ఏనూటి సంచార జాతుల ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విన్నవించారు. గురువారం బీసీ కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ– బహిరంగ విచారణ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్ర పాల్గొన్నారు. ఐదో రోజు కొనసాగిన విచారణలో సంచార జాతుల ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. సాంస్కృతిక కళారూపాలకు ఆదరణలేక రోజు కూలీలుగా జీవిస్తున్న తమను బీసీలుగా గుర్తించి, రిజర్వేషన్లు కల్పిస్తే కొంతవరకైనా మేలు జరుగుతుందని కమిషన్‌ను కోరారు.

కేంద్రం దృష్టికి రాష్ట్ర ప్రతిపాదనలు

8న రాష్ట్రంలో జాతీయ బీసీ కమిషన్ పర్యటన: సభ్యుడు ఆచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వెనుకబడిన తరగతుల జాబితాలో కొత్తగా చేర్చాల్సిన కులాల వివరాలు, వాటికి సంబంధించి రాష్ట్రం నుంచి వచ్చే ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి తెలిపారు. గురువారం ఆయన బీసీ కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జాతీయ బీసీ కమిషన్ ఈ నెల 8న హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ కమిషన్‌తో భేటీ అవుతుందని, ఆ తర్వాత రవీంద్రభారతిలో బీసీ కులసంఘాలు, విద్యార్థి, ఉద్యోగసంఘాలు, ఇతర సామాజిక సంస్థల ప్రతినిధులతో సమావేశమై, వినతిపత్రాలను స్వీకరిస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీలపై జరుగుతున్న దాడులపై సుమోటోగా స్పందిస్తున్నామని, హాజీపూర్‌లో ముగ్గురు బీసీ యువతులపై అత్యాచారం, హత్యకు పాల్పడ్డవ్యక్తిని కఠినంగా శిక్షించాలని డీజీపీకి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. వరంగల్‌లో తొమ్మిది నెలల పసికందుపై అత్యాచారానికి పాల్పడటం శోచనీయమని, ఇటువంటి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆచారి వివరించారు. అనంతరం బీఎస్ రాములు, వకుళాభరణం కృష్ణమోహన్‌తో సమావేశమై రాష్ట్రంలోని పరిస్థితులపై చర్చించారు. జాతీయ బీసీ కమిషన్‌తో సమావేశానికి హాజరు కావాల్సిందిగా వారిని ఆచారి ఆహ్వానించారు.

వాణిజ్య పంటలు పండించాలి

సిద్దిపేట జిల్లా ఇర్కోడ్‌లో రజక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్: రైతులు వాణిజ్య పంటలు పండించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్‌లో రజక, అంబేద్కర్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన, బాల వికాస ఆధ్వర్యంలో నిర్మించిన ఏటీడబ్ల్యూ వాటర్ ప్లాంట్, ఎస్సీ ఫంక్షన్ హాల్, గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇర్కోడ్ గ్రామ ప్రజల ఆదరణ, అభిమానం చూసి తన కడుపు నిండిందన్నారు. గ్రామం చుట్టూ ఉన్న మూడు గ్రామాల కోసం లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15 రోజుల్లో చేపల పెంపకానికి చెరువులు సిద్ధం చేస్తామనీ, త్వరలోనే రెండో దశ గొర్రెల పంపిణీ చేస్తామన్నారు. ప్రతీ గ్రామంలో గిరక తాడి చెట్లు పెంచేందుకు గౌడ సంఘాలకు 5 ఎకరాల స్థలం ఇస్తూ పట్టాల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, రాష్ట్రంలో 200 ఎస్సీ రెసిడెన్షియల్, 230 ఎస్సీ మహిళా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. సిద్దిపేటలో రూ.2.75 కోట్లతో నిర్మించిన బాబు జగ్జీవన్‌రామ్ భవన్ ప్రారంభోత్సవంతోపాటు హాజ్ హౌస్ పనులను పరిశీలించారు.

న్యాయం చేయాలని నిరసన తెలుపుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగ్గూడెం గిరిజనులు

భూములను కబ్జా నుంచి కాపాడండి

- పోలీసులకు గిరిజనుల ఫిర్యాదు

చుంచుపల్లి: తాతల కాలం నుంచి పోడుకొట్టి వ్యవసాయం చేసుకుంటున్నామని, సదరు భూములను గిరిజనేతరులు అక్రమించారని, అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీలోని ములుగ్గూడెం గిరిజనులు (కోయ) గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు వారు సదరు భూముల్లో నిరసన వ్యక్తంచేశారు. తమ భూములను గిరిజనేతరులు అక్రమించి ఇబ్బందులుకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై అటవీ, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

- పెట్రోల్ పోసి నిప్పంటించి..
- వనపర్తి జిల్లాలో ఘటన

కొత్తకోట: పెట్రోల్ పోసి నిప్పంటించి ఓ వ్యక్తిని అతికిరాతంగా హత్య చేసిన సంఘటన గురువారం వనపర్తి జిల్లాలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ సమీపంలోని బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి (45) ని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించి అతి దారుణంగా హత్య చేశారు. శరీరం పూర్తిగా కాలిపోవడంతో మరణించింది ఎవరనేది గుర్తించే అవకాశం లేకుండా పోయింది. గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతులు అటుగా వెళ్తూ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సీ అపూర్వరావు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దుండగులను పసిగట్టేందుకు డాగ్ స్క్వాడ్‌ను తనిఖీలు జరిపించారు. మృతదేహాన్ని వనపర్తి జిల్లా దవాఖానకు తరలించారు.

సమస్యలకు త్వరలో పరిష్కారం

- వెటర్నేరియన్స్ సంఘం కార్యవర్గ సమావేశంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్/బేగంబజార్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారమవుతాయని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎన్జీవోభవన్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నేరియన్స్ అసోసియేషన్ (టీఎన్జీవీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. టీఎన్జీవో కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, సహాయ ఎన్నికల అధికారి ఇటికాల కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ సభ్యులకు రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ నియామక పత్రాలు అందించారు. వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారులకు గెజిటెడ్ హోదా కోసం ప్రభుత్వంతో చర్చిస్తామని రవీందర్‌రెడ్డి హామీఇచ్చారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా డీ శ్రీనివాస్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా కే రతన్, కార్యదర్శిగా జీ నరేందర్‌గౌడ్, కోశాధికారిగా సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఫజలుద్దీన్, గిరిధర్‌రావు, వసంత, సంయుక్త కార్యదర్శులుగా మన్మథరావు, శేఖర్, రాజేశ్వర్, విలాసిని, కార్యాలయ కార్యదర్శిగా బీ కొండల్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా డీ జంగయ్య, ప్రచార కార్యదర్శిగా వీ గణేశ్‌కుమార్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వీ సుధాకర్, నందసునీల్, ఎం సతీశ్‌కుమార్, ఎస్ రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బండారు రేచల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన వెటర్నేరియన్స్ ఉద్యోగ సంఘ కార్యవర్గ సభ్యులతో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ తదితరులు

వీఎల్వోలకు గెజిటెడ్ హోదాకు కృషి

తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నేరియన్ ఉద్యోగుల సమస్యలన్నింటిని పరిష్కరించడంతోపాటు, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ (వీఎల్వో) పోస్టుకు గెజిటెడ్ హోదా కల్పించేందుకు టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సహకారంతో ప్రయత్నిస్తానని టీఎన్జీవీఏ కార్యదర్శి గంధమల్ల నరేందర్‌గౌడ్ తెలిపారు.

టీఎన్జీవోలో దేవాదాయశాఖ ఉద్యోగుల సభ్యత్వం

కార్యనిర్వహణాధికారులు, ఉద్యోగులు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘంలో చేరుతూ సభ్యత్వం తీసుకున్నారని అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈవోలు, సిబ్బంది గురువారం టీఎన్జీవో భవన్‌లో కలిసినట్టు చెప్పారు. దీంతో టీఎన్జీవో అనుబంధ సంస్థగా తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారుల సంఘం కొనసాగుతుందన్నారు. దేవాదాయశాఖలో సిబ్బంది, అధికారుల సమస్యలపై ప్రభుత్వానికి విన్నవిస్తామని రవీందర్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి దేవస్థానం ఈవో అన్నపూర్ణ అధ్వర్యంలో పలువురు ఈవోలు, అధికారులు సభ్యత్వం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, కొండల్‌రెడ్డితోపాటుగా దేవాలయ ఈవోలు, ఉద్యోగులు శేషు భారతి, రమాదేవి, శ్రీనివాసశర్మ, మోహన్ రెడ్డి, పురేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని, పావలావడ్డీకి రూ.256 కోట్లు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీ రుణాల పథకాల కింద చెల్లించాల్సిన బకాయిలకు నిధులు విడుదల చేసింది. వడ్డీలేని రుణాలు, పావలావడ్డీ రుణ పథకాల కింద రూ.256 కోట్లను విడుదల చేస్తూ వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ పరిపాలన అనుమతులు ఇచ్చింది. గడిచిన రెండున్నర సంవత్సరాల కాలానికి సంబంధించి బకాయిలు చెల్లించనున్నట్టు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి గురువారం ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆదిలాబాద్ డెయిరీ అభివృద్ధికి 11.10 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా డెయిరీ బలోపేతానికి పశుసంవర్ధకశాఖ రూ.11.10 కోట్లు విడుదల చేసింది. డెయిరీ బలోపేతంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఖర్చుచేయనున్నారు. ఈ మేరకు గురువారం పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

పాఠశాల విద్యార్థులకు నాటికల పోటీలు

సెప్టెంబర్ 24 నుంచి మూడ్రోజులు రవీంద్రభారతిలో నిర్వహణ

దరఖాస్తులను ఆహ్వానించిన రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్ శివకుమార్

రవీంద్రభారతి: నాటకాల పట్ల పిల్లల్లో పాఠశాల స్థాయినుంచే అభిరుచిని పెంపొందించాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ తొలిసారిగా రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు నాటికల పోటీలు నిర్వహించనున్నట్టు అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ గురువారం రవీంద్రభారతిలోని మీడియాకు తెలిపారు. సెప్టెంబర్ 24 నుంచి 26 వరకు రవీంద్రభారతిలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్రంలోని జిల్లాపరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9000553072లో సమన్వయకర్త బీఎం రెడ్డిని సంప్రదించాలని తెలిపారు.

నకిలీ విత్తనాల పట్టివేత

కేటీదొడ్డి : వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల్లో క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం మల్లాపురంలో గురువారం సాయంత్రం నర్సింహులు అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. విత్తనాలలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభయ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ అభయ్‌ను సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డీజీగా పనిచేస్తున్న అభయ్.. 2021 జూన్ 30 వరకు కొత్తపోస్టులో కొనసాగనున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వరంగల్ శ్రీభద్రకాళీ అమ్మవారి శాకంబరీ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం అమ్మవారిని ఉదయం కపాలిని, సాయంత్రం భగమాలినీ క్రమంలో అలంకరించారు. - మట్టెవాడ(వరంగల్ అర్బన్)

బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి హుండీని గురువారం లెక్కించారు. రూ.96.54 లక్షల నగదు, 165 గ్రాముల మిశ్రమ బంగారం, 7.9 కిలోల మిశ్రమ వెండి , 124 డాలర్లు లభించాయి. 58 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపులో ఈ మొత్తం సమకూరినట్టు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. - బాసర

100 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

- సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్
- ఖమ్మం జిల్లాలో నర్సరీల పరిశీలన

రఘునాథపాలెం : అయిదో విడత హరితహారంలో రాష్ట్రంలో 100 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకొన్నట్టు సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం అర్బన్, కూసుమంచి, ముదిగొండ మండలాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఖమ్మం నగరం శివారులోని వెలుగుమట్ల ఫారెస్ట్ పార్క్‌ను కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి సందర్శించారు. అనంతరం కూసుమంచి మండలంలోని కేశవాపురం నర్సరీని, ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం, సువర్ణాపురం నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేసిందన్నారు. 12వేల 751జీపీల్లో 80కోట్ల మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఖమ్మం జిల్లాలో హరితహారం లక్ష్యంపై కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో మాట్లాడుతున్న ప్రియాంకవర్గీస్

సెంట్రల్ జైలులో నర్సరీని పరిశీలించిన కలెక్టర్

వరంగల్ క్రైం(వరంగల్ అర్బన్) : వరంగల్ కేంద్ర కారాగారంలో పెంచుతున్న మొక్కలు తెలంగాణకు మణిహారంగా మారనున్నాయని వరంగల్ అర్బన్ కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ పేర్కొన్నారు. వరంగల్ సెంట్రల్ జైలులో 'కుడా' నిధులతో పెంచుతున్న 15 లక్షల మొక్కల నర్సరీని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన అన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్న కారాగారం వరంగల్ సెంట్రల్ జైలు ఒక్కటేనని కలెక్టర్ పేర్కొన్నారు.

నేటినుంచి యాదాద్రిలో వరుణయాగం

యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: వర్షాలు సమృద్ధిగా కురవాలని, దేశం సుభిక్షంగా ఉండాలని కోరుతూ యాదాద్రిలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు వరుణ యాగం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. యాగ నిర్వాహకులు, బ్రాహ్మణులకు మాత్రమే అనుమతి ఉన్నదని ఆలయ అధికారులు తెలిపారు.

7న ఊరూరా దండోరా జెండా పండుగ

ఆలేరుటౌన్ : ఎమ్మార్పీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 7న రాష్ట్రవ్యాప్తంగా దండోరా జెండాలు ఎగురవేస్తామని టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా టీఎమ్మార్పీఎస్ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నదన్నారు. అటు డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ సాధిస్తామని అన్నారు.

ఆలేరులో మీడియాతో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శ్రీకనకదుర్గ సిల్క్స్‌నిర్వాహకులు రూ.20కే చీరె అని ప్రచారం చేయడంతో గురువారం భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చీరెల కోసం మహిళల మధ్య తోపులాట జరుగగా, అదుపు చేసేందుకు పోలీసులు అపసోపాలు పడ్డారు. అధిక సంఖ్యలో మహిళలు రావడం, చీరెలన్నీ అమ్ముడుపోవడంతో యజమాని దుకాణాన్ని మూసివేశాడు. చీరెలు దొరకనివారు నిరాశతో వెనుదిరిగారు. -పెద్దపల్లిటౌన్

ప్రియుడి ఇంటి ఎదుట ఆత్మహత్యాయత్నం

మెట్‌పల్లి రూరల్: నాలుగు రోజులుగా ప్రియుడి ఇంటి ఎదుట మౌన పోరాటం చేస్తున్న ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఏఎస్సార్‌తండాలో గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన బానావత్ లలిత మెట్‌పల్లి మండలం ఏఎస్సార్ తండాలోని బంధువుల ఇంటికి వచ్చి వెళ్లేది. ఈ క్రమంలో తండాకు చెందిన గుగ్లావత్ మోహన్‌తో పరిచయం ప్రేమగా మారింది. వివాహానికి ప్రియుడి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో లలిత నాలుగు రోజుల నుంచి మోహన్ ఇంటి ఎదుట బైఠాయించింది. తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం మోహన్‌ను బంధువుల ఇంటికి పంపించారు. మనస్తాపం చెంది న లలిత పురుగుల మందు తాగింది. స్థానికులు లలితను మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ప్రయాణికుడి నుంచి రూ.10.35 లక్షలు చోరీ

నార్కట్‌పల్లి : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.10.35 లక్షలను చోరీ చేసిన ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి శివారులోని ప్రైవేటు హోటల్ వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. గుంటూరుజిల్లా మంగళగిరి మండలం మాతక్క గ్రామానికి చెందిన మందాల సంజీవరెడ్డి ట్రాక్టరు డీలర్‌గా పని చేస్తున్నాడు. కారు కొనుగోలు చేసేందుకు రూ.10.35 లక్షల నగదును తీసుకొని ఆర్టీసీ బస్సులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. డ్రైవర్ టిఫిన్ చేసేందుకు నార్కట్‌పల్లి శివారులోని పూజిత హోటల్ వద్ద బస్సును నిలిపాడు. సంజీవరెడ్డితో పాటు ప్రయాణికులందరూ బస్సు దిగి టిఫిన్ చేసిన అనంతరం తిరిగి బస్సు ఎక్కారు. సంజీవరెడ్డికి చెందిన డబ్బులున్న బ్యాగు కనిపించలేదు. దీంతో డ్రైవర్ బస్సును నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీసులు బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేసినప్పటికీ డబ్బులు దొరకలేదు. బస్సులో 21 మంది ప్రయాణికులు ఉండాల్సి ఉండగా 20 మంది మాత్రమే ఉన్నారు. ఒక ప్రయాణికుడు లేక పోవడంతో పోలీసులు అతని ఆచూకీ కోసం కండక్టర్‌ను, ప్రయాణికులను అడిగినప్పటికీ వివరాలు తెలియరాలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బద్యా నాయక్ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.30 లక్షలకు టోకరా

- నమ్మించి ముంచిన కి'లేడి'

కరీంనగర్ క్రైం : ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తానని పరిచయం చేసుకున్న ఓ మహిళ రూ.30 లక్షల మేర తీసుకుని ఉడాయించింది. ఉంటున్న చోటు మారుస్తూ నమ్మిన వారి దగ్గర ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రెండింతల లాభాలు వస్తాయని డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన గుళ్ల పుణ్యవతి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో అద్దెకుండేది. వావిలాలపల్లికి చెందిన పద్మ అనే మహిళ ఇంట్లో రెండేళ్ల క్రితం అద్దెకు దిగి షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో లాభాల గురించి వివరిస్తూ అధిక వడ్డీ ఆశ చూపింది. ఆమెను నమ్మి 2017 అక్టోబర్‌లో రూ.6 లక్షల నగదు, రూ.5 లక్షలు చెక్కు రూపంలో ఇచ్చారు. కొద్ది రోజులు నమ్మించి చెప్పా పెట్టకుండా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేయడంతో నెలల తరబడి ఆమె గురించి వెతికినా అడ్రస్ దొరకలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే తరహాలో రాజ్‌మహ్మద్ అనే వ్యక్తి నుంచి రూ.10 లక్షలు, కిషన్ అనే వ్యక్తి నుంచి రూ.3.50 లక్షలు, డీ రాజేశ్వరి అనే మహిళ నుంచి రూ.3.20 లక్షలు వసూలు చేసి అక్కడి నుంచి ఉడాయించడంతో నెలల తరబడి ఆమె కోసం వెతికారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 5 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

సెలబ్రేషన్స్‌లో వెలిగిపోవాలంటే.. సాయంత్రకాలపు పార్టీలకు ప్రత్యేకంగా నిలువాలంటే.. లాంగ్ గౌనులు తప్పనిసరి అయ్యాయి.. వెస్ట్రన్ పార్టీల్లో కచ్చితంగా కనిపించే ఈ లాంగ్ గౌన్లు.. ఇప్పుడు సంప్రదాయతను అద్దుకొని సరికొత్తగా మెరుస్తున్నాయి.. నెట్.. షిఫాన్.. బెనారస్.. ఇలా అన్ని మెటీరియల్స్‌తో సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి.. లవ్లీగా కనిపించే ఈ లాంగ్ గౌన్ల పై మీరూ ఓ లుక్కేయండి..

పెద్దగౌను.. స్టైయిల్ అదిరెను!

రాయల్‌గా కనిపించేందుకు ఈ డ్రెస్ ఎంచుకోవాల్సిందే! మెజంటా రంగు షిఫాన్ మెటీరియల్‌ని లాంగ్ ఫ్రాక్‌గా కుట్టాం. ఒక వైపు పువ్వుల డిజైన్‌తో సీక్వెన్స్, గోల్డెన్ థ్రెడ్, గోల్డెన్ బీడ్స్‌తో హెవీగా వర్క్ చేయించాం. ఫుల్ స్లీవ్స్ మీద కూడా ఇదే వర్క్ కంటిన్యూ చేశాం. దీనికి నెట్‌తో రఫెల్ నెట్ దుపట్టా ఇచ్చాం. దానికి గోల్డెన్ లేస్ అదనపు ఆకర్షణగా నిలిచింది.

డబుల్ లేయర్ ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్. అందుకే దాన్ని హాఫ్ అండ్ హాఫ్‌లా డిజైన్ చేశాం. లైట్ పీచ్ కలర్ నెట్‌ని లాంగ్ గౌన్‌గా కుట్టాం. ఒక వైపు చిన్న గోల్డెన్ బుటీస్ వచ్చిన నెట్‌ని ఉపయోగించాం. మరో వైపు కాస్త హెవీ బుటీస్‌తో నింపేశాం. పైన షిఫాన్‌ని అటాచ్ చేశాం. దీని మీద నుంచి నెట్ కేప్ వేసి గోల్డెన్ చమ్కీ, గోల్డ్ జరీతో హెవీగా వర్క్ చేయించాం.

యెల్లో కలర్ షైనీ నెట్‌తో లాంగ్ గౌన్ డిజైన్ చేశాం. దీనికి గోల్డెన్ బార్డర్, దానిపై.. గోల్డ్, సిల్వర్ కాంబినేషన్‌లో వచ్చిన లేస్‌ని అటాచ్ చేశాం. కేప్ ఈ డ్రెస్‌కి అదనపు ఆకర్షణ. యెల్లో కలర్ షైనీ నెట్ మీద ముందు సీక్వెన్స్, థ్రెడ్ వర్క్‌తో హెవీగా డిజైన్ ఇచ్చాం. ఈ కేప్‌కి కట్ వర్క్ బార్డర్ అటాచ్ చేయడంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నది.

డిఫరెంట్‌గా ఉండాలనుకునే వాళ్లకు ఇది పర్‌ఫెక్ట్ చాయిస్. పీచ్ కలర్ బెనారస్ మెటీరియల్ ఫుల్ గౌనుగా కుట్టాం. స్లీవ్స్‌కి కాస్త డిఫరెంట్ డిజైన్ వచ్చిన బెనారస్‌ని వాడాం. ఇక ముందు డార్క్ పీచ్ కలర్ షిఫాన్ మెటీరియల్‌ని మల్టిఫుల్ లేయర్లుగా డిజైన్ చేశాం. ముందు ఓపెన్ ఇచ్చి.. దానికి గోల్డెన్ జరీ అటాచ్ చేశాం. కింద వైపు హెవీ బీడ్స్ వచ్చిన లేస్ అటాచ్ చేయడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

నెమలి పింఛం రంగుల కాంబినేషన్‌తో ఈ డ్రెస్ కుట్టాం. పీకాక్ గ్రీన్ నెట్‌ని గౌన్‌గా కుట్టాం. పైన వరకు మాత్రం గోల్డెన్ సీక్వెన్స్, జరీతో ఆకుల డిజైన్‌తో పూర్తిగా నింపేశాం. ఫుల్ హ్యాండ్స్ మీద చెక్స్, లీవ్స్ ప్యాటర్న్ ఇచ్చాం. కింద నెట్ లేయర్ చివరన గోల్డెన్ లేస్ అటాచ్ చేశాం. బ్లూ కలర్ షిఫాన్ లైనింగ్‌గా వేయడంతో డబుల్ షేడ్‌లో గౌన్ మరింత అందంగా కనిపిస్తున్నది

ఫిరోజ్
ఫ్యాషన్ డిజైనర్
ఫిరోజ్ డిజైన్ స్టూడియో
https://www.facebook.com/firozdesignstudio/
హైదరాబాద్
ఫోన్ : 8142049755, 9505340228

స్టయిలిష్ హ్యాండ్‌బ్యాగ్

మామూలుగా వంద నుంచి కొన్ని వేల రూపాయల ధర పలికే హ్యాండ్‌బ్యాగులను చూశాం. కానీ ఏకంగా 2.6 కోట్లతో ఒక హ్యాండ్ బ్యాగును కొన్నది నీతా అంబానీ. ఆ ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ మళ్లీ వార్తల్లోకెక్కారు. ఇటీవల బాలీవుడ్ నటి కరిష్మా కపూర్, నీతా అంబానీ మరో ఇద్దరు కలిసి యూకేకు వెళ్లారు. వారు అక్కడ దిగిన ఫొటోను కరిష్మాకపూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో నీతా అంబానీ బ్యాగు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ బ్యాగు విలువ 2.6 కోట్లు. ఈ బ్యాగులో 240 డైమండ్స్ పొందుపరిచారు. తెలుపురంగులో ఉన్న ఈ హ్యాండ్ బ్యాగు హిమాలయ జలాల్లోని మొసలి చర్మంతో చేసింది. దీన్ని 2017లో వేలం వేయగా 2.6 కోట్లకు అమ్ముడైంది. ప్రపంచంలో ఇప్పటి వరకు ఇంత ధర పెట్టి బ్యాగును ఎవరూ కొనుగోలు చేయలేదు. కాగా అంబానీ హ్యాండ్‌బ్యాగు ఖరీదుతో ఢిల్లీలో త్రిబుల్ బెడ్రూం ఫ్లాట్ కొనుక్కోవచ్చని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం నీతా అంబానీ వాడుతున్న బ్యాగు ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

పిల్లలు సరిగా నిద్రపోతున్నారా?

చాలామంది పిల్లలు నిలకడ లేని మనస్తత్వంతో ఉంటారు. అయితే నిలకడ లేని మనస్తత్వానికి కారణం నిద్ర.. పిల్లలు సరిగా నిద్రపోకపోతే వారి మానసిక స్థితిపై ప్రభావం పడుతుంది. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే పిల్లలు హాయిగా నిద్రపోతారు.

- వయసుకు తగ్గట్టు పిల్లలు నిద్రపోయేలా అలవాటు చేయాలి. నాలుగు నుంచి 5 ఏండ్ల వయసు గల పిల్లలకు 11 గంటల 30 నిమిషాలు నిద్రపోవాల్సి ఉంటుంది. 5 నుంచి 8 ఏండ్లపిల్లలు 11 గంటలు నిద్రపోవాల్సి ఉంటుంది. 8 నుంచి 10ఏండ్ల పిల్లలు 10 గంటలు నిద్రపోవాల్సి ఉంటుంది.
- సెలవులతో సంబంధం లేకుండా ప్రతిరోజు పడుకోవడం, లేవడంలో ఒకే సమయాన్ని పాటించే విధంగా చూడాలి. సెలవుల్లో పిలల నిద్ర వేళల క్రమం మారకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ మారినా బడి తెరవడానికి కనీసం వారం రోజులు ముందు నుంచి నిద్ర వేళల్ని సరిచేయాలి.
- పిల్లల గదుల్లో టీవీలు, కంప్యూటర్లు, వీడియో గేములు వంటివి ఉంచొద్దు. అలాగే నిద్ర వేళకు అరగంట ముందు వాటిని చూడనీయకూడదు. అరగంట ముందు చదవడం, హోం వర్కు చేయడం నిలిపివేయాలి. సాయంత్రం, రాత్రిపూట పిల్లలు తినే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి. సాయం కాలం తర్వాత చాక్లెట్లు, కోలా డ్రింకులు తాగనీయవద్దు. వీటిలోని కెఫిన్ రోజూ వారి నిద్రను చెడగొడుతుంది.
- పడుకునే ముందు రిలాక్స్ కావడాన్ని పిల్లలకు నేర్పించాలి. 'బెడ్ రొటీన్స్' అలవాటు చేయాలి. సరిగా నిద్రపోతేనే పిల్లల ఎదుగుదల సరిగ్గా ఉంటుందనే విషయాన్ని పెద్దలు గ్రహించాలి. కొంతమంది పిల్లలు పడుకునే ముందు తియ్యని పదార్థాలు తింటారు. మరికొంత మంది టీ, కాఫీలు కావాలని పట్టుబడుతుంటారు. ఈ పద్ధతి పిల్లల పళ్లను పాడు చేస్తుంది.
- పిల్లలను మధ్యాహ్నం పూట ఒక గంట సేపైనా నిద్రపోయేలా చూడాలి. మధ్యాహ్నం నిద్ర పిల్లలకు గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. పిల్లలు గురకపెట్టే అలవాటు ఉంటే ఉదయం సాయంత్రం గోరు వెచ్చని నీటిని తాగిస్తే సరిపోతుంది.

ఆ గ్రామాలకు పునర్జన్మనిచ్చింది!

ఒకప్పుడు మద్యపానం, నిరుద్యోగంతో బాధపడుతున్న గుజరాత్‌లోని 55 గ్రామాలు ఇప్పుడు సంతోషంతో చిరునవ్వు చిందిస్తున్నాయి. అక్కడి ప్రజలు సొంతంగా వ్యాపారాలు మొదలుపెట్టి గుర్తింపు పొందుతున్నారు. దీనికంతటికీ కారణమైన సోనాల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆమె గుజరాత్‌కు చెందిన సోనాల్ రోచాని. నెలకు లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగం. లగ్జరీ లైఫ్. వీటన్నింటినీ వదులుకొని కేవలం గిరిజనుల కోసం ప్రయాణం మొదలుపెట్టింది. ఒకరోజు నిండు గర్భిణి కిరోసిన్‌తో తడిసి ముద్దయి రక్షించండంటూ సోనాల్ వద్దకు వచ్చింది. మద్యం మత్తులో ఆమె భర్త ఇంతటి దారుణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోనాల్‌ను వెంటాడుతూనే ఉన్నది. ఈ సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వ సహాయంతో 2011 ఆగస్ట్‌లో 'శక్తి ఫౌండేషన్' స్థాపించింది. గిరిజన సంఘాలతో మాట్లాడి ప్రజలకు కొన్ని సదుపాయాలు కల్పించింది. 'కోద్వారా, సురత్' నగరంలోని ప్రజలకు హస్తకళలలను పరిచయం చేసి ఉపాధి కల్పించింది. ఇంతటితో సోనాల్ ఆగకుండా కొంతమంది వలంటీర్లతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కొన్ని పథకాలు ఏర్పాటు చేసింది. మొదటిది 'ప్రభుత్వ పథకం' అందరికీ అందాలి. దానికోసం ప్రతి ఒక్కరికీ గవర్నమెంట్ ప్రూఫ్ ఉండాలి. ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా ఇలా ప్రభుత్వ పథకాల ప్రత్యేకత తెలియజేసింది. అంగన్‌వాడి, వితంతువులకు పెన్షన్, రిటైర్‌మెంట్ పెన్షన్, ఆరోగ్యానికి సంబంధించిన పథకాలు అందరికీ అందేలా చేసింది. 'ఆరోగ్యం' పేరుతో సోనాలికి తెలిసిన ఫ్రెండ్స్, బంధువుల్లోని వైద్యుల సాయంతో అన్ని గ్రామాలకు ఉచిత వైద్యం అందించింది. స్కూల్లోని విద్యార్థులకు మంచి ఆహారం ఏర్పాటు చేస్తున్నది. ఈ సంస్థ ద్వారా 500 మంది ఆయుష్మాన్ భారత్ యోజన హెల్త్ బీమా పథకం కార్డు పొందారు. 'నెలవారీ పరిశుభ్రత' ఋతుక్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తున్నది. 'విద్య' పథకంతో 46 లోకల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించడంతో పాటు వలంటీర్లు చదువు కూడా చెబుతున్నారు. 'మిషన్ మంగళం' పథకంతో గుజరాత్ ప్రభుత్వం మహిళలకు కొన్ని రంగాలలో హస్తకళల శిక్షణ ఇస్తున్నది. వీరికి 5 లక్షల వరకు ఫండ్స్ ఇవ్వడానికి బ్యాంకు ఆదేశాలను జారీ చేసిందని సోనాల్ చెబుతున్నది. వచ్చిన డబ్బుతో వారు సొంతంగా అగర్బత్తీలు, హ్యాండ్‌క్రాఫ్ట్స్, బ్యూటీ పార్లర్, పాపడాల తయారీ వంటి పనులను బిజినెస్‌గా మార్చుకున్నారు. ఈ ఎనిమిదేండ్లలో గుజరాత్‌లోని 55 గ్రామాలకు పునర్జన్మ నిచ్చిన సోనాల్‌కు అక్కడి ప్రజలందరూ కృతజ్ఞతలు చెబుతున్నారు.

అతి అనర్థమే..

స్మార్ట్‌ఫోన్లకు చిన్నా పెద్ద అందరూ బానిసలయ్యారు. స్మార్ట్‌ఫోన్ కారణంగా అనేక అనారోగ్య సమస్యలు సైతం ఎదురవుతున్నాయి. అతి ఎప్పటికైనా అనర్థాలకు దారి తీస్తుంది. ఈ నేపథ్యంలో మెల్లిమెల్లిగా స్మార్ట్‌ఫోన్లను దూరం ఉంచితే సరిపోతుంది.

- చాలా రోజులుగా స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారు ఒక్కసారిగా ఆపేయడం కుదరని పని. అందుకని మెల్లగా ఫోన్ లేకుండా అర్ధగంట, గంటపాటు బయటకు వెళ్లడం అలవాటు చేసుకోవాలి. ఇలా రోజూ ప్రయత్నిస్తే అదే అలవాటుగా మారుతుంది. కొన్ని రోజులకు ఫోన్ లేకుండా గడపడం కూడా సాధ్యమవుతుంది.
- ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్ట్రాగ్రామ్ నోటిఫికేషన్లు అంత అత్యవసరం కాదు. ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు రాకుండా సెట్టింగ్స్ మార్చుకోవాలి. నోటిఫికేషన్స్ వల్ల చార్జింగ్ త్వరగా అయిపోతుంది. అంతేకాకుండా గ్రూపుల్లో వందలకు వందల మెసేజీలు చదివే వీలు ఉండదు కాబట్టి అవసరమైన మెసేజ్‌లు ఏమైనా ఉంటే పర్సనల్‌గా వాట్సప్ చేయమని మిత్రులకు ఓ మెసేజ్ పెట్టాలి.
- ప్రతిక్షణం విలువైందే. సోషల్ మీడియా, సెల్‌ఫోన్ గేమ్స్, వీడియోలు, ఆడియో సాంగ్స్ చాలామంది వీటన్నింటికీ అధిక సమయం వెచ్చిస్తుంటారు. రోజుకు కొంత సమయాన్ని కేటాయించి మాత్రమే సోషల్ మీడియాను వాడితే సమయాన్ని ఆదా చేసుకున్నట్లు అవుతుంది.
- నిద్రించే సమయంలో, పూజ గదిలోకి ఫోన్ తీసుకోకపోవడమే మంచిదనే నిబంధన పెట్టుకోవాలి. ఈ నిబందన కేవలం ఫోన్ వాడకాన్ని తగ్గించేదే అయినా మంచి ఫలితాల్నిస్తుంది. సెల్‌ఫోన్‌ను ఉదయం లేచిన వెంటనే చూడకూడదు. ఫోన్ కాంతి కిరణాల ప్రభావం కళ్లమీద పడి చూపు దెబ్బతింటుంది.
- ఫోన్ మన అవసరాల కోసం మాత్రమే అన్న విషయం మరిచిపోవద్దు. ఫోన్ వినియోగాన్ని తగ్గించడం మొదట్లో కాస్త ఇబ్బందిగానే అనిపించినా కొన్ని రోజులకు ప్రశాంతతను ఇస్తుంది. అత్యవసర సమయంలో మాత్రమే ఫోన్ వాడుతాను అనే నిబంధనతో మెదిలితే ఫోన్ వాడకం తగ్గుతుంది.

నమస్తే తెలంగాణ
విహారం
[కరీంనగర్]
శుక్రవారం 5 జూలై 2019

కుతుబ్‌షాహీ టూంబ్స్

దక్కన్ చారిత్రక వారసత్వమైన గోల్కొండ కీర్తి కిరీటంలోని కలికి తురాయి కుతుబ్‌షాహీ టూంబ్స్. మన చరిత్రకు సాక్షిగా నిలిచిన ఎత్తయిన గోపురాలతో అలరారే ఈ ప్రాంగణం ఇప్పుడు మరింత అందంగా దర్శనమిస్తున్నది. నాటి చరిత్ర, సంస్కృతి, గొప్పదనానికి ఆనవాళ్లుగా నిలిచే టూంబ్స్ రాష్ట్ర పురావస్తు శాఖ, ఆగాఖాన్ ట్రస్ట్ ఆఫ్ కల్చర్ చొరవతో కొత్త అందాలను సంతరించుకున్నాయి.

మన అందాలు

ప్రపంచంలోని సమాధి ప్రదేశాలన్నింటి కంటే కుతుబ్ షాహీ సమాధులే అతిపెద్ద ప్రదేశంగా గుర్తింపు పొందాయి. గోల్కొండను చూసేందుకు వచ్చిన పర్యాటకులెవరైనా తప్పక సందర్శించాల్సిన ప్రదేశమిది. ఇక్కడి కుతుబ్‌షాహీ రాజుల సమాధులు, మసీదులు, తారామతి, హుస్సేన్ షావలి సమాధులతో పాటు ఇతర నిర్మాణాలు పర్యాటకుల్ని మురిపిస్తాయి. ప్రపంచ వారసత్వాన్ని కాపాడుకునేందుకు పురావస్తు శాఖ, ఆగాఖాన్ ట్రస్ట్ ఆఫ్ కల్చర్‌లు కలిసి కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్ ప్రాజెక్టును చేపట్టాయి. టూంబ్స్ పరిరక్షణ కోసం శాస్త్రీయ పద్ధతిలో కృషి చేశారు. టూంబ్స్, మసీదులు, మార్చురీ బాత్, బడీ బౌలి నిర్మాణాలను పునరుద్ధరిస్తూ వీటి పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. అతిపెద్దదైన మెట్లబావి బడీ బౌలి. 400 ఏళ్ల క్రితం నిర్మితమైన ఈ బావి నీటి నిల్వ సామర్థ్యం 10 లక్షల లీటర్లు. బావికి రక్షణగా నిర్మించిన రాతి గోడ దెబ్బతినడంతో పాటు నిర్వహణ లోపం వల్ల బావిలోని నీళ్లు నాచుతో నిండిపోయాయి. 2013లో వచ్చిన వరదలతో బడీ బౌలిలోని కొన్ని నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. ఇప్పుడు ఈ బడీబౌలిని కూడా చక్కగా పునరుద్ధరించారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా 500 ఏళ్ల క్రితం నాటి ముడి పదార్థాలతోనే వన్నెలద్దారు. బెంగాలీ వృత్తి నిపుణులు అంగుళమంగుళమూ ప్రత్యేకత ఉండేలా శ్రద్ధ తీసుకున్నారు. చరిత్ర, సంస్కృతికి సంబంధించిన మానవీయ విలువలు వ్యక్తమవుతూ, ప్రపంచంలోనే ప్రకృతిలో కలిసిపోయేంత అత్యంత అద్భుతమైన నిర్మాణ సొగసును సొంతం చేసుకున్న ఈ సమాధులను వీక్షించడానికి అన్ని కాలాలూ అనుకూలమే.

సమ్‌థింగ్ స్పెషల్

దివ్యాంగుల కోసం...

పార్కు కు వెళ దామా అనగానే పిల్లలు ఎగిరి గంతులేస్తారు. మరి అంగవైకల్యంతో బాధ పడుతున్న పిల్లల పరిస్థితి ఏంటి? వాళ్ల కూ పార్కులో ఆడుకోవాలని ఉంటుంది కదా! అందుకే దివ్యాంగులైన పిల్లల కోసం చెన్నైలో ప్రత్యేకంగా ఓ పార్కును ఏర్పాటు చేశారు.

ఒక్కసారి ఆ పార్కులోకి అడుగుపెడితే కాళ్లు కదపలేని చిన్నారులు జారుడుబల్లపై ఆనందంగా ఆడుకుంటూ కనిపిస్తారు. చూపు లేని చిన్నారులు చేతులతో తడుముతూ వస్తువులను గుర్తుపడుతూ ఎగిరి గంతులేస్తుంటారు. దివ్యాంగులైన పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ పార్కులో కనిపించే దృశ్యాలివి. చెన్నైలో సిటీ కార్పొరేషన్ అధికారులు దివ్యాంగుల కోసం సెన్సరీ పార్కును ఏర్పాటు చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను నిర్వహించే కవితా కృష్ణమూర్తి అనే వ్యక్తి ఈ పార్కు ఏర్పాటు కోసం తీవ్రంగా శ్రమించారు. దీని కోసం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ రూ.1.5 కోట్లు వెచ్చించింది. దివ్యాంగులైన పిల్లల్లో సెన్సరీ ఆర్గాన్‌ల పనితీరును పెంచేందుకు ఈ పార్కు దోహదపడుతుంది. పార్కులో రెండుచోట్ల ప్రకాశవంతమైన రంగులతో బొమ్మలు వేసిన గోడలను ఏర్పాటు చేశారు. టైర్లు, బ్యాంగిల్స్, షెల్స్, ఇతర వస్తువులతో గోడను అందంగా డిజైన్ చేశారు. వీల్‌చైర్‌కు పరిమితమైన పిల్లలు సైతం ఆడుకునేందుకు ఇందులో కొన్ని ఏర్పాట్లు చేశారు. వీల్‌చైర్‌లో కూర్చుని బాస్కెట్‌బాల్ ఆడుకునే విధంగా కోర్టును ఏర్పాటు చేశారు. ఇసుక, గులకరాళ్లు, కలపతో కొన్ని దారులు ఏర్పాటు చేశారు. వాటిలో నడవడం ద్వారా పిల్లలు తెగ ఆనందపడిపోతున్నారు.

ప్రయాణవేళ జాగ్రత్తలు

విహారం అందులోనూ వానకాలపు ప్రయాణం చాలా జాగ్రత్తలతో కూడుకున్నది. ప్రణాళికపరంగా ఎంపిక చేసుకుంటే మంచిది. మనం వెళ్లే ప్రాంతాలను గురించి అక్కడి ఆహార పదార్థాలు, వాతావరణ స్థితిగతులు ముందే తెలుసుకుంటే మన విహారయాత్ర సుఖవంతంగా ఉంటుంది.

వానకాలంలో పర్యాటానికి వెళ్లాలనుకునేవారు ట్రావెల్‌బ్యాగ్‌లో దుస్తులతో పాటు వాటర్ బాటిళ్లు, మందులు, కెమెరా, టూర్ మ్యాప్ తప్పనిసరిగా ఉండాలి. టూరుకు వెళ్ళే వారు ముందుగా దుస్తులు, ఇతర వస్తువులు సక్రమంగా సర్దుకోవాలి. తక్కువ బరువు, ఎక్కువ వస్తువులు పట్టే లేటెస్టు బ్యాగులు తీసుకుంటే మంచిది. వర్షకాలం కనుక ఎక్కడ పడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. అందుకే వాటర్ బాటిళ్లు తీసుకెళ్లడం ఉత్తమం. ఇంకా కెమెరా, డైరీ, ప్లాస్క్,మెడికల్ కిట్,టూర్ మ్యాప్ వెంట ఉంచుకోవాలి. వర్షకాలంలో రెయిన్‌కోట్లు తప్పనిసరి.షూ వేసుకుంటే తడిసి ఆరకపోవడం వల్ల వాసన వచ్చే అవకాశం ఉంటుంది కనుక చెప్పులు బెటర్.రాత్రిపూట చలివేయకుండా బెడ్‌షీట్లు కూడా అవసరమే. స్మార్ట్, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లు తమ వెంట తీసుకెళ్తే అందులోని నేవిగేషన్ యాప్ ద్వారా వేళ్లే చోటుకు దారిని తెలుసుకోవచ్చు. తెలియని ప్రదేశానికి కూడా ఈయాప్ ఎంతో ఉపయోగపడుతుంది. వెళ్ళాల్సిన ప్రదేశాల గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఇలా చేయడం వల్ల సమయం ఆదా అవుతుంది. టూర్‌కు సరిపడా దుస్తులు తీసుకెళ్ళాలి. ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందులు తప్పవు.

చూడాల్సిన ప్రదేశం

ప్రకృతి ఒడిలో పరవశింపజేసే..

హోగెనక్కల్

ఆకాశం నుండి దూకుతున్నట్లుండే జల తరంగాల హోరు. మనసును పరవశింపచేసే ప్రకృతి అందాల జోరు. ఆధునిక ప్రపంచానికి సుదూరంగా, సహజత్వానికి చేరువగా ఉండి చూపరులను కళ్ళు చెదిరే తన్మయత్వానికి గురిచేసే అందాల జలపాతం 'హోగెనక్కల్.' దగ్గరకు వెళ్ళేవరకు ఆనవాలు కూడా కనిపించని ఈ జలపాతానికి కి.మీ. దూరంనుండే ఝుమ్మనే శబ్దం వినిపిస్తుంది. దగ్గరికీ వెళ్లాక మనల్ని మనమే మర్చిపోతాం. 'భారతీయ నయాగరా జలపాతం'గా పిలిచే ఈ జలపాతం అందాలను వానాకాలంలో చూసిన వారెవ్వరైనా ఆనందంతో తడిసిముద్దయిపోతారు. ఈ వానకాలం తప్పకుండా సందర్శించాల్సిన అందాల విడిది హోగెనక్కల్ వాటర్ పాల్స్ మీకోసం.

హోగెనక్కల్ జలపాతం కావేరీ నది ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది.. ఇది తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాలో ఉంటుంది. బెంగళూరు నుండి 180 కిలోమీటర్లు, ధర్మపురి నుండి 46 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. కార్బొనటైట్ రాళ్ళు దక్షిణాసియాలో, ప్రపంచంలోనే పురాతనమైనవిగా భావిస్తారు. ఆకాశం నుండి దూకుతున్నట్లుండే జలపాతం.. పర్యాటకులకు అమితానందాన్నిచ్చే అనుభూతుల నిలయం. వానకాలంలో ఈ జలపాతం అందాలను చూడడానికి వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. జలపాతం నుండి జాలువారే నీరు రాళ్ళమీద పడినప్పుడు లేచిన నీటి తుంపర్లు పొగలాగా కనిపిస్తుంటుంది. కన్నడంలో హోగె అనగా పొగ, కల్ అంటే రాయి కలిపి హోగెనక్కల్ అంటే పొగలు చిమ్మే రాయి లేదా మంచు తుంపరల నుండి వచ్చే శబ్దం అని అర్థం.

ఎన్నెన్నో జలపాతాలు

నిజానికి ఇక్కడ ఉన్నది ఒక జలపాతం కాదు. అనేక జలపాతాలు ఉన్నాయి. ఇవన్నీ 250 మీటర్ల ఎత్తు నుండి భూమి మీదకు దూకుతుంటాయి. వర్షపు నీరు కొండ వాలులో ప్రయాణించి హోగెనక్కల్ దగ్గర నదిలో కలుస్తుంది. ఈ వాటర్ ఫాల్స్ నీరు కావేరి డ్యాం బ్యాక్ వాటర్. కర్ణాటకలోని బ్రహ్మగిరి కొండలలో తలకావేరి వద్ద జన్మించిన కావేరీ నది తూర్పు దిక్కుగా ప్రవహిస్తుంది. కొండ వాలులో ప్రవాహవేగం పెరిగి పిల్లకాలువలతో కలిసి వడివడిగా ముందుకు సాగుతుంది. హోగెనక్కల్ చేరేసరికి కావేరీ నది చాలా విశాలంగా తయారై కొండ చరియల మీదుగా కిందికి జారుతూ.. జలపాతాల సమూహాన్ని తయారుచేస్తుంది. ఇక్కడి రెండు కొండలు ఒకే కొండ రెండుగా మధ్యకు నిలువునా చీలినట్లు ఉంటుంది. ఆ చీలికలోనే ప్రవాహం. ఆ ప్రవాహంలో పడవ ప్రయాణం సాహసమే. జలపాతంలోని నీరు దక్షిణంగా ప్రవహించి స్టాన్లీ జలాశయంలోకి చేరుతాయి. సుమారు 60 చ.మైళ్లు విస్తీర్ణంలో ఉన్న ఈ జలాశయంపై నిర్మించిన డ్యామ్ ద్వారా జల విద్యుత్తు ఉత్పత్తి అవుతున్నది. అలాగే పంట పొలాలకు సాగు నీరూ అందుతున్నది.

ఔషధగుణాల నీరు

హోగెనక్కల్ ఆరోగ్యపరంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నీటిలో స్నానం చేస్తే చర్మవ్యాధులు పోతాయంటారు. ఈ ప్రదేశం మసాజ్‌కు ప్రసిద్ధి. ఆయుర్వేద తైలాలతో చేసే మర్దనతో కీళ్లనొప్పులు, అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయంటారు. వేలాదిమంది ఈ జలపాతం కింద జలకాలాడుతారు. దానికనుగుణంగా ఇక్కడ వంతెనలు ఏర్పాటు చేశారు. ఇక్కడి స్థానికులకు ఆయుర్వేద తైలాల తయారీ ఓ కుటీర పరిశ్రమ.

చేపలు రుచి చూడాల్సిందే

హోగెనక్కల్ ట్రిప్‌లో మర్చిపోకుండా రుచి చూడాల్సింది ఒకటుంది. నదిలో చేపలు పట్టి అక్కడే కాల్చి ఇస్తారు. ఇక్కడి అందాలను చూడడానికి వచ్చే వారిలో చాలామంది ఈ చేపల రుచిని ఆస్వాదిస్తారు. జలపాతం హోరులో జలపుష్పాలను ఆరగిస్తుంటే.. ఆ రుచి మరెక్కడా లభించదనిపిస్తుంది. అరుదైన ప్రకృతి సోయగాలను సొంతం చేసుకున్న ఈ ప్రదేశంలో ఎంతసేపు ఉన్నా ఇంకా ఉండాలనే అనిపిస్తూ ఉంటుంది.

వానకాలంలో..

ఎండాకాలంలో, నీరు ఎక్కువగా లేని సమయంలో ఈ జలపాతంలో తెప్పలపై పయనిస్తారు. వానాకాలంలో నిపుణులైన మత్స్యకారుల సహాయంతో తెప్పల విహారం ఉంటుంది. అత్యంత సాహసంగా సాగే ఈ క్రీడలో వెదురు బద్దలతో తయారు చేసిన ఒక చిన్న బోటును ఉపయోగిస్తారు. హంపి సందర్శనకు వచ్చిన పర్యాటకులు నదిలో తెప్ప ప్రయాణం చేస్తారు. నదిలో తెప్పపై పయానిస్తూ.. హంపి శిథిలాలను చూడడం అద్భుతమైన అనుభూతి. అలల తాకిడి ఎక్కువగా ఉన్న చోట ఈ తెప్ప ప్రయాణం మరింత ఆనందం కలిగిస్తుంది.

ఎలా వెళ్లాలి?

తమిళనాడు రాష్ట్రంలో ఉన్నా.. బెంగళూరు నుంచి ఇక్కడికి చేరుకోవడం సులభం. బెంగళూరు వరకు విమానం, రైలు మార్గాల్లో చేరుకోవాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గం 180 కి.మీ. ఈ ప్రాంతానికి 115 కి.మీ దూరంలో ఉన్న సేలం వరకు రైలు మార్గం ద్వారా వెళ్లి అక్కడి నుంచి టాక్సీలో, బస్సులో హోగెనక్కల్ చేరుకోవచ్చు. బెంగళూరు నుండి 4గంటల్లో, చెన్నై నుంచి 6 గంటల్లో, సేలం నుంచి 2 గంటల్లో, ధర్మపురి నుంచి గంటలో చేరుకోవచ్చు. రోడ్డుకు రెండు వైపులా పచ్చటి తివాచీ పరిచినట్లుగా మల్బరీ తోటలు ఉంటాయి.

మధుకర్ వైద్యుల

అందాలను వీక్షిస్తూ

బెంగళూరు నుండి ఉదయం బయలు దేరి రాత్రికి తిరిగి బెంగళూరు చేరితే ట్రిప్ థ్రిల్‌గా ఉంటుంది. బెంగళూరులో బయలు దేరినప్పటి నుండి ఎంజాయ్‌మెంట్ మొదలైనట్లే. సిటీ దాటి గ్రామీణ ప్రాంతంలోకి దారి తీసినప్పటి నుండి ప్రకృతి సిద్ధమైన సహజ అందాలు ఒక్కొక్కటిగా కనువిందు చేస్తాయి. రోడ్డుకు రెండు వైపులా పచ్చటి మల్బరీ తోటలుంటాయి. ఇక్కడ పట్టుపురుగుల పెంపకం కేంద్రాలు ఎక్కువ. వెడల్పాటి ఆకులను సన్నగా కత్తిరించి పురుగులకు ఆహారంగా వేస్తుంటారు. సినిమాలు తీసేవాళ్ళు 'హోగెనక్కల్'ను రొమాంటిక్ పాటలు తీయడానికి ఎన్నుకుంటారు.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ముంబైలోని భారత ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఖాదీ & విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ (ఎస్సీ/ఎస్టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- గ్రూప్ బీ, గ్రూప్ సీ పోస్టులు
- **మొత్తం పోస్టులు:** 119
- **విభాగాలవారీగా ఖాళీలు:** అసిస్టెంట్ డైరెక్టర్-7, సీనియర్ ఎగ్జిక్యూటివ్-9, ఎగ్జిక్యూటివ్-53, జూనియర్ ఎగ్జిక్యూటివ్-37, అసిస్టెంట్-13
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, సీఏ, డిప్లొమా లేదా సంబంధిత సర్టిఫికెట్ కోర్సుల్లో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 31
- **ఆన్‌లైన్ ఎగ్జామ్:** ఆగస్టులో
- **వెబ్‌సైట్:** www.kvic.org.in

'నవోదయ'లో 2370 ఖాళీలు

నవోదయ విద్యాలయ సమితిలో పీజీటీ, టీజీటీ, లీగల్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- అసిస్టెంట్ కమిషనర్ (గ్రూప్-ఏ)
- **ఖాళీలు:** 5
- **అర్హతలు:** పీజీలో హ్యూమానిటీస్/సైన్స్ లేదా కామర్స్ ఉత్తీర్ణతతోపాటు లెవల్-10 పేస్కేల్ పోస్టులో కనీసం ఐదేండ్లు ప్రభుత్వ లేదా సెమీగవర్నమెంట్ లేదా అటానమస్ ఆర్గనైజేషన్‌లో పనిచేసి ఉండాలి.
- పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (గ్రూప్-బీ)
- **ఖాళీలు:** 439
- **అర్హతలు:** 40 ఏండ్లు మించకూడదు. కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణత. బీఈడీ, ఇంగ్లిష్, హిందీ మీడియంలలో బోధించగలిగే ప్రావీణ్యం ఉండాలి. పీజీటీ కంప్యూటర్ సైన్స్ పోస్టులకు టీజీటీగా పనిచేసిన అనుభవం, కంప్యూటర్ అప్లికేషన్ నాలెడ్జ్‌తోపాటు కనీసం 50 శాతం మార్కులతో కింది వాటిలో ఏదైనా ఒక అర్హత ఉండాలి.
- బీఈ/బీటెక్ (కంప్యూటర్‌సైన్స్/ఐటీ) లేదా బీఈ/బీటెక్ ఏ స్ట్రీమ్‌లోనైనా ఉత్తీర్ణతతోపాటు పీజీడీసీఏ లేదా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్/ఎంసీఏ లేదా బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తోపాటు పీజీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.
- ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్
- **ఖాళీలు:** 1154
- **అర్హతలు :** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతోపాటు బీఈడీ, సీటెట్‌లో అర్హత సాధించి ఉండాలి. హిందీ, ఇంగ్లిష్/స్థానిక భాషలో బోధించగలిగే సామర్థ్యం ఉండాలి.
- మ్యూజిక్-111, ఆర్ట్-130, పీఈటీ మేల్-148, పీఈటీ ఫిమేల్-105, లైబ్రేరియన్-70, స్టాఫ్ నర్స్-55, లీగల్ అసిస్టెంట్-1 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** పై పోస్టుల అర్హతలు వేర్వేరుగా ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ/పర్సనల్ ఇంటరాక్షన్ ద్వారా చేస్తారు.
- **పరీక్ష కేంద్రం:** రాష్ట్రంలో హైదరాబాద్‌లో ఉంది.
- **పీజీటీ పోస్టులకు:** రీజనింగ్ ఎబిలిటీ-15, జనరల్ అవేర్‌నెస్-15, టీచింగ్ ఆప్టిట్యూడ్-20, సంబంధిత సబ్జెక్టు-100 మార్కులతోపాటు లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌లో ఇంగ్లిష్, హిందీపై 30 ప్రశ్నలు ఇస్తారు. ఈ లాంగ్వేజ్ టెస్ట్ కేవలం క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. దీనిలో క్వాలిఫై అయితేనే మిగిలిన విభాగాలను పరిగణనలోకి తీసుకుంటారు. పరీక్ష కాలవ్యవధి మూడు గంటలు.
- **టీజీటీ పరీక్ష విధానం:** రీజనింగ్ ఎబిలిటీ-10, జనరల్ అవేర్‌నెస్-10, టీచింగ్ ఆప్టిట్యూడ్-15, సంబంధిత సబ్జెక్టు-100, లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ -45 మార్కులు. పరీక్ష కాలవ్యవధి మూడు గంటలు.
- మిగిలిన పోస్టుల ఎంపికకు నిర్వహించే పరీక్ష విధానాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూలై 10 నుంచి
- **చివరితేదీ:** ఆగస్టు 9
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఆగస్టు 12
- **పరీక్ష తేదీలు:** సెప్టెంబర్ 5-10
- **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

మజ్‌గావ్‌డాక్‌లో

భారత రక్షణ శాఖ పరిధిలోని మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్ లిమిటెడ్ (ఎండీఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న రిగ్గర్ & ఎలక్ట్రీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 366
- **విభాగాలవారీగా ఖాళీలు..**
- ఎలక్ట్రీషియన్-149 ఖాళీలు (జనరల్-101, ఈడబ్ల్యూఎస్-20, ఓబీసీ-57, ఎస్సీ-20, ఎస్టీ-19)
- రిగ్గర్-217 ఖాళీలు (జనరల్-66, ఈడబ్ల్యూఎస్-14, ఓబీసీ-39, ఎస్సీ-14, ఎస్టీ-12)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి ఎనిమిదో తరగతి, పదోతరగతితోపాటు ఎన్‌సీవీటీ లేదా ఎస్‌సీవీటీ సంస్థ నుంచి రిగ్గర్/ఎలక్ట్రీషియన్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.

- **వయస్సు:** 2019 జూలై 1 నాటికి 18 నుంచి 38 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ట్రెయినింగ్ పీరియడ్:** రెండేండ్లు
- **స్టయిఫండ్:** స్కిల్డ్ (గ్రేడ్-I) పోస్టులకు రూ. 17,000-64,360/-, సెమీ స్కిల్డ్ (గ్రేడ్-I) పోస్టులకు రూ.13,200-49,910/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 100/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 26
- **ఆన్‌లైన్ ఎగ్జామ్:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.mazagondock.gov.in

సీఎస్ఎంసీఆర్ఐలో

భావ్‌నగర్‌లోని సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం ఖాళీలు:** 9 (సైంటిస్ట్-7, సీనియర్ సైంటిస్ట్-2)
- **సైంటిస్ట్:** 32 ఏండ్లకు మించ రాదు. పే స్కేల్: రూ.90,688/-
- **సీనియర్ సైంటిస్ట్:** 37 ఏండ్లకు మించరాదు. పే స్కేల్: రూ. 1,04,896/-
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టు/బ్రాంచీలో ఎంఈ/ఎంటెక్ లేదా పీహెచ్‌డీ ఉండాలి.
- అప్లికేషన్ ఫీజు: రూ.100/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** www.csmcri.org

III.
నమస్తే తెలంగాణ
చింతన
[కరీంనగర్]
శుక్రవారం 5 జూలై 2019

పర్వదినాలు

- భద్రకాళి (వరంగల్) శాకాంబరి వేడుకలు (జూలై 3 నుంచి 16 వరకు)
- జిల్ ఖాద్ నెలారంభం (నేడు)
- బోనాలు (జూలై 4 నుంచి 28 వరకు)
- కుమార షష్ఠి (7వ తేది)
- శుక్రమౌఢ్యారంభం (8వ తేది)

భక్తి మార్గం

భక్తునికీ భగవంతుని స్థాయి!

'భక్త్యా భాగవతం జ్ఞేయం/ నవ్యుత్పత్తి నటీకయా' అన్నది శ్రీమద్భాగవత వచనం. పాండిత్య ప్రతిభ, టీకా తాత్పర్యాలకన్నా భక్తి మాత్రమే ప్రధానమన్న దృక్పథమే భాగవత వైశిష్ట్యాన్ని రెండింతలు చేసింది. దీన్నే తెలుగులో పోతన 'భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు' అన్నాడు. ఫలితంగా దీన్ని తెలుసుకోవాల్సిన జిజ్ఞాస కలుగుతుంది. నిజానికి తెలుసుకోవలసింది లోక కల్యాణం అన్నదే అసలైన భాగవత తత్త్వం. అదే భగవద్భక్తి కూడా. ఆ భక్తే భాగవతాన్ని తెలుసుకోవడానికి కీలకం.

భగవంతుడు విరాట్ పురుషుడు. అతడే సమాజ స్వరూపుడు కూడా. అతడే సర్వజీవ కోటి ప్రాణరూపుడు. అతనిపై భక్తిని కలిగించే ఆధ్యాత్మిక గ్రంథమే శ్రీ మహాభాగవతం. ఇది నేటి సమాజానికి అవసరమైన ఈశ్వర లక్షణాన్ని, తత్వాన్ని అద్భుతంగా తెలిపింది. ఒక్కమాటలో చెప్పాలంటే, భాగవతం భగవంతునితో సమానస్థాయిని భక్తునికి కూడా కల్పించింది. భాగవత సంప్రదాయంలో భక్తుడు, భగవంతుడు ఒకే స్థాయి వారన్న భావన ఇంచుమించు స్థిరపడింది. కులమత వర్గాలకు అతీతమైన కల్మషం లేని, స్ఫటికం వంటి భక్తే ప్రధానమన్న సందేశాన్ని ఈ మహద్రంథం సమాజానికి ఇచ్చింది.

- గన్నమరాజు గిరిజా మనోహరబాబు

మల్లాది వెంకట కృష్ణమూర్తి | **తీర్థయాత్ర** | 11

నర్మద పరిక్రమ

మహాత్ముల సమాధుల వద్ద నిద్ర!

(గత సంచిక తరువాయి)

దేశాయ్ నన్ను పిలిచి సమాధులను శుభ్రం చేయమని, 'అది సుకార్యం' అని చెప్పారు. నిజానికి నేను గోవిందస్వామి సమాధి పక్కనే కూర్చుని జపం చేసుకోవాలని అనుకొన్నాను. కానీ, 'అవి గోవిందస్వామి మాటలు'గా భావించాను. అప్పటికే ప్రసన్న బక్కెట్‌తో నీళ్లు, పాతబట్టని తెచ్చి ఓ సమాధిని శుభ్రం చేస్తున్నారు. అతను ప్రభు మిత్రుడు. మితభాషి, ముప్పై అయిదేళ్లుంటాయి. బ్రహ్మచారి. చెప్పులు వాడరు. ఇతరులకు సేవ చేయడంలో ముందుంటారు. నడవ లేని మిసెస్ కపాలిని చెయ్యి పట్టుకొని అనేక చోట్ల నడిపించి తీసుకువెళ్లారు. నిత్యం వడ్డనలో పాలు పంచుకొన్నారు. పెద్దగా చదువుకోలేదు. ఇంగ్లిష్ రాదు. మా అందరిలోకి నాకు అతని మొహంలోనే తేజస్సు స్పష్టంగా కనిపించింది.

'సమాధులను శుభ్రం చేయడంలో నేను కూడా భాగం పంచుకుంటానని' అతనితో చెప్పాను. అతనికి ఈ పని కొట్టిన పిండి. తన గురువు ఆశ్రమంలో అతనికి ఈ రకం సేవ అలవాటే. బక్కెట్‌తో బట్టని తడిపి, దాన్ని నేలమీద ఉంచి, వంగుని ఆ బట్ట అంచులని రెండువైపులా రెండు చేతులతో పట్టుకొని, కాళ్లమీద వెనక్కి నడుస్తూ తడిబట్టతో కింది నేలను శుభ్రం చేయాలి. అలా కుడివైపు అంతా శుభ్రం చేసి, ఆ బట్టని బక్కెట్‌లో ముంచి మురికి నీళ్లను పిండేసి, నాకు ఇచ్చి 'ఎడమవైపు భాగాన్ని నన్ను శుభ్రపరచ'మన్నారు.

అలవాటు లేని పని కాబట్టి, అది శారీరకంగా ఎంతో కష్టం అనిపించినా నా భాగాన్ని శుభ్రపరిచాను. వాసన వేసే అనేక రెక్కల పురుగులు నేలమీద పడి ఉన్నాయి. వాటి వాసన ఆ బట్టకు, నా చేతులకు అంటుకుంది. మధ్యమధ్యలో ఆ బట్టని బక్కెట్‌లో ముంచి, పిండేసి తిరిగి నేలను తుడవాలి.

గోవింద స్వామి సమాధి సమీపంలో నిద్ర చేయడం ఈ యాత్రలో మాకు బోనస్. మహాత్ముల సమాధి దగ్గర నిద్రించడం మంచిదని దత్త సాంప్రదాయులు నమ్ముతారు.

ఆ సమాధిని శుభ్రం చేశాక ప్రసన్న మురికినీళ్లను పారపోసి బయట పంపులోంచి కొత్త నీటిని పట్టాక, రెండో సమాధి దగ్గరకు వెళ్లాం. అక్కడా ఇద్దరం ఇదే విధంగా సమాధి నేలను శుభ్రం చేశాం. ఆ తర్వాత గోవింద స్వామి సమాధి దగ్గరకు వెళ్లి దాన్నీ శుభ్రం చేశాం. పని పూర్తయ్యాక అతను బక్కెట్, బట్టతో వెళ్లిపోయారు. నేను చేతులు కడుక్కొని అక్కడ కూర్చుని, గంటన్నర దాకా శివపంచాక్షరి మంత్ర జపం చేసుకొన్నాను.

రాత్రి భోజనంగా అన్నం, చపాతీలు, దొండకాయ కూర, కొబ్బరిపొడి, మజ్జిగ పులుసు ఇచ్చారు. 'తన పూర్వీకులు కొంకణి ప్రాంతం నుంచి ముంబైకి వచ్చారని, కొంకణి సంప్రదాయం ప్రకారం వంటలో కొబ్బరిని అధికంగా వాడతామని' దేశాయ్ చెప్పారు. గోవింద స్వామి సమాధి సమీపంలో నిద్ర చేయడం ఈ యాత్రలో మాకు బోనస్. మహాత్ముల సమాధి దగ్గర నిద్రించడం మంచిదని దత్త సాంప్రదాయులు నమ్ముతారు.

అక్టోబర్ 20, 2008. సోమవారం: రెండోరోజు

ఉదయం నాలుగున్నరకు నిద్ర లేచాను. ఏ ఆశ్రమాల్లోనైనా పొదుపు అంతా సాధారణంగా వారి బాత్‌రూమ్‌లలోనే కనిపిస్తుంది. అక్కడ ఉన్నవి రెండే బాత్‌రూమ్‌లు. వాటిలో జీరో వాల్ట్ బల్బులే వెలుగుతున్నాయి. మా దగ్గర దేశాయ్ ఈ యాత్రకు భోజనం, బసకు కలిపి ఒక్కొక్కరి వద్ద పన్నెండు వేల రూపాయల చొప్పున వసూలు చేశారు. 'రాత్రి బస చేసినందుకు గోవింద స్వామి సంస్థానానికి తను ఇచ్చేది ఇచ్చానని, అంతా తమకు తోచిన విరాళం ఇస్తే బావుంటుందని' దేశాయ్ సూచించారు. అందరితోపాటు మేం కూడా తలో ఏభై రూపాయలు ఇచ్చాం. దేశాయ్ వసూలైన ఆ మొత్తాన్ని వాళ్లకు ఇచ్చి వచ్చారు.

ఉదయం ఆరుకి బస్సెక్కాం. ముందు చెప్పిన సీటింగ్ నియమం ప్రకారం వెంకటేశ్వరరావు, నేను బస్‌లో ఓ వరుస ముందుకి జరిగి కూర్చున్నాం. దేశాయ్ సాధారణంగా అందరికన్నా ముందు బస్సు దిగి, చివరగా ఎక్కుతారు. బస్ బయలుదేరబోయే ముందు దేశాయ్ ఆ రోజు కార్యక్రమం వివరించారు. ఆ రోజు మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాం. అక్కడ 'సరిహద్దు చెక్‌పోస్ట్‌లో లంచాలతాకిడి అధికం అని, ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో మరీ అధికమని' దేశాయ్ వాపోయారు. మా బస్‌లో సీట్లు రెండు అటు– రెండు ఇటు చొప్పున వరుసకు నాలుగు సీట్లు. రెండు అటు– మూడు ఇటు అంటే వరుసకి అయిదుగా ఉండే బస్‌లకు ట్యాక్సు తక్కువని, మా బస్‌కి ఎక్కువని చెప్పారు.

* * *

'ఓం నర్మదే హర' అన్న అందరి స్మరణతో బస్ బయలుదేరింది. ఉదయం ఏడున్నరకు బస్‌ని రోడ్డుపక్క ఆపారు. పనివాళ్లు ఇద్దరూ బ్రేక్‌ఫాస్ట్ ఐటమ్స్‌తో కిందికి దిగారు. మిసెల్ (మిక్చర్)ని ఇచ్చారు. ముంబైనుంచి కొని తెచ్చిన మిక్చర్‌మీద ఉడికించిన బఠాణీలు, ఉల్లిపాయ ముక్కలు చల్లి, నిమ్మరసం పిండి దాన్ని మిసెల్ పేరుతో మహారాష్ట్రులు స్నాక్‌గా తింటారు. అక్కడి హోటళ్లలో ఇది సర్వ్ చేస్తారు. మా యాత్రలో రోజూ పుష్పమాసి తెల్లవారు ఝామునే లేచి బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం వండి బస్‌లోకి ఎక్కిస్తుంది.

–సశేషం

బోనాలమ్మకు జేజేలు!

వేళా విశేషం | మహా నైవేద్యమే ప్రాణంగా బోనాల తల్లి వస్తున్నది!

బిడ్డలమీద తల్లికి, తల్లిపైన పిల్లలకు ఉండేంత ప్రేమ లోకంలో మరేదీ ఉండదు. పెనిమిటితో పాటు ఇంటికంతటికీ పెద్దదిక్కు అమ్మ. ఇండ్ల తోపాటు వాడలను, ఊళ్లనే కాదు, సమస్త లోకాలనే పాలించే జగదాంబ బోనాల తల్లి. అభం శుభం తెలియని ఆడబిడ్డలు, పెద్ద ముత్తయిదువుల నుంచి భక్తిని, శ్రద్ధను మాత్రమే కోరుకొనే కొంగుబంగారం ఆమె! నాలుగు అన్నం మెతుకులే ఆమెకు మహా నైవేద్యం. పల్లెలు, పట్నాలనుంచి మహానగరాల నడిబొడ్ల దాకా వేపకొమ్మలే తోరణాలుగా, పసుపు కుంకుమలే సర్వాభరణాలుగా ఆ అమ్మలగన్నయమ్మ బైలెల్లి వస్తున్నది. ఏడాది కొకసారి నల్లమబ్బుల వెంట నడిచొచ్చే ఆషాఢ తల్లి.. మాయరోగాల రాకాసి పాలిట తిరుగులేని విశ్వశక్తి. ఈ బోనాల (భోజన నైవేద్యం) జాతరల వేళ భారతీయాత్మకు ప్రతీకలైన గ్రామదేవతలపై ప్రత్యేక కథనం.

గ్రామాలలో వెలసి, అక్కడి ప్రజలందరినీ కన్నబిడ్డల్లా ఆదరించే వారు కాబట్టే, వారిని 'గ్రామదేవతలు' అన్నారు. ఏ పేరుతో కొలిచినా అందరు అమ్మలను గన్న మూలపుటమ్మ ఒక్కతే. ఆ మహాతల్లి (ప్రకృతి) అనుగ్రహం వల్లే దేశమంతా ముఖ్యంగా పల్లెసీమల్లో పశుసంపద రక్షింపబడి, పంటపొలాల్లో పచ్చదనం వెల్లివిరుస్తుందని, ఫలితంగా రైతుల ఇండ్లలో ధాన్యరాశులు సమకూరుతాయన్నది ప్రజల ప్రగాఢ విశ్వాసం. 'ఆమె చల్లని చూపు లేకపోతే అతివృష్టి, అనావృష్టి, అంటువ్యాధుల వ్యాప్తి, ఆకస్మిక మరణాలు సంభవించవచ్చు. ప్రకృతి విధ్వంసాలతో సర్వం నాశనమయ్యే మహాదుస్థితీ నెలకొనవచ్చు' అన్న భయం, ఆందోళన నిజానికి నిన్న మొన్నటిది కాదు. అనాదిగా వస్తున్నదే.

దీని నుంచి తేలిగ్గా బయటపడి, అమ్మవార్ల కరుణా కటాక్షాలను పొందడానికి కొందరు ఏకంగా దున్నపోతులు, గొర్రెలు, మేకలు, కోళ్లను బలిచ్చే (నైవేద్యం) ఆచారమూ చాన్నాళ్లపాటు కొనసాగింది. మన దేశంలో 'జంతుబలి నిషేధం' తర్వాత ఈ సంప్రదాయం నిలిచిపోయింది. గ్రామదేవతలకు 'సాత్విక నైవేద్యాన్ని' (నీరు, బియ్యం, అన్నం, పాలు, పెరుగు, బెల్లం, ఖర్జూరాలు వంటివి) కొత్త కుండలను బోనాలుగా చేసుకొని, వాటిలో తీసుకెళ్లి అమ్మవార్లకు పెట్టడం గత కొన్ని శతాబ్దాల నుంచీ కొనసాగుతున్నది. మట్టి కుండలు లేదా స్టెయిన్‌లెస్ స్టీలు వంటి లోహాల గుండ్రని పాత్రలను పసుపు కుంకుమలతో అలంకరించి, వాటిలో అమ్మవార్లకు 'భోజనం' సమర్పించడమే 'బోనాలు' ఉత్సవంగా రూపాంతరం చెందింది. బోనాల కుండలపైన జ్యోతులనూ ఉంచి తలపై పెట్టుకొని చెప్పులు లేకుండా గ్రామదేవతల గుడివరకూ కేవలం మహిళలే మోసుకెళతారు. ఇలా బోనాలను తీసుకెళ్లే ఆడవారిని దేవతా ప్రతీకలుగా భావిస్తారు.

గ్రామదేవతలపై గల భయభక్తులకు తోడు మొక్కులు ఫలిస్తుండడంతో కాలక్రమంగా ప్రజలు తమ సంతానానికి వారి పేర్లు పెట్టుకోవడం మొదలైంది. ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ, బీరమ్మ అనేవి స్త్రీల పేర్లయితే ఎల్లయ్య, మైసయ్య, పోచయ్య, బీరయ్య అనేవి పురుషుల పేర్లు. ఇలా కూడా తమ దేవతలకు గ్రామీణులు మరింత దగ్గరయ్యారు. ప్రజలు తాము నివసించే చోటనే ఉన్నంతలో చిన్న గుడి కట్టుకొని దేవతారాధన చేయడానికి అలవాటు పడ్డారు. మొదట్లో ఊరవతల, ఎలాంటి హంగులు, ఆర్భాటాలు, గుడి గోపురాలు లేకుండా, రూపం లేని కొయ్య బొమ్మ, బండల ఆకారాలలోనే అమ్మవార్లు భక్తులతో పూజలు అందుకొనే వారు. తర్వాత్తర్వాత పలు ఆకారాలను సంతరించుకొన్నాయి. బియ్యం, పసుపు, కుంకుమలు, వేపాకులే వీరికి పూజా సామగ్రి. ఇంతకు మించి పెద్ద పెద్ద ఆరాధనలు, అర్చనలు, వాటికయ్యే వ్యయాలు వంటివేవీ వుండవు.

జానపద సాహిత్యంలో గ్రామదేవతల కథలు అసంఖ్యాకంగా ఉన్నాయి. మైసమ్మ మహిష దేవత. పశుసంపదను కాపాడే అమ్మవారుగా ఈమె పేరు పడింది. పశువుల పాకలోనే ఒక గూడుకు తెల్ల సున్నం వేసి కుంకుమతో అలంకరించి, దానిని 'మైసమ్మ గూడు' (నిలయం)గా పిలుచుకొంటారు. చెరువు కట్టమీద ఒక బండరూపంలో నిలిపిన అమ్మవారును 'నీటి దేవత' లేదా 'కట్ట మైసమ్మ'గా కొలుస్తారు. అప్పట్లో రాజులు, సంస్థానాల కాలంలో కోట పక్కన కొలువుండే అమ్మవారును 'కోట మైసమ్మ'గా, గడిలో పూజలు అందుకొనే తల్లిని 'గడి మైసమ్మ'గా పిలువడం పరిపాటి అయ్యింది. పశువులకు రోగాలు వచ్చినపుడు మైసమ్మ ఉత్సవాలు జరుపుకోవడమూ ఆనవాయితీగా వస్తున్నది.

ఎల్లరను బ్రోచే అమ్మ కనుక సదరు దేవత 'ఎల్లమ్మ'

సంరక్షకుడు పోతురాజు!

ఒకనాటి మాతృస్వామిక సమాజంలో గ్రామదేవతలు పూజలు అందుకొనే విధానం చాలా సహజంగా ఉండేది. పోచమ్మ, మైసమ్మ, ఉప్పలమ్మ, ఎల్లమ్మ, బాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ అనే ఈ ఏడుగురు (అక్కచెల్లెళ్లు) ప్రధాన గ్రామదేవతలు కాగా, వీరికి ప్రతీకలుగా మరెందరో అమ్మవార్లూ ఉన్నారు. పోతురాజును వీరందరి ప్రతినిధిగా, ప్రజల సంరక్షకుడుగా తలుస్తారు. గ్రామంలోని బొడ్రాయిని ఈయన రూపంగానే కొలుస్తారు. ఎన్ని కష్టాలు వచ్చినా తాను ఊరిని కాపాడతాడనీ నమ్ముతారు. కాకతీయుల కాలంలో ప్రతి గడిలోను కనిపించే సప్తమాతృకలు గ్రామదేవతలకు ప్రతిరూపాలేనని చరిత్రకారులు చెప్తారు. వారి కాలంలోనే వీరికి ప్రత్యేక పూజలు, రూపాలు వచ్చినట్లు తెలుస్తున్నది. అంతకు ముందు కాలంలో గ్రామదేవతలకు ప్రత్యేకమైన గుళ్లు లేవు. చెట్లకింద, చెరువులు, పొలాల గట్లమీద వారికి 'చిన్న గుళ్లు' ఏర్పరిచేవారు. రెండుపక్కల రెండు రాళ్లు పెట్టి, పైన మరొక రాయి కప్పులాగా ఉంచి, దాన్నే 'గుడి'లా భావించారు. పలు పేర్లతో పిలిచే గ్రామదేవతలకు మొదట్లో ప్రత్యేక ఆకారాలు, విగ్రహాలూ ఉండేవి కావు. ఇప్పుడు పట్టణాలు, నగరాలలోనూ ఈ దేవతలు అద్భుత రూపురేఖలతో వెలియడమేకాక ఇతర హైందవ దేవాలయాలతో పోటీ పడుతూ అక్కడి అమ్మవార్లు పూజలు, పురస్కారాలు అందుకొంటుండడం విశేషం.

అయ్యింది. ఆమెకు మాహూరమ్మ, అక్కలదేవి, రేణుకాదేవి, ఏకవీర వంటి పేర్లున్నాయి. బైండ్ల వారు జమిడికలను వాయిస్తూ 'ఎల్లమ్మ కథలు' చెబుతారు. ప్రసిద్ధ నాటక గ్రంథం 'క్రీడాభిరామం' (రచయిత: శ్రీనాథుడు/ వినుకొండ వల్లభరాయుడు)లో 'కాకతమ్మకు పైదోడు ఏకవీర' అనే వర్ణన ఉన్నట్టు, ఆ దేవతనే రేణుక అని తెలుస్తున్నది. తండ్రి జమదగ్ని ఆదేశం మేరకు కొడుకు పరశురాముడు తల్లి రేణుక శిరసును నరికిన కథ ఒకటి ఇందులో చదువుతాం. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని మాహుర్ అనే ఊర్లో ఈ అమ్మవారు (రేణుక) నెలకొనడం వల్ల ఆమెకు 'మాహూరమ్మ' అనే పేరు వచ్చినట్లు తెలుస్తున్నది. రేణుక గౌడులను, వారి జీవనాధారమైన తాటి వనాన్ని రక్షిస్తుంది. కనుకనే, వారు ఆ అమ్మవారును తమ కులదేవతగా భావించి, పండుగ చేసుకొంటారు.

ఊరి ప్రజలు 'పోచమ్మ' దేవతను మశూచి వ్యాధిని నిర్మూలించే 'దేవతా శక్తి'గా కొలుస్తారు. ఈ అంటువ్యాధికి శాస్త్రీయ కారణమేదైనా, పిల్లలకు, యుక్తవయసు వారికి ఇది ప్రబలినపుడు ఆ దేవతకు ఇంటినుండి కల్లు పోయిస్తమని వారు మొక్కుకుంటారు. మశూచి సోకితే 'పోచమ్మే కాపాడాలి' అని వేడుకొంటారు. దీనికి ఆధునిక ఔషధాలు వాడక వేపాకులను పై పూతగా వాడితే పోచమ్మ తల్లి దయతో కొన్నాళ్లకు తగ్గిపోతుందని ప్రజలు బలంగా నమ్ముతారు. ఇదే క్రమంలో పిల్లలను కాపాడే దేవతగా బాలమ్మను కొలుస్తారు. చాలామంది ఇండ్లలో జరిగే పెండ్లికి ముందు రోజు, కాబోయే వధూవరులతో పోచమ్మకు బోనాలతో వెళ్లి అర్చించడమో లేదా మొక్కులు ఇప్పించడమో అనేకమందికి వంశాచారంగా వస్తున్నది. దీన్ని 'పోచమ్మకు చేసుకొనుడు'గా వ్యవహరిస్తారు. ఇక, ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో జరిపే 'బోనాల పండుగ' ప్రత్యేకించి మన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుప్రసిద్ధమైంది. ఇలాంటి గ్రామదేవతల పండుగలకు హైదరాబాద్ తదితర ప్రాంతాలలోని ప్రముఖ అమ్మవార్ల దేవాలయాలు, పెద్దమ్మ గుడి ప్రధాన స్థావరాలుగా ఉంటున్నాయి.

'పోచమ్మ'ను వేయికండ్ల దేవత అంటారు. బద్ది పోచమ్మ, నల్ల పోచమ్మ, అంబడి పోచమ్మ పేర్లతో ముగ్గురు అమ్మవార్లు వున్నారు. వీరిలో నల్ల పోచమ్మను దుష్టుల పాలిట భయంకర శక్తిగా చెప్తారు. గ్రామదేవతలు ఎక్కడ, ఏ రూపంలో కొలువైనా వారంతా సాక్షాత్ జగదాంబ, ఆదిపరాశక్తికి ప్రతిరూపాలుగానే భావించాలని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. భారతీయ సంప్రదాయం ప్రకారం, ప్రత్యేకించి తెలంగాణలో పోచమ్మకు చేసుకొనే వేళ ప్రతీ కుటుంబంలో సభ్యులందరూ ఎక్కడున్నా ఒక్కచోటుకు వచ్చి జరుపుకోవడం విశేషం. ఇలా అందరినీ ఒక్కచోటుకు చేరుస్తున్న పండుగగాను బోనాలు వేడుకలను చెప్పుకోవాలి. ముఖ్యంగా ఈ నెల్లాళ్లూ ఊళ్లు, వాడలూ ఒక్కటైనట్లుగా, అమ్మవారి గుడిదాక మహిళామణులు తలపై పవిత్ర పాత్రలతో ఊరేగింపుగా వెళ్ళే దృశ్యం అపురూపం.

-డా॥ బి.వి.ఎన్.స్వామి
సెల్: 92478 17732

మంచిమాట

ధ్యానం మూర్ఖుల్ని ఋషులుగా మారుస్తుంది. కానీ, దురదృష్టవశాత్తు మూర్ఖులు ధ్యానం చేయరు!

-స్వామి వివేకానంద

* జూలై 4 వర్ధంతి

వరుణ రక్ష!

జీవన వేదం

అధిదేవతలలో ఒకడైన వరుణుడు భూమిని అత్యంత సమీపం నుంచి రక్షిస్తూ ఉంటాడు. సూర్యప్రచండ తాపం వరుణుని కరుణ వల్లే వర్షరూపంలో కరిగిపోతుంది. వరుణుడు కూడా పరమేశ్వరుని అంశనుంచి పుట్టినవాడే. వరుణసేవ పరమేశ్వర ఆరాధనతో సమానం. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలన్నింట్లోనూ, పృథ్వీ, జలం, అగ్ని, వాయువు, ఆకాశాలలోనూ సకలసృష్టి అంతటా వ్యాపించి వున్న సర్వవ్యాపి పరమాత్మే పరమేశ్వరుడు. ఆయన అవతారమే అయిన వరుణుడూ సర్వవ్యాపకుడే. అతడు పరమేశ్వరుడంతటి సేవకుడు, సకల నియంత కూడా. పీడనలను తొలగించేవాడు. దివ్యగుణాలు కలిగి ఉండేవారిలో 'వరుణ దయ' (రక్ష) కొలువై ఉంటుంది. సమస్త మానవాళికి పూజ్యనీయుడు. సత్పురుషులు, విద్వాంసులు దీనిని గుర్తెరిగి వరుణ సాక్షాత్కారం కోసం ప్రయత్నించాలి.

- అథర్వవేదం

ఆడబిడ్డల ప్రేమ

పద్యనీతి

అత్తవారింట సకల భాగ్యంబు లున్న,
మగని మీదట తనకెంత మక్కు వున్న
నాడుబుట్టువు పుట్టింటికి కాసపడును
గావున సుభద్ర యొకతీరుగాగ నుండె.

- చేమకూర వేంకటకవి
('విజయ విలాసం')

ప్రతీ ఆడపడచుకూ అత్తవారింట్లో ఎంత సుఖసంతోషాలతో ఉంటున్నప్పటికీ వారికి పుట్టినింటి మీద ఉండే మమకారం ఎంత మాత్రం తగ్గదు. ఆఖరకు భర్తకూడా తనను ఎంత బాగా ఆదరిస్తున్నా సరే. ఇది లోకరీతి. దీనికి నిదర్శనంగానే సుభద్రాదేవి (అర్జునుని భార్య, శ్రీ కృష్ణుని చెల్లెలు) అత్తవారింటికి వెళ్లేప్పుడు అలా ముభావంగా ఉన్నది.

సుడోకు

డైలీ సుడోకు 81 సమాధానం

7	6	1	2	4	9	5	8	3
9	3	2	8	7	5	1	4	6
8	5	4	1	6	3	2	9	7
5	1	9	3	2	4	6	7	8
3	4	7	5	8	6	9	2	1
2	8	6	9	1	7	3	5	4
4	2	3	7	5	1	8	6	9
6	9	8	4	3	2	7	1	5
1	7	5	6	9	8	4	3	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -82

6								3
1		8	5				9	
	5					1		
7	4	9		3		6		
			4		6			
		6		8		9	4	1
		2					8	
	6				9	4		7
4								9

ట్వీట్

విజయ్ మాల్యా
@TheVijayMallya

కింగ్‌ఫిషర్ ఏయిర్‌లైన్స్ తీసుకున్న బ్యాంకు రుణం మొత్తం తిరిగి చెల్లిస్తాను. ఉద్యోగుల వేతనాలు కూడా చెల్లిస్తాను. నేను రుణం తీసుకున్న వ్యక్తులకు కూడా చెల్లిస్తాను. నా వ్యాపారంలో ముందుకు సాగుతాను.

విజయ్ మాల్యాను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

5,956,024

కామన్‌మ్యాన్ వాయిస్

ధైర్యం మరణించదు. ఎన్నటికీ అది జ్ఞాపకమై మారుమోగుతూనే ఉంటుంది. జోహార్ అల్లూరి.
– రమణరాజు భూపతిరాజు

కోహ్లీ కెప్టెన్ తరహాలో ప్రవర్తించలేదు. అనుభవము, ఫామ్‌లో ఉన్న రాయుడిని కాదని ఒక్క మ్యాచ్ కూడా ఆడని మయాంక్ అగర్వాల్‌ని WC కి సెలెక్ట్ చేయడం దారుణం.
– Satish Gadagoju

అనుభవం అంటే భూమి పుట్టకముందు పుట్టడం కాదు. ఏదైనా మాట్లాడేముందు ఎదుటి మనిషి మనసు నొచ్చుకోకుండా ఆలోచించి మాట్లాడే బుద్ధి ఉండడం. ఆ బుద్ధి లేనప్పుడు ఎంత వయసున్నా వ్యర్థమే.
– Sahithi Priya

వైరల్ వీడియో

రామ్ నటించిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమా ట్రైలర్ యూట్యూబ్‌లో సందడి చేస్తూ ట్రెండింగ్ లిస్ట్‌లో నెంబర్‌వన్‌గా నిలిచింది.

Ismart Shankar Theatrical Trailer | Ram Pothineni, Nidhhi Agerwal, Nabha Natesh | Puri Jagannadh

Total views : 3,962,366+
Published on Jul 3, 2019

యువత సంఘర్షణ

అప్పిరెడ్డి, సాయిరోనక్, ప్రీతి, సుజై, సుశీల్

సాయిరోనక్, ప్రీతి అష్రాని జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రెజర్ కుక్కర్'. సుజై, సుశీల్ దర్శకత్వం వహిస్తూ అప్పిరెడ్డితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'నువ్వు అయిపోతావురా..' అనే ప్రమోషనల్ సాంగ్‌ను బుధవారం హైదరాబాద్‌లో హీరో సందీప్‌కిషన్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'విభిన్నమైన సాహిత్యంతో పాట కొత్తగా ఉంది. టైటిల్ మాదిరిగానే సినిమాను వినూత్న కథ, కథనాలతో తెరకెక్కించినట్లు కనిపిస్తున్నది' అని తెలిపారు. దర్శకద్వయం మాట్లాడుతూ 'యువతరం మనోభావాలకు దర్పణంలా ఉంటుంది. చక్కటి సందేశంతో రూపొందిస్తున్నాం. చదువుకునే వయసులో, చదువు పూర్తయ్యాక యువత ఎదుర్కొనే సంఘర్షణకు దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. జీవితగమనంలో తనకు ఎదురైన సమస్యలను ఓ యువకుడు ఎలా చక్కదిద్దాడన్నది ఆకట్టుకుంటుంది. పాటలన్నీ బాగుంటాయి' అని చెప్పారు. తెలంగాణ వాడుక భాషలో సమకూర్చిన పాట ఇదని, అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉందని సంగీత దర్శకుడు రాహుల్ సిప్లిగంజ్ పేర్కొన్నారు. అప్పిరెడ్డి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

కటౌట్‌లు కాదు.. కలెక్షన్‌లు కావాలి!

సమంత

'ప్రతి సినిమా నాకు ఓ పరీక్షే. నా కోసం ఎంత మంది థియేటర్‌కు వస్తారన్న విషయంలో ఇంకా స్పష్టతలేదు. ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే సామర్థ్యం నాకుందా అనిపిస్తుంది కానీ ఓ మంచి సినిమా చేశాను అందుకే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తున్నారని మాత్రం నమ్ముతాను'అంటున్నారు అక్కినేని సమంత. గత కొంతకాలంగా రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలకు దూరంగా కొత్త తరహా చిత్రాల్లో నటిస్తూ సవాళ్లతో కూడుకున్న పాత్రల్ని ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆమె నటించిన తాజా చిత్రం 'ఓ బేబీ'. నందినిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం సమంత హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి.

ఇప్పటికీ 'ఓ బేబీ' పాత్రలోనే ఉండిపోయారా? లేక ఆ పాత్ర నుంచి బయటికి వచ్చేశారా?

ఖచ్చితంగా వచ్చేశాను (నవ్వుతూ). ఈ సినిమా గురించి మాట్లాడినంతగా నేను ఇంతవరకు ఏ సినిమా గురించి మాట్లాడలేదు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. రేపటి నుంచి ఈ సినిమా గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అంతగా దీని గురించి ప్రచారం చేశాను. 'ఓ బేబీ' చిత్రాన్ని చాలా మంది చూడాలి. అలా అంతా చూడదగ్గ చిత్రమిది. ఈ కథకి మిగతా చిత్రాలకు మించి ప్రచారం చేయాలి. అందుకే చేశాను.

తిరుపతి వెళ్లినట్టున్నారు? సెంటిమెంట్‌గా భావించి వెళుతున్నారా?

నాగచైతన్య నటించిన ప్రతి సినిమా విడుదల సమయంలో తిరుపతి వెళుతుంటాను. కానీ నేను నటించిన ఏ సినిమా కోసం తిరుపతి వెళ్లలేదు. ఈ సారి ఈ చిత్ర టీమ్ కారణంగా నా సినిమా కోసం తొలిసారి తిరుపతి వెళ్లాల్సి వచ్చింది.

ఈ సినిమాకు మీ స్టార్‌డమ్ ప్లస్ అవుతుందని అంతా అంటున్నారు?

ప్రతి సినిమా నాకు ఓ పరీక్షే. నా కోసం ఎంత మంది థియేటర్‌కు వస్తారన్న విషయంలో నాకు ఇంకా స్పష్టతలేదు. ఇంత వరకు నేను మహేష్‌బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించాను. వాళ్లతో నటించినప్పుడు థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులు నా కోసమే వస్తున్నారా? అన్నది ఇంకా నాకు అర్థం కాలేదు. ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే సామర్థ్యం నాకుందా అనిపిస్తుంది కానీ ఓ మంచి సినిమా చేశాను అందుకే ప్రేక్షకులు థియేటర్‌కు వస్తున్నారని మాత్రం నమ్ముతాను. ఈ సినిమా టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. దాని కారణంగానే సినిమాపై మంచి నమ్మకంతో వున్నాం.

> **హీరోల స్థాయిలో మీకు భారీ కటౌట్ ఏర్పాటు చేయడం ఎలా అనిపిస్తోంది?**
> గతంలో నయనతార, అనుష్కలకు భారీ కటౌట్‌లు పెట్టారు. కటౌట్‌లది ఏముంది కలెక్షన్‌లు కావాలి కానీ. 'యూటర్న్' సినిమా చూసిన వాళ్లంతా బాగుంది అన్నారు కానీ ఆశించిన స్థాయిలో మాత్రం కలెక్షన్‌లు రాలేదు. ఈ సినిమాకు అలా జరగకూడదు.

'ఓ బేబీ' అన్ని రకాల భావోద్వేగాలమయం. ఆ కారణంగానే ఈ చిత్ర కథని ఎంచుకున్నారా?

కావాలనే ఈ కథని ఎంచుకున్నాను. కథానాయికలకు ప్రతీసారి థ్రిల్లర్ జానర్, సందేశాత్మక చిత్రాలు చాలా బరువుగా అనిపిస్తాయి. ఇలాంటి చిత్రాలకు పెద్దగా కలెక్షన్స్ రావు. ఇది 'యూటర్న్' విషయంలో అర్థమైంది. ఆ చిత్రానికి మంచి సమీక్షలు ఇచ్చారు. కానీ ఆశించిన స్థాయిలో మాత్రం కలెక్షన్స్‌ని మాత్రం రాబట్టలేకపోయింది. ఆ సినిమా విషయంలో ప్రేక్షకుల్ని తప్పుపట్టడం లేదు. అయితే దాని విషయంలో ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను. మేం ఓ వర్గం ప్రేక్షకులకు మాత్రమే నచ్చే సినిమా చేశాం. ఆ వర్గం వారే ఆదరించారు. అందుకే కలెక్షన్స్ బాగా రాలేదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే 'ఓ బేబీ' చిత్రాన్ని ఎంచుకున్నాను. ఇదొక సార్వజనీనమైన కథ. కామెడీ, ఎమోషన్ ఇలా అన్ని రకాల భావోద్వేగాలు ఇందులో వున్నాయి. ఇది కూడా ఆడకపోతే నేనేం చెయ్యలేను(నవ్వుతూ).

ఈ కథ మీకు టఫ్‌గా అనిపించలేదా?

భావోద్వేగాలు, రొమాన్స్, డ్రామా ఇవన్నీ నాకు తెలుసు. అయితే కామెడీని పండించడం మాత్రం తెలియదు. 'అఆ'లో కొంత వరకు కామెడీ చేయగలిగాను కానీ పూర్తి స్థాయిలో మాత్రం నాకు ఇదే తొలిసారి. ప్రతి రోజు అదే మూడ్‌లో వుండాలి. అలా నటించడం నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఎందుకంటే 70 ఏళ్ల బామ్మగా కనిపించాలి. ఆ వెంటనే 25 ఏళ్ల అమ్మాయిగా కనిపించాలి. ఏది చేసినా సహజంగా వుండాలి. అలా అని ఎక్కడా ఓవరాక్షన్ చేస్తున్నట్లుగా వుండకూడదు. కామెడీ చెయ్యాలి కానీ నేను కామెడీ చేయడానికి ప్రయత్నిస్తున్నట్టుగా కనిపించకూడదు. 'ఓ బేబీ' నాకొక బిగ్ ఛాలెంజింగ్ రోల్ అనిపించింది.

ఈ సినిమాతో పూర్తి స్థాయి నటిగా నిరూపించుకున్నాను అనుకుంటున్నారా?

అలా అని నేను ఎప్పుడూ భావించను. ప్రతీ సారి ఏదో ఒకటి కొత్తగా చేయాలనే ప్రయత్నిస్తుంటాను.

భవిష్యత్తులో ఏ దర్శకుడితో కలిసి పనిచేయాలనుకుంటున్నారు?

శేఖర్ కమ్ముల హీరోయిన్‌లని తెరపై చూపించే తీరు బాగుంటుంది. ఆయన దర్శకత్వంలో నటించాలని వుంది.

సీతా కల్యాణ వైభోగమే

'రణరంగం' చిత్రంలో శర్వానంద్, కల్యాణి ప్రియదర్శన్

శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రణరంగం'. సుధీర్‌వర్మ దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియదర్శన్ కథానాయికలు. చిత్రీకరణ తుదిదశలో ఉంది. త్వరలో ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. 'సీతా కల్యాణ వైభోగమే..రామ కల్యాణ వైభోగమే..' అనే పల్లవితో నాయకానాయికల పెళ్లి ఘట్టం నేపథ్యంలో ఈ గీతం కన్నులపండువగా సాగింది. బాలాజీ రాసిన ఈ పాటను శ్రీహరి ఆలపించారు. ప్రశాంత్ పిళ్లై స్వరకర్త. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇటీవలే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. 90వ దశకం నాటి శర్వానంద్ లుక్ అందరిని ఆకట్టుకుంటున్నది. మాఫియా నాయకుడి నేపథ్య కథ ఇది. యాక్షన్, సెంటిమెంట్ అంశాలతో మెప్పిస్తుంది' అన్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.